# అధ్యాయం 2 - వైతథ్య ప్రకరణం

మొదటి అధ్యాయమైన ఆగమ ప్రకరణం చూశాము. మాండూక్యోపనిషత్తులో ఉన్న మంత్రాలన్నీ మొదటి అధ్యాయంలోనే ఉన్నాయి కాబట్టి దానికి ఆగమ ప్రకరణం అని పేరు వచ్చింది. ఉపనిషత్తు వేదంలో ఒక భాగం; వేదాన్ని ఆగమం అని కూడా అంటారు. వేదాలు సాక్షాత్తూ ఆ భగవంతుణ్ణుంచే వచ్చాయి. మన దాకా గురుశిష్య పరంపరగా వచ్చాయి.

**ఈశ్వరాత్ గురుశిష్య పరంపరయా ఆగతాః**

ఆగమం పదానికి ఇంకొక అర్థం కూడా ఉంది. ఆలయాల్లో పూజా విధానాల గురించి చెప్పేటప్పుడు, వాటిని ఆగమశాస్త్రాలు అంటారు. అక్కడ ఆగమం అంటే వేదాలు కావు. ఇవి వేదానికి భిన్నంగా ఉంటాయి, కాని ఇవి కూడా సాక్షాత్తూ భగవంతుణ్ణుంచే వచ్చి, పరంపరగా కొనసాగుతూనే ఉన్నాయి. అలా మనకు శైవపరంపర ఉంది. శైవ ఆగమశాస్త్రాలు శివుని ఆలయనిర్మాణాల గురించిన వివరణలు, శివపూజా విధానాల గురించి నిర్దేశిస్తాయి.

అలాగే వైష్ణవ ఆగమశాస్త్రాలు వైష్ణవ ఆలయనిర్మాణాల గురించిన వివరాలు, వైష్ణవ పూజావిధానాల గురించి నిర్దేశిస్తాయి. అలాగే శాక్త ఆగమశాస్త్రాలు శక్తి లేదా దేవి ఆలయ నిర్మాణాల గురించి, శక్తి లేదా దేవీ పూజావిధానాల గురించి నిర్దేశిస్తాయి.

ఆ విధంగా ఈ ఆగమశాస్త్రాలు వేరు. వీటిని మనం గౌరవిస్తాము. పూజావిధానాలకు ఉపయోగిస్తాము, కాని అవి వేదాలలోకి రావు. ఇక్కడ మాండూక్యోపనిషత్తులోని ఆగమ ప్రకరణంలోని ఆగమం అంటే వేదమే. ఆ ప్రకరణంలో గౌడపాదాచార్యుల వారి కారికలు కూడా ఉన్నాయి. నిజానికి మంత్రాలు 12 ఉంటే, కారికలు 29 ఉన్నాయి. అయినా ఈ కారికలు ఉపనిషత్తును ఆధారంగా చేసుకుని వచ్చాయి కాబట్టి, వాటికే ప్రాముఖ్యతను ఇస్తూ, ఆగమ ప్రకరణం అనే పేరు వచ్చింది.

ఇప్పుడు మనం రెండవ అధ్యాయంలోకి అడుగుపెట్టబోతున్నాము. దాని పేరు వైతథ్య ప్రకరణం. ఈ వైతథ్య ప్రకరణంలో 38 కారికలున్నాయి. ఉపనిషత్తు మంత్రాలన్నీ మొదటి అధ్యాయంలోనే అయిపోయాయి కాబట్టి, ఇకముందు వచ్చేవన్నీ కారికలే. ఈ అధ్యాయం, ఉపనిషత్తులో వచ్చిన ఏడవ మంత్రంలోని ఒక్క పదంయొక్క విశ్లేషణ.

## మంత్రం 7

**నాంతః ప్రజ్ఞం న బహిప్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్।**
**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం**
**ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

ఆ ఒక్క పదం **ప్రపంచోపశమమ్.** అది ఒక సంయుక్త పదం. దీన్ని విడదీస్తే ప్రపంచ+ఉపశమమ్ అని వస్తుంది. ఈ అధ్యాయం దీనిమీద విశ్లేషణ. అలాగే ఈ మంత్రంలో **అద్వైతమ్** పదం తీసుకుని, దాన్ని మూడవ అధ్యాయంలో చాలా వివరంగా విశ్లేషించారు గౌడపాదాచార్యులవారు.

ప్రపంచోపశమమ్ అంటే ఏమిటి? ఏడవ మంత్రం వివరణ చూసినప్పుడు చూసిన వివరణను మళ్ళీ ఇక్కడ ఒకసారి గుర్తు తెచ్చుకుందాము. తురీయాన్ని వివరించటానికి వాడిన పదాల్లో ఇదొక పదం. ప్రపంచోపశమంలో ప్రపంచం అంటే జగత్తు. జగత్తు అంటే ఒక్క జాగ్రత్ ప్రపంచాన్నే కాదు, మూడు ప్రపంచాలనీ తీసుకోవాలి. మొదటిపాదంలో చూసిన జాగ్రత్ ప్రపంచం; రెండవపాదంలో చూసిన సూక్ష్మప్రపంచం; మూడవపాదంలో చూసిన కారణప్రపంచం మూడూ వస్తాయి. వాటితో పాటు వాటికి సంబంధించిన స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరాలను కూడా తీసుకోవాలి. ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రపంచం అంటే పాదత్రయంలో వచ్చిన ప్రపంచత్రయం, శరీరత్రయం.

ఉపశమం అంటే దాన్నించి స్వేచ్ఛ. అంటే ప్రపంచరహితం. తురీయంలో ప్రపంచోపశమం అంటే తురీయంలో ఈ మూడు ప్రపంచాలు లేవని అర్థం. ప్రపంచత్రయ రహితం. ఈ పాదత్రయంలో రెండేసి జంటలను చూశాము. అవి విశ్వ–విరాట్ జంట; తైజస–హిరణ్యగర్భ జంట; ప్రాజ్ఞ–ఈశ్వరుల జంట. తురీయంలో ఈ జంటలేమీ లేవు. ఈ విధంగా, ఈ ఒక్క ప్రపంచోపశమం పదంతో ఉపనిషత్తు మొత్తం ప్రపంచాన్నే నిషేధిస్తున్నది.

నిషేధం పదం ఎందుకంత ముఖ్యం? వేదాంతబోధలో ఇదొక ముఖ్యభాగం. ఇదొక సాంకేతికపదం.

### నిషేధం ప్రాముఖ్యత

ఒక వస్తువును నిషేధించాలంటే, ఉనికి ఉన్న వస్తువును నిషేధిస్తారా, ఉనికి లేని వస్తువును నిషేధిస్తారా అంటుంది వేదాంతం. నిజానికి వేదాంతం ఈ రెండింటినీ నిషేధించలేరు అంటుంది. ఎందుకు?

ఉనికి ఉన్న వస్తువును నిషేధించలేము; దానికి ఉనికి ఉంది కాబట్టి. అలాగని ఉనికి లేని వస్తువునూ నిషేధించనవసరం లేదు; ఎందుకంటే దానికి ఉనికే లేదు కాబట్టి. అందువల్ల నిషేధించాల్సిన వస్తువు ఉనికి ఉన్న వస్తువూ కాదు, ఉనికి లేని వస్తువూ కాదు. ఉనికి ఉన్న

వస్తువును సత్ అనీ, ఉనికి లేని వస్తువును అసత్ అనీ అంటాము. నిషేధవస్తువు ఈ రెండూ కాదు – **సత్ అసత్ విలక్షణమ్**.

**సత్యేన న బాధ్యేత అసత్యేన న ప్రలీయేత**

అందువల్ల ప్రపంచం నిషేధించబడుతున్నది అంటే అది సత్‌లోకీ రాదు, అసత్‌లోకీ రాదు. ఈ రెండింటికీ చెందకపోతే, మరి ప్రపంచం ఏమిటి? వేదాంతం అది మిథ్యా జగత్తు అంటున్నది. మిథ్య అంటే అసలు ఉనికి లేదని కాదు అర్థం. మిథ్య అంటే ఉనికి లేనట్టుగా ఉన్నది. ఉదాహరణకు ఎండమావి. ఎండమావిని దూరం నుంచి చూస్తే, నీరు ఉన్నట్టుగా అనిపిస్తుంది; కాని దగ్గరికి వెళ్ళిచూస్తే నిజంగా నీరు ఉండదు.

గౌడపాదాచార్యులవారు స్వయంగా ఇచ్చిన ఉదాహరణ రజ్జు–సర్పభ్రాంతి. పాము ఉన్నట్టుగా ఉంది, కాని దగ్గరికి వెళ్ళి చూస్తే నిజంగా లేదని తెలుస్తుంది. అలాగని ఉనికి లేదని అందామా అంటే అది మిమ్మల్ని భయపెట్టింది, చెమటలు పట్టేలా చేసింది. పోనీ ఉందని అందామా అంటే అసలు అక్కడ పాము అనేదే లేదు. అందువల్ల ఈ రజ్జు–సర్ప భ్రాంతిలోని పాము సత్ అసత్ విలక్షణమ్.

గౌడపాదాచార్యులవారు ఇచ్చిన ఇంకొక ఉదాహరణ స్వప్నవృత్తాంతం. ఒక స్వాప్నికునికి తను స్వప్నంలో ఉన్నంతవరకూ తన స్వప్నం, స్వప్నం అని తెలియదు. అందులో పులి వెంటాడితే, నిజమనుకుని భయపడి పరుగులు తీస్తాడు. లేచాక కానీ అది నిజంకాదని తెలియదు. అంటే స్వప్నం కూడా **సత్ అసత్ విలక్షణమ్**.

ప్రపంచోపశమం పదం ప్రపంచ మిథ్యత్వాన్ని సూచిస్తుంది. ఉపనిషత్తు జగన్మిథ్యా అని ఇంత స్పష్టంగా చెప్పదు కాని, దాని గూడార్థం అదే. వేదాంతసారం –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఈ రెండు పదాలూ అద్వైతమ్, ప్రపంచోపశమమ్ – ఈ సారాన్ని సూచిస్తాయి. అద్వైతమ్ అంటే బ్రహ్మసత్యం; ప్రపంచోపశమమ్ అంటే జగన్మిథ్యా. గౌడపాదాచార్యులవారు ఈ గూడార్థాన్ని స్పష్టంగా వివరించదలుచుకున్నారు. అందువల్లనే ఈ అధ్యాయానికి వైతథ్య ప్రకరణం అనే పేరు వచ్చింది.

వైతథ్యం అంటే మిథ్యాత్వం. వితథం అంటే మిథ్య, అసత్యం; ప్రకరణం అంటే అధ్యాయం. అందువల్ల వైతథ్య ప్రకరణం అంటే మిథ్యాత్వాన్ని వెల్లడించే అధ్యాయం. దేని మిథ్యాత్వాన్నో ఈ పేరు సూచించదు కాని, మనం ఊహించవచ్చు. బ్రహ్మ మిథ్య కాదని తెలుసు. ఇంక ఉన్నది జగత్తు ఒకటే. జగత్తుయొక్క మిథ్యాత్వాన్ని వెల్లడిస్తుంది. జగత్తు అంటే మూడు శరీరాలు + మూడు ప్రపంచాలు అని మర్చిపోకూడదు. అయితే దీని సారాంశం ఏమిటి?

అది మూడవ అధ్యాయం చివర్లో చూస్తాము; కాని ఇక్కడ దాన్ని టూకీగా చూద్దాము. మొత్తం జగత్తు మిథ్య కాబట్టి, అది తురీయానికి చెందదు. మిథ్యా వస్తువు ఉన్నా లేనట్టే లెక్క. మీకు దాహం వేస్తే, ఎండమావులలోని నీరు మీ దాహాన్ని తీర్చలేదు; రజ్జు–సర్పభ్రాంతిలో కనపడిన పామునుంచి విషాన్ని మందుగా తీయలేరు; స్వప్నంలో సంపాదించిన లక్షలను ఇల్లు కొనటానికి ఇక్కడ వాడలేరు.

సూత్రం ఇదీ! ఏదైతే మిథ్యో దాన్ని సత్యంగా పరిగణించలేరు. అది ఉన్నా లేనట్టే. అందువల్ల ఈ సూత్రం ప్రకారం జగత్ మిథ్య కాబట్టి, అది ఉన్నా లేనట్టే. జగత్తు లేదంటే, ఇంక ఉన్నదేమిటి? తురీయం ఒకటే. తురీయంలేకుండా, రెండవదిలేదు. అందువల్ల అది అద్వైతం. అద్వైతం అంటే రెండవది లేని ఏకవస్తువు. ప్రపంచం అనుభవంలోకి వస్తుంది. నిజమే కాని ఆ అనుభవాన్ని లెక్కలోకి తీసుకోకూడదు. ఎందుకంటే అది మిథ్య.

ప్రపంచమిథ్యాత్వం ఉపసిద్ధాంతం, తురీయం అద్వైతం. తురీయం అద్వైతం అయితే, అసలు తురీయం పదానికే అర్థం లేదు. సంస్కృతంలో తురీయం అంటే నాలుగవది అని అర్థం. అద్వైతం అంటే రెండవది లేనిది. రెండవదేలేనిది, నాలుగవది ఎలా అవుతుంది? ఈ పదాలు పరస్పర విరుద్ధంగా లేవా? కాని ఉపనిషత్తుకు ఈ విషయం తెలియదను కుంటున్నారా? అది ఇలాంటి ప్రశ్న అడుగుతారని తెలిసే, జాగ్రత్తగా ముందే ఒక పదం వేసింది.

**చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః**

మన్యంతే అంటే అని భావిస్తున్నారు. ఎవరు? అజ్ఞానులు భావిస్తున్నారు, జ్ఞానులు కాదు. జ్ఞానులకు స్పష్టంగా తెలుసు – మొదటి మూడు పాదాలు మిథ్య అనీ, తురీయం మాత్రమే సత్యం అనీను. ఉన్నదొకటే అద్వైతం. అందువల్ల ప్రపంచోపశమం సహజంగా అద్వైతానికి దారితీస్తుంది. ఈ రెండింటి గురించీ వివరించే రెండు అధ్యాయాలనూ జంట అధ్యాయాలుగా భావించవచ్చు.

రెండవ అధ్యాయం జగన్మిథ్యా అనేది నిరూపించాలి. శ్రుతే ఏడవ మంత్రంలో **ప్రపంచోపశమమ్** పదం ద్వారా జగత్ మిథ్య అని చెప్పింది. కాని గౌడపాదాచార్యులవారు దాన్ని ఇంకా వివరంగా మరి కొన్ని శ్రుతివాక్యాల ద్వారా చూపించటమే కాక, దానికి తోడుగా యుక్తిప్రమాణాన్ని కూడా చొప్పించారు.

యుక్తిప్రమాణాన్ని చూసేముందు అసలు ఈ యుక్తిప్రమాణం అంటే ఏమిటో కొంచెం తెలుసుకోవాలి. యుక్తిప్రమాణానికి ప్రత్యేకించి ఒక శాస్త్రమే ఉంది. దాన్ని న్యాయశాస్త్రం లేదా తర్కశాస్త్రం అంటారు. తర్కం ఉపయోగించాల్సిన సరియైన పద్ధతి ఏమిటి, ఎలా

పొరపాటుగా ఉపయోగిస్తారు, ఎన్ని పొరపాటు మార్గాలు ఉన్నాయి, తర్కంలో ఉండే లొసుగులు ఏమిటి - ఇటువంటి అనేక అంశాలను చర్చిస్తుంది ఆ శాస్త్రం.

**రెండు రకాల యుక్తిప్రమాణాలు -**

1. **అనుమాన ప్రమాణం** - తర్కంలో వాడే అనుమాన ప్రమాణం గురించి కొంచెం వివరంగా చూద్దాము. తర్కం వాడేముందు, కొంత సమాచారాన్ని ప్రత్యక్ష ప్రమాణం ద్వారా సేకరించి పెట్టుకోవాలి. ఇలా సేకరించుకున్న జ్ఞానాన్ని వ్యాప్తిజ్ఞానం అంటారు తర్కశాస్త్రంలో. వ్యాప్తి అంటే రెండు వస్తువులు కలిసి ఉండటం. దీనికి శాస్త్రం చెప్పే సాధారణ ఉదాహరణ పొగ, అగ్ని.

ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుందని యజ్ఞయాగాదులు చేసే ఎవరికైనా తెలుస్తుంది. యజ్ఞాల ద్వారా ఎందుకు? పూర్వకాలపు వంటింట్లో కట్టెపుల్లలతో వంట చేసేవారు. అక్కడ కూడా పొగ, అగ్ని రెండూ కలిసే ఉంటాయి. దీన్నించి ఒక వ్యాప్తివాక్యాన్ని ఏర్పరచారు.

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుంది. కాని ఇప్పటి వంటిల్లు చూస్తే అగ్ని ఉంటుంది కాని పొగ ఉండదు. అందువల్ల వ్యాప్తివాక్యాన్ని జాగ్రత్తగా వాడాలి. ఎక్కడ అగ్ని ఉంటే అక్కడ పొగ ఉంటుంది అనకూడదు.

ఇప్పుడు ఈ సూత్రాన్ని ఉపయోగించి, తర్కం ద్వారా ఎలా ఒక నిర్ణయానికి వస్తామో చూద్దాము. మీరు, మీకు కొంచెం దూరంగా ఉన్న కొండను చూశారు. కొండనుంచి పొగ వస్తున్నది. పొగ మాత్రమే కనిపిస్తున్నది కాని, అగ్ని కనబడటం లేదు. కాని మీరు పొందిన వ్యాప్తిజ్ఞానాన్ని ఇక్కడ ఉపయోగిస్తారు. ఏమిటది? ఎక్కడ పొగ ఉంటే, అక్కడ అగ్ని ఉంటుంది. అందువల్ల అక్కడ అగ్ని కనబడకపోయినా, కొండ దగ్గర అగ్ని ఉందని చెబుతారు. ఇది ప్రత్యక్షంగా తెలియకపోయినా, తర్కం ఉపయోగిస్తారు. దానికి మీకు ప్రత్యక్షప్రమాణం యాగశాలే. ఇలా మీరు చెప్పిన వాక్యాన్ని అనుమానవాక్యం అంటారు. అది -

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

ఈ వాక్యంలో నాలుగు అంశాలు ఉండాలి.

ఎ) **పక్షం** - పర్వతః - విషయం దేని గురించి? పర్వతం గురించి. పర్వతం అంటే కొండ. ఈ విషయాన్ని పక్షం అంటారు. ఇది ప్రత్యక్షం. ఎందుకంటే కొండే అసలు కనపడకపోతే, కొండ దగ్గర అగ్ని ఉందా లేదా అనే చర్చకు ఆస్కారమే లేదు.

బి) **సాధ్యం** – అగ్నిమాన్ – అగ్ని ఉందని మనం చేసే నిర్ణయం. అగ్ని కనబడితే మనం తర్కం ఉపయోగించనవసరం లేదు. అందువల్ల అది అప్రత్యక్షం.

సి) **హేతువు** – ధూమవత్వాత్ – కొండ దగ్గర పొగ చూస్తే, కొండ దగ్గర అగ్ని ఉందని నిరూపిస్తాము. హేతువు ప్రత్యక్షం.

డి) **దృష్టాంతం** – మహానసే. పూర్వపు వంటిల్లు దీనికి ఉదాహరణ. ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుందనే వ్యాప్తివాక్యాన్ని ఈ ఉదాహరణ గుర్తుతెస్తుంది. వీటిని మళ్ళీ పట్టికలో చూద్దాము.

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

| | | | | |
|---|---|---|---|---|
| పక్షం | పర్వతః | కొండ | వస్తువు | ప్రత్యక్షం |
| సాధ్యం | అగ్నిమాన్ | అగ్ని ఉంది | నిర్ణయం | అప్రత్యక్షం |
| హేతువు | ధూమవత్వాత్ | పొగ కనిపిస్తోంది | కారణం | ప్రత్యక్షం |
| దృష్టాంతం | మహానసే | వంటింటిలో ఉన్నట్టుగా | ఉదాహరణ | అంతకు ముందు ప్రత్యక్షం |

కొండ దగ్గర పొగను చూసి అగ్ని ఉందని ఊహిస్తారు, వంటింటిని దృష్టిలో పెట్టుకుని. దానికి వ్యాప్తివాక్యం,

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

2. **అర్థాపత్తి ప్రమాణం** – మనకు తెలిసిన విషయం ఆధారంగా, తెలియని విషయాన్ని కల్పన ద్వారా ఊహించుకోవటాన్ని అర్థాపత్తి ప్రమాణం అంటారు.

ఉదాహరణకు మీరు రాత్రి బాగా నిద్రపోయి లేచారు. పొద్దున్న చూస్తే రోడ్లన్నీ నీళ్ళతో నిండివున్నాయి. అంటే రాత్రి వానపడి ఉంటుందని ఊహిస్తారు.

శాస్త్రం నేర్చుకునేటప్పుడు ఈ రెండు ప్రమాణాలనూ శాస్త్రం చెప్పిన విషయాలకు అన్వయించి నేర్చుకోవాలి. దీన్ని శ్రుతి అనుమాన ప్రమాణం, శ్రుతి అర్థాపత్తి ప్రమాణం అంటారు. రెండవ ప్రమాణానికి ఒక ఉదాహరణ చూద్దాము. ముందు చూసిన ఉదాహరణను లౌకిక ఉదాహరణ అంటారు. అక్కడ ప్రత్యక్షప్రమాణం వాన కురిస్తే, రోడ్లన్నీ నీళ్ళతో నిండి ఉంటాయని తెలియటం. ఇక్కడ ప్రత్యక్షప్రమాణం చోట శ్రుతివాక్యాలను తీసుకోవాలి. శ్రుతి ప్రత్యక్షంగా చెప్పనిదాన్ని, తర్కం ద్వారా తెలుసుకుంటాము.

**హంతా చేన్మన్యతే హంతుం హతశ్చేన్మన్యతే హతమ్**
**ఉభౌ తౌ న విజానితో నాఽయం హంతి న హన్యతే** – కఠ 1.2.19

ఆత్మ చంపేది కాదు, చంపబడేది కాదు అంటున్నది. దీన్నిబట్టి శ్రుతి అర్థాపత్తి – ఆత్మ అకర్తా, అభోక్తా. ఆత్మ ఏ పనీ చేయదు, ఏదీ అనుభవించదు.

ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలో అడుగుపెడదాము. వైతథ్య ప్రకరణంలో ముఖ్యంగా ఐదు అంశాలు ఉన్నాయి.

1. స్వప్నప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 1-3
2. జాగ్రత్‌ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 4-18
3. కల్పనా ప్రకారాః – కారికలు 19-29
4. ఉపసంహారః – కారికలు 30-34
5. సాధనాని, ఫలమ్ – కారికలు 35-38

**1. స్వప్న ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 1-3**

మనం అనుభవించే ప్రపంచాన్ని గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచం అంటున్నారు. ఎందుకంటే ఈ ప్రపంచాన్ని జాగ్రదావస్థలోనే అనుభవిస్తాము. ఎప్పుడైతే నిద్రలోకి జారుకుంటామో, అప్పుడే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా మాయమైపోతుంది.

గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచం మిథ్య అని ఇందాక మనం చూసిన అనుమానవాక్యం ద్వారా నిరూపించదలుచుకున్నారు. ఆ వాక్యాన్ని మళ్ళీ చూద్దాము.

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ మహానసే**

అక్కడ పర్వతః స్థానంలో జాగ్రత్ ప్రపంచం తీసుకున్నారు. అందువల్ల అది పక్షం అవుతుంది. అక్కడ అగ్ని ఉందని నిర్ణయానికి వస్తే ఇక్కడ మిథ్య అని నిర్ణయం తీసుకుంటారు. అది సాధ్యం. దానికి కారణం పొగ ఉండటం అని అక్కడ చూశాము. కాని ఇక్కడ కారణం ఆరవ మంత్రంలో వస్తుంది. అది హేతువు. అప్పుడు చూద్దాము. అక్కడ ఉదాహరణ వంటిల్లు అయితే, ఇక్కడ ఉదాహరణ స్వప్నప్రపంచం. అది దృష్టాంతం. ఇప్పుడు ఈ అనుమానవాక్యం ఇలా వస్తుంది.

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా ... స్వప్న ప్రపంచవత్**

ఈ ఖాళీని తరువాత పూరిద్దాము. ఈ తర్కం గౌడపాదాచార్యులవారి పద్ధతి. కాని ఈ పద్ధతిని చూసేముందు ఒక సమస్య ఉంది. ఏమిటది?

ఈ అనుమానవాక్యంలో స్వప్నప్రపంచంలాగా జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య అన్నారు. కాని అది ఎప్పుడు స్వీకరిస్తారు? స్వప్నప్రపంచం మిథ్య అని నమ్మితేనే!

**ఈ వ్యక్తి ఐన్‌స్టీన్‌లాగా తెలివైనవాడు**

ఈ వాక్యాన్ని అందరూ ఒప్పుకుంటారు. ఎందుకంటే ఐన్‌స్టీన్ తెలివైనవాడనేది జగమెరిగిన సత్యం.

**ఈ వ్యక్తి నాలా తెలివైనవాడు**

ఈ వాక్యాన్ని అంత తేలికగా ఒప్పుకోలేరు. ఎందుకంటే నా తెలివితేటల గురించి అందరికీ తెలియదు. మనం ఇచ్చే ఉదాహరణ అందరూ ఒప్పుకునేదిగా ఉండాలి. ఇక్కడ స్వప్నప్రపంచం మిథ్య అని అందరూ ఒప్పుకోరు. కొంతమంది స్వప్నప్రపంచం కూడా సత్యం అంటారు. అందువల్ల గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచంయొక్క మిథ్యాత్వ నిశ్చయాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టి, ముందు స్వప్నప్రపంచ మిథ్యాత్వ నిశ్చయం చేయదలుచుకున్నారు. అది మిథ్య అని నిరూపించాక, దానిలాగా జాగ్రత్ప్రపంచం కూడా ఫలానా కారణంవల్ల మిథ్య అని నిరూపించటం తేలిక.

అందువల్ల మొదటి అంశం **స్వప్నప్రపంచ మిథ్యాత్వమ్** అయింది. ఏదైనా ఒక విషయాన్ని నిరూపించటానికి మూడు విషయాలు వాడతారు. అవి శ్రుతిప్రమాణం, యుక్తిప్రమాణం, అనుభవప్రమాణం. శ్రుతిప్రమాణంలో ఉపనిషత్తు వాక్యాలను ఉటంకిస్తారు; యుక్తి ప్రమాణంలో తర్కం ఉపయోగిస్తారు; అనుభవప్రమాణంలో మనకు జరిగే అనుభవాన్నిబట్టి నిరూపిస్తారు. వీటిల్లో ముందు యుక్తిప్రమాణం వాడుతున్నారు గౌడపాదాచార్యులవారు.

శ్రుతి ప్రపంచోపశమమ్ పదం ఉపయోగించిందనీ, దాని అర్థం పరోక్షంగా జగత్ మిథ్య అనీ చూశాము. ఇలా శ్రుతి చెప్పిన వాక్యంనుంచి, తర్కం ఉపయోగించి చెప్పటాన్ని శ్రుతి అర్థాపత్తి ప్రమాణం అంటారని కూడా చూశాము. ప్రపంచోపశమమ్ అంటే మిథ్య అని ఎలా చెప్పగలము? మనం సత్ వస్తువునూ నిషేధించలేము, అసత్ వస్తువునూ నిషేధించలేము; కాని శ్రుతి ప్రపంచాన్ని నిషేధించిందంటే అది సత్ కాదు, అసత్ కాదు; సత్ అసత్లకు విలక్షణంగా ఉండివుండాలి. అంటే అది అనుభవంలోకి వస్తుంది కాని, సత్యం కాదు. అటువంటి దాన్ని మిథ్య అంటారు.

దానికి అత్యంత సమీప ఉదాహరణ గౌడపాదాచార్యులవారికి తోచినది మన స్వప్నం. స్వప్నంలో ఉన్నంతసేపూ స్వప్నం, స్వప్నంగానే అనిపించదు. చాలా సన్నిహితంగా అందులోని విషయాలను అనుభవిస్తాము, మనకు సుఖదుఃఖాలను కలుగజేస్తుంది. అక్కడ మనకు కావాల్సినవి ఇస్తుంది కాబట్టి దానివల్ల ప్రయోజనం కూడా ఉన్నట్టు అనిపిస్తుంది. అందువల్ల స్వప్నం అనుభవంలోకి వస్తుంది, సుఖదుఃఖాలను కలుగజేస్తుంది, ప్రయోజనం ఉంది కాని ఇన్ని లక్షణాలు ఉన్నాకూడా, స్వప్నంనుంచి లేస్తే, అది మాయమైపోతుంది. అందువల్ల స్వప్నం మిథ్య అని మనం తేలికగానే స్వీకరిస్తాము. కాని స్వప్నాన్ని తేలికగా మిథ్యగా అర్థం చేసుకుంటారనే విషయాన్ని గౌడపాదాచార్యులవారు తేలికగా తీసుకోలేదు. ఆయన శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాల ద్వారా స్వప్నం మిథ్య అని నిరూపించదలుచుకున్నారు.

### కారిక 2.1

**వైతథ్యం సర్వభావానాం స్వప్న ఆహుర్మనీషిణః ।**
**అంతఃస్థానాత్తు భావానాం సంవృతత్వేన హేతునా ॥**

ఎ) **యుక్తిప్రమాణం** – జాగ్రదావస్థలో ప్రస్తుతం మనం సత్యం అనుకుంటున్న వస్తువులకు ఉనికి ఉండాలంటే, అది ఉండటానికి కొంత ప్రదేశం ఉండాలి. మనం ఏదైనా సభకో, సమావేశానికో వెళితే, అక్కడ కూర్చునేందుకు ప్రదేశంకోసం చూస్తాము. దాన్ని **ఉచితదేశం** అంటారు. అంతేకాదు, ప్రతి వస్తువుకూ ఒక కాలం కూడా ఉంటుంది. ఒక మందు కొంటేనే తయారయిన తేదీ, గడువు ముగిసే తేదీ ఉంటాయి. దాని తర్వాత వాడితే ప్రమాదం. దీన్ని **ఉచితకాలం** అంటారు. ఉచిత అంటే సరియైన, కావలసినంత.

అలాగే ఒక సంఘటన జరగాలంటే, దానికి కూడా కావాలసినంత సమయం కావాలి. అందువల్లనే భగవద్గీతను వినేవారు ఆత్మ గురించిన జ్ఞానాన్ని వంటబట్టించుకుంటారో లేదో కాని, వారికి టక్కున వచ్చే సందేహం ఒకటే. రణరంగంలో, శంఖాలు మ్రోగించాక, కృష్ణపరమాత్మ 700 శ్లోకాలతో కూడిన 18 అధ్యాయాలను ఎలా బోధించాడు? అంతవరకూ కౌరవులు ఎలా ఊరుకున్నారు? ఈ ప్రశ్న ఉదయించటానికి కారణం ఈ ఉచితదేశ, కాలనియమం గుర్తురావటంవల్లనే. ఈ నియమం సరిపోలని చోట, అది సత్యంగా అనిపించదు.

**యత్ర యత్ర సత్యత్వం తత్ర తత్ర ఉచితదేశకాల సత్వమ్**

దీనికి భిన్నంగా ఎక్కడ ఉచితదేశం, కాలం లేదో, అక్కడ ఆ వస్తువుకు కాని, సంఘటనకు కాని సత్యత్వం లేదంటాము. అందువల్ల కొందరు చరిత్రకారులు భగవద్గీతను కృష్ణపరమాత్మ బోధించలేదు, వ్యాసాచార్యులవారి సృష్టి మాత్రమే అనకపోలేదు.

లౌకిక ఉదాహరణ తీసుకుంటే, అద్దంలో ఏనుగుని చూశారనుకోండి. ఆ అద్దంలో నిజంగా ఏనుగు ఉండగలదా? మనం ఒక కాలేస్తేనే అద్దం విరిగిపోతుంది; అలాంటిది అంత పెద్ద ఏనుగు అద్దంలో ఎలా దూరగలదు? ఏనుగుకు అక్కడ ఉచితదేశం లేదు కాబట్టి, అద్దంలో ఏనుగు మిథ్య.

**యత్ర యత్ర ఉచితదేశకాల అభావః తత్ర తత్ర మిథ్యాత్వమ్**

ఇదీ వ్యాప్తివాక్యం. ఎక్కడ ఉచితదేశం కాని, కాలం కానీ లేదో, అది మిథ్య. ఈ వ్యాప్తి వాక్యాన్ని ఆధారంగా చేసుకుని గౌడపాదాచార్యులవారు స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపిస్తున్నారు. స్వప్నప్రపంచంలోని వస్తువులకు ఉచితదేశం కాని, కాలం కాని లేదు. అందువల్ల స్వప్నం మిథ్య. ఈ అంశంతో మొదలవుతున్నది వైతథ్య ప్రకరణం.

దీనికి అనుమానవాక్యం –

**స్వప్న ప్రపంచః మిథ్యా ఉచితదేశ అభావాత్ దర్పణస్థ హస్తివత్**

దర్పణ అంటే అద్దం; స్థ అంటే ఉన్న; హస్తి అంటే ఏనుగు. దర్పణస్థ హస్తివత్ అంటే అద్దంలో ఉన్న ఏనుగులాగా, మన స్వప్నప్రపంచం కూడా మిథ్య. దానికి కూడా ఉచితదేశ కాలం లేవు.

ఎందుకు? స్వప్నప్రపంచాన్ని మీ మనస్సులోనే చూస్తారు. అది మీకు భిన్నంగా, బాహ్యంగా, నిజంగా లేదు. ఎలా చెప్పగలము? మీ కల మీకు భిన్నంగా ఉంటే, మీ చుట్టూ ఉన్నవారు కూడా చూడగలగాలి కదా! మీకు నిద్రలో వేంకటేశ్వరస్వామి దర్శనం అయిందనుకోండి. మీరు ఉత్సాహం పట్టలేక, మీ పక్కవారిని లేపితే ఏమవుతుంది? వారికి వేంకటేశ్వరస్వామి దర్శనం అవదు సరికదా, దర్శనం అవుతున్న మీకు కూడా ఆగిపోతుంది. అంటే స్వప్నంలో మీరు చూసే వస్తువులు మీకు బాహ్యంగా లేవు; అవి మీ చిత్తంలోంచి వచ్చిన వస్తువులే.

ఇంకో అంశం చూస్తే, స్వప్నంలో మీరు ఎన్నో చూస్తారు. చీమలను చూస్తే సమస్య లేదు. అవి చాలా చిన్నవి. కాని ఏనుగులను చూస్తారు. ఎందుకు పదేపదే ఏనుగు అంటున్నాము? ఒక ఏనుగు ఎలా ఒక చిన్న అద్దంలో దూరలేదో, అలాగే ఒక ఏనుగు కూడా మీ చిన్ని మనస్సులో దూరలేదు. అంతేనా? మీరు ఒక ఏనుగుల గుంపు పెద్ద అడవిలో వెళుతున్నట్టుగా చూస్తారు. అడవిలో దట్టంగా చెట్లు ఉన్నాయి. అలా కొంచెం దూరం వెళ్ళాక, గలగలా పారుతున్న సెలయేరు కనిపిస్తుంది; అందులోకి అస్తమిస్తున్న సూర్యుడు కనిపిస్తాడు. ఇన్ని పెద్ద వస్తువులు చిన్ని మనస్సులో దూరగలవా? వాటికి ఉచితదేశం లేదు.

**మనీషిణః ఆహుః** – మహాత్ములు ప్రతిపాదిస్తున్నారు. ఏమని?

**సర్వభావానాం వైతథ్యమ్** – వైతథ్యమ్ అంటే మిథ్యాత్వమ్. అంటే అది అసత్యం. సర్వభావానాం అంటే అన్ని వస్తువులు, జీవులు. ఆఖరికి అక్కడ ప్రత్యేకమైన దేశం కూడా సృష్టించబడుతుంది. మీ తలలో సర్వవ్యాపకమైన దేశం ఉంటుంది. అందువల్ల అది మిథ్య. అలా ఎలా చెప్పగలరు?

**అంతఃస్థానాత్తు భావానామ్** – ఎందుకంటే అన్ని వస్తువులు, జీవులు మీలోనే ఉన్నాయి కాబట్టి. అంతఃస్థానాత్ అంటే లోపల ఉన్నాయి కాబట్టి. లోపల ఉంటే ఏమిటి సమస్య?

**సంవృతత్వేన హేతునా** – లోపల ఉండే స్థానం ఇరుకుగా ఉంటుంది కాబట్టి. సంవృతం అంటే ఇరుకు; హేతునా తర్కంవల్ల.

స్వప్నంలో చూసే వస్తువులు, జీవులు లోపల ఉంటాయి; లోపల ఉన్న స్థానం వాటికి ఇరుకుగా ఉంటుంది కాబట్టి అవి మిథ్య. **ఉచితదేశ అభావః.**

**కారిక 2.2**

**అదీర్ఘత్వాచ్చ కాలస్య గత్వా దేశాన్న పశ్యతి ।**
**ప్రతిబుద్ధశ్చ వై సర్వస్తస్మిన్ దేశే న విద్యతే ॥**

ఇప్పుడు ఉచితకాల అభావః అంశాన్ని చూడబోతున్నాము. స్వప్నంలో అనేక సంఘటనలు చూస్తారు. రైల్వేస్టేషనుకు వెళ్ళి, రైలెక్కి ఏ ఢిల్లీకో వెళతారు; లేదా విమానం ఎక్కి అమెరికా వెళతారు. ఈ సంఘటనలు జరగటానికి ఎంతకాలం పడుతుంది?

మీరు జాగ్రదావస్థలో విమానమెక్కి అమెరికా వెళ్ళాలంటే ఎంత సమయం పడుతుంది? విమానంలో ప్రయాణమే ఎన్నో గంటలు ఉంటుంది. దానికి మూడు గంటల ముందు విమానాశ్రయానికి చేరుకోవాలి. దానికి గంట ముందు మీ ఇంటినుంచి ప్రయాణించాలి. అంటే అంతా కలిపి రెండు రోజులు వేసుకోవాలి. ఇదంతా మీరు పడుకున్న కొన్ని గంటల్లో అయిపోవాలి. మీరు పడుకున్నంతసేపూ కల కనగలిగారు అనుకున్నా, మీరు చాలాసేపు పడుకున్నారు అనుకున్నా కూడా, అది ఎనిమిది గంటలకన్నా ఎక్కువ ఉండదు.

ఆ ఎనిమిది గంటల సమయం మీ అమెరికా ప్రయాణానికి సరిపోదు. అక్కడితో ఆగుతారా? అమెరికా వెళ్ళి, ఎమ్మెస్ చదివి, పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కన్నట్టుగా కలగంటారు. ఇవన్నీ జరగాలంటే గంటలు కాదు, రోజులు కాదు, సంవత్సరాలతో కూడుకున్నది. కాని ఇవన్నీ కలగంటారు. అది కూడా ఎంతసేపట్లో? ఒక కల నిడివి తొంభయి సెకన్లు మాత్రమే అంటారు. అంత తక్కువ సమయంలో అన్ని పెద్ద సంఘటనలు చకచకా జరిగిపోతాయి. అందువల్ల స్వప్నం సత్యం కాదు. ఉచితకాలం లేదు.

**అదీర్ఘత్వాచ్చ కాలస్య** – దీర్ఘం అంటే ఉచితకాలం; అదీర్ఘం అంటే ఉచితకాలం లేకపోవటంవల్ల, **గత్వా దేశాన్న పశ్యతి** – మీరు నిజంగానే ఆ దేశాలకు వెళ్ళరు. మరయితే ఏమవుతున్నది? అవి మీ మనస్సు చూపించిన స్వప్నప్రపంచంలోని విషయాలు. తమాషా ఏమిటంటే, మీరు నిద్రనుంచి లేచాక, నిజమే అది స్వప్నం అని తేలిగ్గా అర్థం చేసుకుంటారు. అప్పుడు జ్ఞానులు అవుతారు. స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ అతని స్వప్నం, స్వప్నం అని తెలియదు. నిజానికి ఆ పీడకలలను చూసి ఎంతగా చెదరిపోతారంటే, కొంతమంది నిద్రపోయేముందు పీడకలలు రాకుండా చేయమని హనుమంతుణ్ణి ప్రార్థిస్తారు కూడా. అసలు స్వప్నమే సత్యం కానప్పుడు, పీడకలలు వచ్చినా, మంచికలలు వచ్చినా ఏమీ నష్టం కాని, లాభం కాని లేదు. కాని అందులో ఉన్నంతవరకూ అది సత్యమే అనుకుంటారు.

వేదాంతం ఇదే సూత్రాన్ని ఉపయోగించి ఈ స్వప్నప్రపంచం లాగానే జాగ్రత్‌ప్రపంచం కూడా మిథ్య, అది స్వప్నం-1 అయితే, ఇది స్వప్నం-2 అంటుంది. ఖంగారు పడకండి.

అప్పుడే ఆ విషయంలోకి రావటం లేదు గౌడపాదాచార్యులవారు. ఆయన నెమ్మదిగా ఒక్కొక్క మెట్టూ ఎక్కించుకువెళుతున్నారు. చివర్లో తీసుకెళ్ళి అద్వైతంలో కూర్చోబెడతారు.

ప్రస్తుతం మనం రెండో మెట్టుమీద ఉన్నాము. మొదటిమెట్టు స్వప్నం మిథ్యా ఉచితదేశ అభావాత్. రెండవమెట్టు స్వప్నం మిథ్యా ఉచితకాల అభావాత్. ఇప్పుడు ఈ రెండు కారికలనూ కలిపి యుక్తిప్రమాణాన్ని ఒక్క వాక్యంలో చెప్పవచ్చు.

**స్వప్నప్రపంచః మిథ్యా ఉచితదేశ కాల అభావాత్ దర్పణస్థ హస్తివత్**

బి) **అనుభవ ప్రమాణం** – అనుభవ ప్రమాణాన్ని ప్రత్యక్ష ప్రమాణం అని కూడా అనవచ్చు. ఇది నిరూపించటానికి ఒక అనుభవాన్ని తీసుకుందాము. మీరు కాశీ వెళ్ళారు. అక్కడ దర్శనం చేసుకున్నాక, బయటకు వచ్చి, దుకాణాలను చూస్తూ నడుస్తున్నారు. ఒక ఆవు వచ్చి మిమ్మల్ని గుద్దితే, కింద గతుకుల రోడ్డుమీద పడ్డారు. మీరు వెంటనే లేచారు. ఆ లేచినప్పుడు ఎక్కడ ఉండాలి? దుకాణాల మధ్యలో, ఆవు ఎదురుగా, గరుకు రోడ్డుమీద నిలబడాలి. అవునా? కాని నిజానికి మీరు లేచినప్పుడు ఎక్కడ ఉన్నారు? ఏ.సి. గదిలో, మెత్తటి పరుపుమీద, దూదిలాంటి రజాయి కప్పుకుని పడుకుని ఉన్నారు. కల నిజమయితే, మీ గదిలో ఉండకూడదు కదా. అందువల్ల అనుభవప్రమాణం మీరు నిజంగా కాశీకి వెళ్ళలేదని చూపిస్తున్నది.

**ప్రతిబుద్ధశ్చ** – నిద్రనుంచి లేచాక,

**సర్వః న విద్యతే** – లేచిన వ్యక్తి అక్కడ లేవడు. ఎక్కడ?

**తస్మిన్ దేశే** – ఎక్కడ ఉన్నట్టుగా కలగన్నాడో, అక్కడ లేవడు. అంటే కాశీలో మీరు కిందపడితే, మీ మంచంమీద లేచారు. ఆ కల ఇంకొంచెం కొనసాగిందనుకోండి. అక్కడ ఆవు మిమ్మల్ని పడేస్తే, మీకు దెబ్బతగిలింది, రక్తం కారింది, డాక్టరు దగ్గరకు వెళ్ళారు, మందు వేసుకున్నారు. కాని నిద్రనుంచి లేచాక, అసలు మీరు ఆ మంచమే దిగలేదని తెలుస్తుంది. ఇలా అనుభవప్రమాణంవల్ల కూడా స్వప్నం నిజం కాదని తెలుస్తుంది.

**అనుభవ ప్రమాణం** – కలలో ఉన్న ఊరిలో నిద్రలేవము. మన గదిలో లేస్తాము.

**కారిక 2.3**

**అభావశ్చ రథాదీనాం శ్రూయతే న్యాయపూర్వకమ్ ।**
**వైతథ్యం తేన వై ప్రాప్తం స్వప్న ఆహుః ప్రకాశితమ్ ॥**

సి) **శ్రుతిప్రమాణం** – ఇప్పుడు శ్రుతిప్రమాణం ద్వారా స్వప్నప్రపంచం మిథ్య అని చూడబోతున్నాము.

**శ్రూయతే** – శ్రుతిప్రమాణం. బృహదారణ్యకోపనిషత్తులోని నాలుగవ అధ్యాయంలో, మూడవ ఖండంలో (బ్రాహ్మణం అంటారు) స్వయంజ్యోతి బ్రాహ్మణంలో అవస్థాత్రయ విశ్లేషణ అద్భుతంగా సాగుతుంది.

**న తత్ర రథా న రథయోగాః న పంథానో భవంతి అథ రథాన్**
**రథయోగాన్ పథః చ సృజతే** – బృహదారణ్యకమ్ 4.3

అక్కడ (స్వప్నప్రపంచంలో) నిజంగా రథాలు లేవు. రథాన్నిలాగే గుర్రాలు లేవు, మార్గాలు లేవు కాని వీటన్నింటినీ స్వాప్నికుడు సృష్టిస్తున్నాడు. ఇంకా ఆ భావన కొనసాగుతుంది. స్వప్నంలో ఆనందాలు, మోదాలు, ప్రమోదాలు లేవు. పుష్కరిణులు, సరస్సులు, నదులు లేవు. ఆనందిస్తున్నట్టు, నవ్వుతున్నట్టు, భయాలను చూస్తున్నట్టు అనిపిస్తుంది కాని అవి నిజంకావు.

ఇక్కడ ఉపనిషత్తు ఒక గొప్ప సూత్రాన్ని చెబుతున్నది. అది – **అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది నిజం కాదు**. ఈ సత్యాన్ని అంత తేలికగా స్వీకరించలేము, కాని మాండూక్యంలో అడుగడుగునా గౌడపాదాచార్యులవారు ఈ సత్యాన్ని బోధిస్తూనే ఉంటారు. అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది నిజం కాకపోవచ్చు వాక్యాన్నే మనం జీర్ణించు కోలేకపోతే, గౌడపాదాచార్యులవారు మనకు మింగుడు పడని, మెదడు వేడెక్కే ఇంకొక వాక్యం చెబుతారు.

**అనుభవంలోకి వస్తే అది నిజం కాదు**

అక్కడితో కూడా ఆగరు. చివరగా ఒక పిడుగులాంటి వార్త చెబుతారు.

**అనుభవిస్తున్న నువ్వు మాత్రమే సత్యం**

కాకపోతే ఈ చివరి సూత్రానికి అంత వెంటనే రాము. ముందే చెప్పినట్టుగా ఇది దశలవారీగా సాగే బోధ. ఇక్కడ శ్రుతి చెప్పిన అంశం – మీకు స్వప్నంలో అనుభవంలోకి వచ్చినంతమాత్రాన అది నిజం కాదు.

శ్రూయతే – శ్రుతౌ ఉచ్యతే – శ్రుతిలో చెప్పబడినది

**రథాదీనాం** – రథాన్ అంటే రథాలు; ఆది అంటే మొదలైనవి. అంటే ఇందాక బృహదారణ్యకోపనిషత్తులోంచి చూసిన ఆ మంత్రాన్ని ఇక్కడకు తెచ్చుకోవాలి.

**తేన** – అందువల్ల,

**వైతథ్యం ప్రాప్తమ్** – మిథ్యాత్వం నిరూపించబడినది

**న్యాయపూర్వకమ్** – యుక్తిప్రమాణం ద్వారా

**ప్రకాశితమ్** – శ్రుతిప్రమాణం ద్వారా కూడా. మనం అనుభవప్రమాణం కూడా కలుపుకోవాలి. యుక్తిప్రమాణం ద్వారా స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపించినదాన్ని శ్రుతి ద్వారా వెల్లడిస్తున్నాము.

**స్వప్న ఆహుః** – స్వప్నప్రపంచం మిథ్య అని మహాత్ములు చెబుతున్నారు.

ఇక్కడితో స్వప్నప్రపంచ మిథ్యాత్వమ్ అయిపోయింది.

### 2. జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 4–18

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు మనం నమ్మలేని సత్యాన్ని వెల్లడి చేయబోతున్నారు. మామూలుగా మన అవగాహన జాగ్రత్ ప్రపంచం సత్యం, స్వప్నప్రపంచం మిథ్య అని. అవునా? ఇక్కడ బ్యాంకులో ఉన్న మన డబ్బు సత్యం, స్వప్నప్రపంచంలో బ్యాంకులో ఉన్న డబ్బు మిథ్య. కానీ, గౌడపాదాచార్యులవారు స్వప్నప్రపంచం ఎంత మిథ్యో, ఈ జాగ్రత్ ప్రపంచం కూడా అంతే మిథ్య అని ఈ కారికల్లో నిరూపించబోతున్నారు.

ఈ అంశాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. లేకపోతే అద్వైతబోధ అయోమయంలో పడవేస్తుంది. మనం స్వప్నప్రపంచం ఎప్పుడు మిథ్య అంటున్నాము? జాగ్రత్ పురుషుని దృష్ట్యా మిథ్య. స్వప్నప్రపంచంలో ఉన్నంతవరకూ, స్వాప్నికునికి అది మహాసత్యం. స్వప్నంలో ఏం జరిగినా, స్వప్నశరీరానికి అవస్థ అవుతుంది. స్వప్నంలో ఒక కుక్క కరిస్తే, ఖచ్చితంగా స్వప్నశరీరానికి హానే అది. అతను వెంటనే స్వప్నవైద్యుడు (ఉత్త వైద్యుడు అనకూడదు) దగ్గరకు వెళ్ళి, స్వప్నమందులు తీసుకుని, స్వప్నవైద్యునికి డబ్బు చెల్లించాలి. ఓదార్పునిచ్చే విషయం ఏమిటంటే, అది నిజం డబ్బు కాదు. దీన్నిబట్టి జగత్తును ఏ స్థాయినుంచి చూస్తే సత్యమో, ఏ స్థాయినుంచి చూస్తే మిథ్యో అర్థం చేసుకోవాలి.

స్వప్నంలో ఉన్నంతవరకూ, స్వాప్నికునికి స్వప్నశరీరం పరంగా, స్వప్నప్రపంచం మహాసత్యం. కాని అతను స్వప్నప్రపంచంనుంచి నిద్రలేస్తే, స్వప్నం మిథ్యగా తేలిపోతుంది. ఇప్పుడు ఇదే సూత్రాన్ని జాగ్రత్ ప్రపంచానికి అన్వయిద్దాము. జాగ్రదావస్థలో ఉన్నంతవరకూ, జాగ్రత్ పురుషునికి, జాగ్రత్ శరీరపరంగా జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. కాని అతను జాగ్రత్ ప్రపంచంనుంచి లేస్తే, జాగ్రత్ ప్రపంచం స్వప్నం 2 గా తెలుసుకుంటాడు. అప్పుడు అది కూడా మిథ్యగా తేలిపోతుంది. జాగ్రత్ ప్రపంచంనుంచి లేస్తే అంటే నేను జాగ్రత్ శరీరాన్ని కాను, నేను తురీయచైతన్యాన్ని అనే సత్యంలో నెలకొని ఉండాలి.

స్వప్నప్రపంచం స్వప్నశరీరపరంగా సత్యం; జాగ్రత్ ప్రపంచం జాగ్రత్ శరీరపరంగా సత్యం; కాని తురీయపరంగా చూస్తే రెండూ మిథ్యే. ఇక్కడ తురీయపరంగా అన్నప్పుడు తురీయ శరీరంగా అనకూడదు. తురీయచైతన్యం పరంగా అనాలి.

**అశరీర చైతన్యం దృష్ట్యా జాగ్రత్ ప్రపంచమపి మిథ్యా**

**కారిక 2.4**

**అంతఃస్థానాత్తు భేదానాం తస్మాజ్జాగరితే స్మృతమ్ ।**
**యథా తత్ర తథా స్వప్నే సంవృతత్వేన భిద్యతే ॥**

**యథా తత్ర తథా స్వప్నే** – దీన్ని మనం ఇలా మార్చుకుందాము.

**యథా స్వప్నః తథా తత్ర (జాగ్రది చ మిథ్యా)** – యథా అంటే ఏ విధంగా అయితే ప్రపంచం మిథ్యో; స్వప్న – స్వప్నంలో; తథా తత్ర – అదే విధంగా, జాగ్రదావస్థలో జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య.

**తస్మాజ్జాగరితే స్మృతమ్** – అందువల్ల జ్ఞానులు జాగ్రత్ప్రపంచం కూడా మిథ్యే అంటారు.

స్వప్నప్రపంచం స్వప్నం–1 అయి, జాగ్రత్ప్రపంచం స్వప్న–2 అయి, రెండూ మిథ్య అయితే వాటి మధ్య భేదం ఏమిటి?

రెండూ మిథ్యే కాని వాటి మధ్య భేదం ఉంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. మిథ్యా జాగ్రత్ ప్రపంచం మీ శరీరానికి బాహ్యంగా ఉంది; కాని మిథ్యా స్వప్నప్రపంచం మీ లోపలే ఉంది.

**భిద్యతే** – మిథ్యా స్వప్నప్రపంచం, మిథ్యా జాగ్రత్ ప్రపంచానికి భిన్నంగా ఉంది. ఎలా?

**అంతఃస్థానాత్తు** – స్వప్నప్రపంచం శరీరం లోపల ఉంది. అంతేకాదు,

**సంవృతత్వేన (భిద్యతే)** – స్వప్నప్రపంచానికి ఉచితదేశ, ఉచితకాల నియమం వర్తించదు కాబట్టి అది మిథ్య అన్నాము. కాని ఇక్కడ ఆ నియమాన్ని జాగ్రత్ప్రపంచానికి ఉపయోగించలేము. ఎందుకంటే జాగ్రత్ ప్రపంచంలో ప్రతి ఒక్కవస్తువుకూ ఉచితదేశం, ఉచితకాలం ఉంది. అందువల్ల ఈ కారణంవల్ల జగత్తు మిథ్య అనలేము.

ఆ కారణం కుదరనంత మాత్రాన వేరే కారణం లేకపోతుందా? గౌడపాదాచార్యుల వారికి తెలుసు, ఏ కారణం చూపించి జగత్తును మిథ్యగా కొట్టివేయాలో, కాకపోతే మనకు ఇక్కడే, ఇప్పుడే చెప్పరు. వచ్చే కారికలో చూస్తాము. ఆ కారణం ద్వారా జగత్తు కూడా మిథ్య అంటారు గౌడపాదాచార్యులవారు.

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా ... స్వప్నప్రపంచవత్**

ఈ వాక్యాన్ని ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. కారణం ఏమిటో ఇంకా తెలియదు.

**కారిక 2.5**

**స్వప్నజాగరితస్థానే హ్యేకమాహుర్మనీషిణః ।**
**భేదానాం హి సమత్వేన ప్రసిద్ధేనైవ హేతునా ॥**

**పరోక్ష కారణం –**

**స్వప్నజాగరితస్థానే హ్యేకమ్** – స్వప్నపదార్థాలు, జాగ్రత్ పదార్థాలు రెండూ ఏకం. ఎలా? రెండూ మిథ్య. ఒకటి ఆంతరంగా అనుభవంలోకి వస్తే, ఇంకొకటి బాహ్యంగా అనుభవంలోకి వస్తుంది. అదే వ్యత్యాసం వాటి మధ్య. ఎవరంటున్నారు ఈ విషయం?

**మనీషిణః ఆహుః** – జ్ఞానులు అంటున్నారు.

**భేదానాం హి సమత్వేన** – ఇక్కడ భేదం అంటే పదార్థాలు. మామూలుగా భేదం అంటే భేదమే కాని ఇక్కడ భిన్నపదార్థాలు. రెండింటిలోనూ ఉన్న సమాన అంశాలు – దేశం, కాలం, అనేక భిన్నవస్తువులు. కాని వేర్వేరు పదార్థాలు అసత్యం అనే విషయంలో సమానం అని జ్ఞానులు అంటున్నారు.

కాని మనం ఈ సిద్ధాంతాన్ని అంత తేలికగా స్వీకరించలేము. మనం వాటి మధ్య ఉన్న భేదాలను ఎత్తి చూపుతాము. అవి – జాగ్రత్ ప్రపంచం బాహ్యంగా ఉంటే, స్వప్నప్రపంచం ఆంతరంగా ఉంది. స్వప్నప్రపంచానికి ఉచితదేశ, ఉచితకాల నియమం వర్తించదు; జాగ్రత్ ప్రపంచానికి వర్తిస్తుంది. ఇన్ని భేదాలు ఉంటే రెండూ సమానమని మీరెలా అంటారని మనం నిలదీస్తాము. మనకు అసహనం పెరిగినకొద్దీ, గౌడపాదాచార్యులవారు శాంతం వహిస్తారు. ఆయన జవాబు తీరిగ్గా ఈ విధంగా చెబుతారు.

**ప్రసిద్ధేనైవ హేతునా** – ప్రసిద్ధమైన కారణంవల్ల రెండూ మిథ్య అంటున్నారు. కారణం ఉంది, ఆ కారణం అందరికీ తెలిసిందే. అందరూ అంటే ఎవరు? శాస్త్రం బాగా తెలిసినవారు. శాస్త్రం తెలిసినవారికి, జాగ్రత్‌ప్రపంచం కూడా మిథ్య అని తెలుసు.

ఏమిటా ప్రసిద్ధి చెందిన కారణం? **ఉచితదేశ, ఉచితకాల అభావకారణం** ఇవ్వటానికి లేదు. కాని నిజానికి రెండు ప్రసిద్ధి చెందిన కారణాలు ఉన్నాయి. ఈ కారికను ఇచ్చే వివరణలో శంకరాచార్యులవారు ఒక కారణం చెబుతున్నారు; గౌడపాదాచార్యులవారే స్వయంగా ఇంకొక కారణం వచ్చే కారికలో ఇస్తారు. ముందు శంకరాచార్యులవారు చెప్పిన కారణం చూద్దాం. అది మెదడును వేడెక్కించే కారణం; జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

**శంకరాచార్యులవారి కారణం** – స్వప్నప్రపంచాన్ని అనుభవిస్తున్నారు కాని అది మిథ్య. అలాగే జాగ్రత్‌ప్రపంచాన్ని కూడా అనుభవిస్తున్నారు కాబట్టి అది కూడా మిథ్యే. దీన్నుంచి ఒక వ్యాప్తివాక్యాన్ని తయారుచేశారు శంకరాచార్యులవారు. ఏమిటది?

**యత్ యత్ దృశ్యం తత్ తత్ మిథ్యా**

ఎలా ఒక బాంబ్ వేశారో చూడండి. ఏదైతే చూస్తామో, అనుభవిస్తామో, అది మిథ్య అనేస్తున్నారు.

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

జాగ్రత్ ప్రపంచం మిథ్య; అది దృశ్యం కాబట్టి; స్వప్నప్రపంచం లాగా. దృశ్యంలా చూడబడేదంతా మిథ్య అయితే, మరి ఏమిటి సత్యం? ఇది మనకు కలిగే ప్రాథమిక సందేహం. శంకరాచార్యులవారు దృశ్యంగా కనబడనిది సత్యం అంటున్నారు. మనకు తెలిసిన సూత్రం, కంటికి కనబడనిది ఏదైనా దానికి ఉనికి లేదు. ఈ సూత్రం ప్రకారం సత్యం అంటే ఉనికి లేనిదా? శంకరాచార్యులవారు ఏదైతే ఉనికి ఉండి, అనుభవంలోకి రాదో, అది సత్యం అంటున్నారు. అటువంటిది ఏమిటి? అనుభవిస్తున్న నువ్వే! సబ్జెక్టు అయిన నువ్వే. **దృక్ సత్యం। దృశ్యం మిథ్యా**

ఆ దృశ్యం జాగ్రత్ ప్రపంచం అవచ్చు; స్వప్నప్రపంచం అవచ్చు; కారణప్రపంచం అవచ్చు. ఏ ప్రపంచమైనా అది మిథ్యే. ఇందాక వ్యాప్తివాక్యం చూశాము –

యత్ యత్ దృశ్యం తత్ తత్ మిథ్యా.

అలా ఎలా చెప్పగలరు? దానికి వెనకనున్న సూత్రం ఏమిటి? శంకరాచార్యులవారు దాన్ని ఇక్కడ వివరించరు. ఎందుకంటే ఇది స్పష్టంగానే తెలుస్తున్నదని ఆయన భావన. మనం ఇదంతా ఉపోద్ఘాతంలో చూశాము. ఒకసారి ఆ విషయాన్ని ఇక్కడ గుర్తు తెచ్చుకుందాము.

ఒక వస్తువును ప్రమేయం (ఆబ్జెక్టు) అనాలి అంటే దానికి మూడు నియమాలు ఉండాలి అని చూశాము. అది ఏదో ఒక ప్రమాణానికి అందాలి; ఎవరో ఒకరు చూసివుండాలి; ఎప్పుడో అప్పుడు చూసివుండాలి. ఈ మూడు నియమాలను కలిపితే, ప్రమాత (సబ్జెక్టు) చూస్తేనే ప్రమేయానికి ఉనికి ఉంది. జాగ్రత్ప్రపంచాన్ని జాగ్రత్ పురుషుడు చూస్తేనే దానికి ఉనికి ఉంది. అతను పడుకుంటే, ఆ ప్రపంచం కూడా పడుకుంటుంది.

ఒక వస్తువు ఎవరికీ అనుభవంలోకి రాకపోతే, దాని ఉనికి గురించి ఎన్నడూ మాట్లాడలేము. అంటే దాని ఉనికి తెలుసుకోబడటంమీద ఆధారపడివుంది; దాన్ని తెలుసుకోబడటం అనేది తెలుసుకునే ప్రమాతమీద ఆధారపడివుంటుంది. అందువల్ల ప్రమాత చూస్తేనే ప్రమేయానికి ఉనికి ఉంది.

ఇప్పుడొక ఉదాహరణ చూద్దాము. మీరు స్వప్నంలో, ఎవరో ఊబిలో ఇరుక్కుపోవటం చూశారు. మీరు అతన్ని పైకి తీసుకురావటానికి మీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అతను ఇంచుమించుగా పైకి వచ్చేశాడు కూడా. కాని సరిగ్గా అప్పుడే మీకు మెలకువ వచ్చేసింది. లేచాక అతను కాని, అతను పడిపోయిన ఊబి కాని మీకు కనబడదు. ఇప్పుడు చెప్పండి, 'అయ్యో, అతను పైకి వచ్చాడో, లేదో,' అని ఖంగారు పడతారా మీరు? లేకపోతే,

మళ్ళీ పడుకుని మళ్ళీ కలలోకి వెళ్ళి అతన్ని పూర్తిగా పైకి లేపుతాను అంటారా? లేదే! మీకు స్పష్టంగా తెలుసు. అటువంటి వ్యక్తికి నిజంగా ఉనికి లేదని. అతనికి ఉనికి మీరు స్వప్నంలో చూసినంతసేపే ఉంది. మీరు లేస్తే, అతను లేడు. అంటే ఆబ్జెక్టుకు ఉనికి సబ్జెక్టు చూస్తేనే ఉంది.

టూకీగా చెప్పాలంటే, ఆబ్జెక్టుకు స్వతంత్ర సత్తా లేదు కాని సబ్జెక్టుకు స్వతంత్ర సత్తా ఉంది. వేదాంతసూత్రం – దేనికైతే స్వతంత్ర సత్తా లేదో అది మిథ్య. దేనికైతే స్వతంత్ర సత్తా ఉందో, అది సత్యం. దానికి గొప్ప ఉదాహరణ – కుండ–మట్టి. కుండకు మట్టి లేకుండా విడిగా ఉనికి లేదు; కాని మట్టి కుండ ఉన్నా, లేకపోయినా ఉంటుంది. కుండ పుట్టక ముందూ, కుండలోనూ, కుండ పగిలిపోయాకా ఉంటుంది. అందువల్ల స్వతంత్ర సత్తా ఉన్నది సత్యం; పరతంత్ర సత్తా ఉన్నది మిథ్య.

స్వప్నప్రపంచం మిథ్య; జాగ్రత్ ప్రపంచం దృశ్యం; అందువల్ల రెండూ మిథ్య. రెండూ వాటి ఉనికికి చైతన్యంమీద ఆధారపడి ఉన్నాయి. ఒక వస్తువు దృశ్యం అవాలి అంటే, దాన్ని చూసే దృక్ ఉండాలి. **దృక్ సత్యం । దృశ్యం మిథ్యా**

ఇదీ గౌడపాదాచార్యులవారు అన్న ప్రసిద్ధ కారణం. సాధారణంగా అది కనిపిస్తోంది కాబట్టి, అది సత్యం అంటాము. కాని శంకరాచార్యులవారు అది కనిపిస్తోంది కాబట్టి, అది మిథ్య అంటున్నారు. ఇదీ వేదాంతబోధ. గౌడపాదాచార్యులవారు చెప్పే కారణాన్ని వచ్చే కారికలో చూద్దాము.

**కారిక 2.6**

**ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా ।**
**వితథైస్సదృశాస్సంతోఽవితథా ఇవ లక్షితాః ॥**

శంకరాచార్యులవారు పరోక్ష కారణాన్ని చెప్పారు. దాన్ని అనుమానవాక్యంగా చూస్తే–

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

**ప్రత్యక్ష కారణం** – ఇప్పుడు గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచం అనిత్యం కాబట్టి అది మిథ్య అంటున్నారు.

**త్రికాలేపి తిష్ఠతి ఇతి సత్** – తత్త్వబోధ

ఏదైతే మూడు కాలాల్లోనూ ఉంటుందో అది సత్యం అని తత్త్వబోధ నిర్వచిస్తున్నది. అంటే ఏదైతే అసత్యమో అది మిథ్య అని చెప్పకనే చెప్పినట్టయింది.

**యత్ అనిత్యమ్ తత్ మిథ్యా । యత్ నిత్యం తత్ సత్యమ్**

ఎలా ఈ తర్కాన్ని అర్థం చేసుకోవటం? ఏ వస్తువుకైనా ఉనికి కాసేపే ఉంటుంది. ప్రతి వస్తువుకూ తయారుచేసిన రోజూ, దాని కాలం చెల్లిపోయే రోజూ ఉంటుంది. కుండ అచైతన్యం. ఎందుకంటే అది కుండగా పుట్టకముందు దానికి ఉనికి లేదు, కుండ పగిలిపోయాకా దానికి ఉనికి లేదు. అంటే దాని ఉనికి అనిత్యం, శాశ్వతం కాదు. అంటే ఉనికి దాని స్వస్వరూపం కాదు.

ఎప్పుడైతే దాని ఉనికి మూడునాళ్ళ ముచ్చటో, అప్పుడే దాని ఉనికి ఆగంతుక స్వరూపమే కాని స్వస్వరూపం కాదని అర్థమవుతుంది. అగ్నికి వేడి దాని స్వస్వరూపం; కాని నీటికి, వేడి స్వస్వరూపం కాదు. అంటే అది ఆగంతుక లక్షణం, కాసేపయ్యాక వేడి తగ్గిపోతుంది. అందువల్ల ఆగంతుక లక్షణం అనిత్యం, స్వస్వరూపం నిత్యం.

ఉల్లిపాయయొక్క స్వస్వరూపాన్ని వర్ణించే ఒక తమాషా అయిన పద్యం ఉంది. ఒక వ్యక్తికి ఉల్లిపాయ తినాలని ఆశ, కాని దాని వాసన పడదు. అందువల్ల అతను ఆ ఉల్లిపాయను ఒక బంగారు పళ్ళెంలో పెట్టి, దాని చుట్టూతా కర్పూరం, కస్తూరి పెట్టాడట. గంధం నీరుతో మూడుగంటలు దానికి అభిషేకం చేశాడు. మూడుగంటల అభిషేకం తర్వాత, ఉత్సాహంగా ఉల్లిపాయను తీసుకుని వాసన చూశాడట. ఉహు! అస్సలు ఉల్లిపాయ వాసన ఏమాత్రం పోలేదు. ఎందుకు? అది ఉల్లిపాయయొక్క స్వస్వరూపం.

దానికి భిన్నంగా అరువు తెచ్చుకున్న స్వభావం కొంతసేపే ఉంటుంది. అంటే నీటికి వేడెక్కే లక్షణం కొంతసేపే ఉన్నట్టుగా, కొంతసేపే ఉంటుంది. కుండ దాని ఉనికిని మట్టి నుంచి అరువు తెచ్చుకుంది. అది పగిలిపోయినప్పుడు, దాని ఉనికి మళ్ళీ మట్టిలో కలిసి పోతుంది. మనకు తెలిసిన అంశం, కుండ పుట్టకముందు దానికి ఉనికి లేదు, పగిలిపోయాకా ఉనికి లేదు; కాని కుండగా ఉన్నంతవరకూ ఉనికి ఉంది అని.

గౌడపాదాచార్యులవారు ముందూ, తర్వాత మాత్రమే కాదు, కుండగా ఉండగా కూడా, దానికి ఉనికి లేదని నిరూపిస్తారు. కుండ ఉందనే వాక్యంలో ఆ 'ఉంది' (ఉనికి) పదం నిజానికి మట్టికి చెందుతుంది. కుండను పట్టుకున్నా, మట్టిని పట్టుకున్నట్టే; కుండ బరువు మట్టి బరువే; కుండ వాసన మట్టి వాసనే. అందువల్ల విశ్లేషణ చేస్తే తెలిసేది కుండ ఉంది అన్నా కూడా, దాని అర్థం మట్టి మాత్రమే ఉంది అని. అంటే కుండ పుట్టకముందు లేదు, పగిలిపోయాక లేదు; మధ్యలో ఉన్నట్టుగా ఉన్నా ఆ ఉనికి మట్టిదే. అలా అరువు తెచ్చుకున్న ఉనికి ఉన్నా లేనట్టే, కాబట్టి కుండ మిథ్య అవుతుంది.

**మట్టి సత్యం, కుండ మిథ్యా**

ఇదే సూత్రాన్ని జగత్తుకు అన్వయించి అర్థం చేసుకోమంటున్నారు గౌడపాదాచార్యులవారు. సృష్టికి ముందు జగత్తు లేదు, ప్రళయంలో జగత్తు లేదు, మధ్యలో ఉన్నట్టుగా ఉన్నా, దాని

ఉనికి వేరే దేన్నించో అరువు తెచ్చుకున్నది. ఏమిటా సత్ వస్తువు? అది బ్రహ్మ లేదా ఆత్మ లేదా చైతన్యం. బ్రహ్మ నిర్వచనం **త్రికాలేపి తిష్ఠతి**. మూడు కాలాల్లోనూ ఉంటుంది బ్రహ్మ. ఒక కాలంలో వచ్చి, ఒక కాలంలో పోయి, మధ్యలో అరువు తెచ్చుకున్న ఉనికితో ఉన్న జగత్తు ఉన్నా లేనట్టే. అందువల్ల జగత్తు మిథ్య అవుతుంది.

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా**

ఈ నేపథ్యంతో ఈ కారికను చూద్దాము.

**యద్ ఆదౌ న అస్తి** – ఆదౌ అంటే సృష్టికి ముందు. యద్ అంటే ఏ వస్తువు అయితే లేదో,

**అంతే చ (న అస్తి)** – అంతం అంటే ప్రళయంలో. ఏ వస్తువు అయితే ప్రళయంలో కూడా ఉండదో,

**వర్తమానేఽపి తత్తథా** – ఆ వస్తువుకు వర్తమానంలో కూడా నిజంగా ఉనికి లేదు. కుండను చేతితో పట్టుకున్నా కూడా, నిజానికి పట్టుకున్నది మట్టినే అని చూశాము. అలా ఎలా చెప్పగలరు? మట్టిని విడిగా తీయటానికి ప్రయత్నించి చూడండి. మట్టిని, కుండను విడదీయలేరు. మట్టే కుండగా రూపుదిద్దుకుంది. అలాగే బంగారాన్ని ఆభరణంనుంచి విడదీయలేరు. బంగారమే ఆభరణంగా రూపుదిద్దుకుంది.

కాని పాల విషయం తీసుకోండి. పాలు విడిగా తాగిచూడండి; తర్వాత దానిలో చిటికెడు పంచదార కలిపి తాగిచూడండి. పంచదార కలిపిన పాలు తియ్యగా ఉంటాయి; కలపని పాలకు ఆ తియ్యదనం ఉండదు. అంటే ఇప్పుడు తియ్యదనం దేనిది? పంచదారది. పాల తియ్యదనం అరువు తెచ్చుకుంది. అదే విధంగా కుండ ఉనికి అరువు తెచ్చుకున్నది. కాబట్టి కుండ మిథ్య.

**వితథైః సదృశాస్సంతః** – సదృశాః అంటే జగత్తులోని ఏ వస్తువైనా కూడా తాడు–పాము; ఆలుచిప్ప–వెండి; స్వప్నం–వస్తువులలాగా మిథ్యే. అంటే తాడు–పాములో పాము ఎలా మిథ్యో అలాగే ఈ ప్రపంచం మొత్తం మిథ్య. వితథః అంటే మిథ్య.

**అవితథా ఇవ లక్షితాః** – కాని ఈ జగత్తు మొత్తం అసత్యం కాదు అన్నట్టు కనిపిస్తుంది. అజ్ఞానికి ప్రపంచం సత్యంగా అనిపించినా, లోతుగా విశ్లేషిస్తే జగత్తుకు విడిగా ఉనికి లేదని అర్థం అవుతుంది.

అంతకుముందు జాగ్రత్ ప్రపంచం మిథ్య అన్నారు గౌడపాదాచార్యులవారు, కాని కారణం తర్వాత చూద్దామని వదిలేశాము. ఆ వాక్యం,

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా ... స్వప్నప్రపంచవత్**

ఇప్పుడా ఖాళీని అనిత్యత్వాత్ అని పూరించుకోవాలి. అప్పుడా వాక్యం,

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

జాగ్రత్ ప్రపంచం మిథ్య, అనిత్యం కాబట్టి, స్వప్నప్రపంచంలాగా అని అర్థం.

స్వప్నప్రపంచంనుంచి లేస్తే స్వప్నప్రపంచం మిథ్య; జాగ్రత్ ప్రపంచంనుంచి స్వప్న ప్రపంచంలోకి జారుకుంటే, జాగ్రత్ ప్రపంచం మిథ్య. అంటే ఒకటి ఉంటే ఇంకొకటి లేదు. అందువల్ల రెండూ మిథ్యే. రెండింటిలోనూ అనుభవం ఉంది కాని రెండూ అనిత్యం. రెండూ వచ్చిపోతాయి.

పదేపదే ఒక విషయం చూస్తూ వస్తున్నాము. స్వప్నంలో ఉండగా స్వప్నం మిథ్య కాదు; అలాగే జాగ్రదావస్థలో ఉండగా, జాగ్రత్ ప్రపంచమూ మిథ్య కాదు. స్వప్నంనుంచి జాగ్రదావస్థకు లేస్తే స్వప్నం మిథ్య; జాగ్రదావస్థనుంచి పారమార్థిక సత్యానికి లేస్తే జాగ్రదావస్థ కూడా మిథ్యే.

### కారిక 2.8

**అపూర్వం స్థానిధర్మో హి యథా స్వర్గనివాసినామ్ ।**
**తానయం ప్రేక్షతే గత్వా యథైవేహ సుశిక్షితః ॥**

నిజానికి కారిక 6 తర్వాత కారిక 7 వస్తుంది, కాని మనం కారిక 8 ముందు చూద్దాము. ఇది చూసేముందు కూడా, ఇంతవరకూ గౌడపాదాచార్యులవారు చెప్పుకొచ్చిన దశలు చూద్దాము.

ఎ) ముందు స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపించారు.
బి) దాన్ని జాగ్రత్ ప్రపంచానికి అన్వయించి, అది కూడా మిథ్య అని నిరూపించారు. దానికి రెండు కారణాలు కూడా చూశాము.

1) శంకరాచార్యులవారు చెప్పినది – జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్

2) గౌడపాదాచార్యులవారు చెప్పినది – జాగ్రత్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్న ప్రపంచవత్.

ఇంతకుముందే చూసినట్టుగా, సాధారణంగా అందరూ స్వప్నం మిథ్య అని ఒప్పుకుంటారు కాని, కొంతమంది స్వప్నం కూడా సత్యమే అంటారు. మనం స్వప్నప్రపంచం మనలో నిక్షిప్తమై ఉన్న వాసనలనుంచి, మనస్సు సృష్టించిన ప్రపంచం అంటాము.

**జాగ్రదావస్థాయాం యత్ దృష్టం యత్ శ్రుతం తజ్జనిత వాసనయా నిద్రాసమయే యః ప్రపంచః ప్రతీయతే సా స్వప్నావస్థా** – తత్త్వబోధ

జా(గదావస్థలో ఏది చూస్తామో, ఏది వింటామో, దానికి సంబంధించిన వాసనలనుండి వచ్చిన (ప్రపంచమే స్వప్న(ప్రపంచం.

కాని కొందరు దీన్ని ఒప్పుకోరు. వారు దానికి చెప్పే జవాబు – స్వప్నంలో వచ్చే కొన్ని వస్తువులు కాని, అనుభవాలు కాని, మనం ఎన్నడూ జా(గదావస్థలో అనుభవించి ఉండము. అందువల్ల స్వప్న(ప్రపంచం కూడా జా(గదావస్థలాగా సత్యమే అంటారు వారు.

దానికి గౌడపాదాచార్యులవారు, మీరు స్వప్నంలో ఏం చూసినా, ఏం అనుభవించినా కూడా, అది ముందు జా(గదావస్థలో అనుభవించినదే అంటారు. స్వప్నంలో అనుభవాలు (ప్రత్యేకంగా ఉంటాయి అంటే, అవి జా(గదావస్థలో అనుభవించిన వాటి మి(శమం తప్ప మరేం కాదు. మీరు మనిషినీ, పులినీ చూశారు; స్వప్నంలో జరిగే అనుభవం ఈ రెండింటి మేలుకలయిక తప్ప, మరేం కాదు. ఒకవేళ ఆ అనుభవాలు కొత్తవిగా అనిపిస్తే, ఈ జన్మలో అయిన అనుభవాలు కాకపోయినా, గత జన్మలోనివి అయివుంటాయి. అవి మీకు గుర్తుండవు కాని, మీ చిత్తంలో వాసనల రూపంలో నిక్షిప్తమై ఉంటాయి.

స్వప్నం వి.సి.ఆర్‌లాంటిది. అందులో మీరు ఏం రికార్డ్ చేస్తే అదే వస్తుంది తప్ప, వి.సి.ఆర్.లో రికార్డ్ అవనిది ఎలా రాదో, స్వప్నంలో కూడా మీ చిత్తంలో నిక్షిప్తమవని అనుభవాలు రావు.

స్వప్నంలో అనుభవాలు (ప్రత్యేకంగా ఉన్నాయని, అందువల్ల స్వప్న(ప్రపంచం (ప్రత్యేకమైనదని వారు అన్నమాటని వాదనకోసం, కాసేపు ఒప్పుకుందాం. విశిష్టాద్వైతంలో స్వప్నం నా వాసనలనుంచి వచ్చింది కాదు, అది కూడా ఈశ్వరసృష్టే అంటారు. మరి మీ స్వప్నాన్ని ఇతరులు చూడలేరు కదా, దానికేమంటారు అంటే, ఎవరి కర్మానుసారం వారికి స్వప్నం వస్తుంది. అందువల్ల ఎవరి స్వప్నం వారిదే, ఇది ఈశ్వరుని (ప్రత్యేకసృష్టి అంటారు. సరే, అలాగే అనుకున్నా కూడా, స్వప్నంలోని (ప్రత్యేకమైన అనుభవం కూడా మిథ్యే అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఎందుకు?

దానికి కారణాలు ముందే చూశాము. ఏదైనా అనుభవంలోకి వచ్చిందా, అది ఆబ్జెక్ట్ అవుతుంది, అది మిథ్య అవుతుంది. అపూర్వ వస్తువు అయినా, సాధారణ అనుభవం అయినా, అసాధారణం అనుభవం అయినా – అది ఆబ్జెక్ట్ అవుతుంది అంటే దృశ్యం అవుతుంది. దృశ్యం దాన్ని చూసే (ద్రష్టమీద ఆధారపడివుంటుంది.

ఒక వస్తువుకు (ప్రమేయం (దృశ్యం) హెూదా రావాలి అంటే దాన్ని చూసే (ప్రమాత ఉండి తీరాలి అని చూశాము. అంటే (ప్రమేయానికి విడిగా ఉనికి లేదు.

**అపూర్వం స్థానిధర్మో హి** – స్వప్నంలోని (ప్రత్యేక వస్తువులు కూడా వాటి ఉనికికి, వాటిని చూసే స్వప్నపురుషునిమీద ఆధారపడతాయి. ఇక్కడ ధర్మః పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

ఇక్కడ ధర్మః అంటే ఆధారపడివుంది. దేనిమీద? స్థాని అంటే ద్రష్టమీద. అపూర్వం అంటే ప్రత్యేక వస్తువు.

అపూర్వం స్థానిధర్మో హి అంటే ప్రత్యేక వస్తువు దాన్ని చూసే ద్రష్టమీద ఆధారపడివుంటుంది. ఎలా?

**యథా స్వర్గనివాసినామ్** - స్వర్గంలో అనేక అపూర్వవస్తువులు ఉన్నాయి. ఐరావతం, పారిజాతవృక్షం, సెలయేర్లు - అలా అనేకం ఉన్నాయి. వాటిని స్వర్గంలో ఉన్న దేవతలు చూస్తేనే వాటికి ఉనికి ఉంటుంది. స్వర్గం ఉంది అని చెప్పాలి అంటే, స్వర్గనివాసులు ఉండి, దాన్ని చూడాలి. అదే విధంగా స్వప్నం ఉందని చెప్పాలి అంటే, స్వప్నపురుషుడు ఉండాలి. అందువల్ల చూడబడే వస్తువు ఎంతైనా అపురూపమవనీ, అది మిథ్యే. దానికి కారణం దాని ఉనికికి అది ద్రష్టమీద ఆధారపడాలి.

**తానయం ప్రేక్షతే గత్వా** - ఆ వస్తువులను, ద్రష్ట దృశ్యంగా చూస్తాడు కాబట్టి, దృశ్యం ద్రష్టమీద ఆధారపడివుంది. చాలామంది అసలు స్వర్గం అని ఒకలోకం ఉందనే నమ్మరు. ఎందుకంటే అది మనుష్యుల అనుభవాలకు అందదు. కాని స్వర్గవాసుల అనుభవానికి అందుతుంది. అందువల్ల ప్రమేయం అంటే ఎవరో ఒకరు, ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట చూసివుండాలి.

**ప్రకృతి సూత్రం - ప్రమేయం, ప్రమాతమీద ఆధారపడివుంటుంది.**

**యథైవేహ సుశిక్షితః (పురుషః)** - ఈ లోకంలోనే శిక్షణ పొందిన ఒకవ్యక్తి ఒక దేశంనుంచి ఇంకొక దేశానికి వెళ్ళినప్పుడు వింతైన అనుభవాలు పొందినట్టుగా. ఇహ అంటే ఈ లోకంలోనే. వేషభాషలు, ఆహారవ్యవహారాలు, అలవాట్లు, సంగీతం, జంతువులు - ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క తీరులో ఉంటాయి. కొన్ని వింతగా లేదా అపురూపంగా అనిపిస్తాయి. కాని వాటిని చూస్తారు కాబట్టి వాటిని మీరు స్వీకరిస్తారు. కాని వేదాంతం ప్రకారం అది దృశ్యం కాబట్టి అది మిథ్య.

ఈ కారిక సారాంశం - స్వప్నప్రపంచం అపూర్వ అనుభవాన్ని కలుగజేసినా కూడా, అది దృశ్యం కాబట్టి మిథ్యే.

### కారిక 2.7

**సప్రయోజనతా తేషాం స్వప్నే విప్రతిపద్యతే ।**
**తస్మాదాద్యంతవత్త్వేన మిథ్యైవ ఖలు తే స్మృతాః ॥**

కారిక 8లో స్వప్నప్రపంచం మిథ్య అని ఒప్పుకోలేరు కొందరు. కాని అది మిథ్య అని నిరూపించారు గౌడపాదాచార్యులవారు. ఇప్పుడు వచ్చే కారికల్లో, సరే, స్వప్నప్రపంచం

మిథ్య అని నేనూ ఒప్పుకుంటాను, కాని జాగ్రత్ ప్రపంచం మిథ్య అని ఒప్పుకోను అని అంటాడు ఒక వ్యక్తి. దానికి అతను నాలుగు కారణాలు చూపిస్తున్నాడు. అవి – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది. ఈ కారికలో ప్రయోజకత్వంమీద వాదన చూస్తాము.

ఎ) **ప్రయోజనం ఉంది** – స్వప్నప్రపంచంలో సంపాదించిన ధనాన్ని, జాగ్రదావస్థలో వినియోగించలేను నిజమే. కాని ఇక్కడ సంపాదించిన ధనాన్ని ఇక్కడ ఉపయోగించ గలుగుతున్నాను కదా అంటాడు అతను.

ఇంతవరకూ మిథ్యకు రెండు నిర్వచనాలు చూశాము. అవి –

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

కాని అతను వీటిని ఒప్పుకోడు. దృశ్యం అయినంత మాత్రాన, అనిత్యం అయినంత మాత్రాన అది మిథ్య అవటానికి వీలులేదు. మీరు సత్యం నిర్వచనాన్ని తిరగరాసుకోండి. నిత్యవస్తువు మాత్రమే సత్యం అనకండి, ప్రయోజనం ఉన్నదేదైనా సత్యమే అంటాడు అతను. స్వప్నవస్తువులవల్ల ప్రయోజనం లేదు కాబట్టి మిథ్య అన్నారు బాగానే ఉంది; కాని జాగ్రత్ వస్తువులకు ప్రయోజనం ఉంది కాబట్టి అవి సత్యం.

**యత్ యత్ సప్రయోజనం తత్ తత్ సత్యమ్**

**యత్ యత్ అప్రయోజనం తత్ తత్ మిథ్యా**

ఇంకో విధంగా చెప్పాలంటే స్వప్నప్రపంచం మిథ్య కాని, జాగ్రత్ ప్రపంచం సత్యం.

**గౌడపాదాచార్యులవారి జవాబు** – సత్యానికి ప్రయోజకత్వం అనే నిర్వచనం చెల్లదు. జాగ్రదావస్థలోని వస్తువులకు ప్రయోజనం ఉంది – అనే వాక్యం అసంపూర్ణం. దానికి ఇంకో పదం కలపాలి. జాగ్రదావస్థలోని వస్తువులకు ప్రయోజనం ఉంది, జాగ్రదావస్థలో ఉన్నంతవరకూ, అనాలి. ఆ వస్తువులను స్వప్నావస్థలో వాడలేము. స్వప్నంలో దాహం వేస్తే, జాగ్రదావస్థలో మంచం పక్కనే చల్లటినీరు పెట్టుకున్నా కూడా ఆ నీరు తాగలేము. అలాంటప్పుడు దానికి ప్రయోజనం ఉంది అని ఎలా చెప్పగలరు?

అంతేకాదు, మీరు చెప్పే ఈ ప్రయోజకత్వం ఏదైతే ఉందో, అది స్వప్నప్రపంచానికీ ఉంది. మీకు స్వప్నంలో దాహం వేస్తే, స్వప్నంలో ఉన్న నీరే తాగాలి; స్వప్నంలో దెబ్బ తగిలితే, స్వప్నంలోని మందులే వాడాలి. అంటే అక్కడా ప్రయోజనం ఉంది కదా? ఒకవేళ ప్రయోజనం సత్యానికి కారణంగా తీసుకోవాలంటే, స్వప్నప్రపంచం స్వప్నావస్థలో ప్రయోజనకరంగానే ఉంటుంది; జాగ్రత్ ప్రపంచం జాగ్రదావస్థలో ప్రయోజనకరంగానే

ఉంటుంది; కాని స్వప్నప్రపంచం జాగ్రదావస్థలో ప్రయోజనకరం కాదు, అలాగే జాగ్రత్ ప్రపంచం స్వప్నావస్థలో ప్రయోజనకరం కాదు. అంటే ప్రయోజనకరం సాపేక్షిక సత్యం అవుతుందే కాని ఆత్యంతిక సత్యం కాదు; మనం మాట్లాడేది ఆత్యంతిక సత్యం గురించి.

అసలు వారు ఉపయోగించిన పద్ధతే తప్పు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. వారు అన్నది ఏమిటి? స్వప్నప్రపంచంవల్ల ప్రయోజనం లేదు, జాగ్రత్ ప్రపంచంవల్ల ప్రయోజనం ఉందని. అది ఎలా చెబుతున్నారు? స్వప్నప్రపంచంనుంచి లేస్తే దానివల్ల ప్రయోజనం లేదు అంటున్నారు; జాగ్రత్‌ప్రపంచంలో ఉండగా, దానివల్ల ప్రయోజనం ఉంది అంటున్నారు. తీసుకుంటే రెండు ప్రపంచాలనూ వాటిలో ఉండగా తీసుకోవాలి, లేకపోతే రెండు ప్రపంచాలనుంచీ లేచాక తీసుకోవాలి. అలా కాకుండా ఒకటేమో అందులోంచి లేచాక, ఇంకోటేమో అందులో ఉండగా చెబుతున్నారు. అన్ని నిర్వచనాలను అలాగే చెబుతున్నారు. అలాంటి నిర్వచనంవల్ల స్వప్నప్రపంచం మిథ్య, జాగ్రత్ ప్రపంచం సత్యం అవుతుంది.

కాని ఆ పద్ధతి సరియైనది కాదు. ప్రయోజకరం విషయమే తీసుకుంటే ఆయా ప్రపంచాలలో ఉండగా అవి ప్రయోజనకరమే. లేదా, రెండింటినుంచీ లేస్తే, రెండూ అప్రయోజకమే. స్వప్నావస్థనుంచి లేస్తే అది అప్రయోజకం, జాగ్రదావస్థనుంచి పారమార్థిక సత్యానికి లేస్తే అది కూడా అప్రయోజకమే. అందువల్ల వారి నిర్వచనాలను సరిగ్గా అన్వయిస్తే, అయితే రెండు ప్రపంచాలూ సత్యం అవాలి లేదా, రెండూ మిథ్య అవాలి. కాని ఒకటి సత్యం, ఇంకొకటి మిథ్య అవటానికి ఆస్కారం లేదు. పారమార్థిక స్థాయికి ఎదిగితే రెండూ అప్రయోజకమే. ఈ నేపథ్యంతో ఈ కారికను చూద్దాము.

**సప్రయోజనతా తేషాం స్వప్నే విప్రతిపద్యతే** – జాగ్రత్ పదార్థాలు ప్రయోజనం కలవి అనేది స్వప్నంలో తలక్రిందులవుతున్నాయి. విప్రతిపద్యతే అంటే విరుద్ధంగా ఉంది. జాగ్రత్ వస్తువులను జాగ్రదావస్థలో వాడగలము కాని, స్వప్నంలో వాడలేము అని వాదన.

**తస్మాదాద్యంతవత్త్వేన మిథ్యైవ ఖలు తే స్మృతాః** – కాబట్టి అది ఆది–అంతాలు కలవు కాబట్టి, అవి మిథ్యే అని మహాత్ములచే చెప్పబడింది. అంటే అనిత్యమే నిర్వచనం కాని ప్రయోజనం కాదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

స్వప్నంనుంచి లేస్తే స్వప్నం సత్యం కాదు; జాగ్రదావస్థనుంచి లేస్తే జాగ్రత్ ప్రపంచమూ సత్యం కాదు. సాక్షిచైతన్యమే సత్యం.

### కారిక 2.9

**స్వప్నవృత్తావపి త్వంతశ్చేతసా కల్పితం త్వసత్ ।**
**బహిశ్చేతోగృహీతం సద్దృష్టం వైతథ్యమేతయోః ॥**

బి) **బాహ్యంగా ఉంది – వాదన** – స్వప్నప్రపంచం మిథ్య. ఎందుకంటే స్వప్నప్రపంచం నా మనస్సునుంచి వచ్చింది. అది లోపలే ఉంది. అది వాసనామయ ప్రపంచం. అది నానుంచే వచ్చింది కాబట్టి అది అసత్యం. కాని జాగ్రత్ ప్రపంచం అలాకాదు. అది నాకు బాహ్యంగా ఉంది. నేను చూసే ఈ బల్ల, ఈ గది, ఈ మనుష్యులు – అంతా బాహ్యంగా ఉన్నారు. వాటిని నేను సృష్టించలేదు. ఈ గదిలో నేను చూస్తున్న వ్యక్తి, నేను ఈ గదిలోకి రాకముందే ఉన్నాడు. అతన్ని నేను సృష్టించలేదు. దీన్నిబట్టి అతని నిర్వచనం – **నా లోపల ఉన్నది మిథ్య; బాహ్యంగా ఉన్నది సత్యం**. ఈ నియమం ప్రకారం స్వప్నప్రపంచం మిథ్య; జాగ్రత్ ప్రపంచం సత్యం.

**గౌడపాదాచార్యులవారి జవాబు** – ఈ పదం కూడా ఆపేక్షిక సత్యమే. ఒక పదాన్ని ఇష్టం వచ్చినట్టు వాడకూడదు. ఒకవేళ, 'మీరు బయట ఉన్నారా, లోపల ఉన్నారా?' అని అడిగితే మీరేం జవాబు చెబుతారు? దానికి జవాబు చెప్పకుండా ఎదురు ప్రశ్నిస్తారు? 'దేని లోపల?' దేని లోపలో తెలియకుండా ఎలా చెబుతారు? 'గదిలో,' అని ప్రత్యేకించి చెబితే అప్పుడు, 'నేను గదిలో ఉన్నాను,' అనో, 'గది బయట ఉన్నాను' అనో చెబుతారు. అందువల్ల సందర్భం ఏమిటో స్పష్టంగా తెలియాలి.

ఇప్పుడు ఈ సూత్రాన్ని దీనికి అన్వయించి చూద్దాము. 'స్వప్నప్రపంచం బయట ఉందా, లోపల ఉందా?' ఏ సందర్భంలో ఈ ప్రశ్న వేస్తున్నారు? స్వప్నపురుషుని దృష్ట్యానా, జాగ్రత్ పురుషుని దృష్ట్యానా? జాగ్రత్ పురుషుని దృష్ట్యా చూస్తే, స్వప్నప్రపంచం లోపల ఉంది; అది అతని వాసనామయ ప్రపంచం. అదే స్వప్నప్రపంచాన్ని స్వప్నపురుషుని దృష్ట్యా చూస్తే, అది అతనికి బాహ్యంగా ఉంది. అందులో బాహ్యంగా పులిని చూస్తున్నాడు. స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ అతని స్వప్నం, స్వప్నం అని తెలియదు. అది అతనికి బాహ్యంగానే ఉంటుంది; సత్యంగానే అనిపిస్తుంది. కాని దాన్నుంచి లేస్తే అది అంతః ప్రపంచం అవుతుంది, మిథ్య అవుతుంది.

ఇదే సూత్రాన్ని జాగ్రత్ ప్రపంచానికి కూడా అన్వయించాలి అంటున్నారు గౌడపాదాచార్యులవారు. జాగ్రత్ ప్రపంచాన్ని జాగ్రత్ పురుషునిగా చూసినన్నాళ్ళూ అది బాహ్యంగానే ఉంటుంది; అదే పారమార్థిక స్థాయికి అంటే తురీయచైతన్యం స్థాయికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం కూడా తననుంచే వచ్చిందని అర్థమవుతుంది. అందువల్ల ఒక స్థాయినుంచి సత్యమైనది, ఇంకొక స్థాయికి వెళితే అసత్యం అవుతుంది. అందువల్ల జాగ్రత్ ప్రపంచం బాహ్యంగా ఉంది అనటం సత్యం కాదు. ఇది ఆపేక్షిక సత్యం మాత్రమే.

**స్వప్నవృత్తావపి** – స్వప్నంలో ఒక వ్యక్తి ఉన్నాడనుకుందాము. అది సత్యమా, అసత్యమా? స్వప్నం చూస్తున్న స్వప్నపురుషుడు అది సత్యమే అంటాడు. నేను పులిని చూస్తున్నాను,

భయపడుతున్నాను అంటాడు. ఎవరైనా గురువు స్వప్నంలో వెళ్ళి, 'బాబూ, ఇది స్వప్నం, నీ అసలు స్వరూపం వేరే ఉంది, నువ్వు జాగ్రత్ పురుషునివి,' అంటే అతను ససేమిరా నమ్మడు. ఆ మాటకొస్తే, స్వప్నపురుషునికి, ఒక జాగ్రత్ పురుషుడు ఉన్నాడని, అతను జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తాడనే తెలియదు. మరి అప్పుడు అతను ఎలా నమ్ముతాడు? ఆ స్వప్నావస్థనుంచి జాగ్రదావస్థకు లేస్తేనే నమ్ముతాడు. వృత్తిః అంటే ఇక్కడ ఆలోచన కాదు; వృత్తి అంటే అవస్థ. స్వప్నవృత్తౌ అంటే స్వప్నావస్థలో. ఆ స్వప్నావస్థలో ఒక బాహ్యప్రపంచం ఉంది. అది సత్యం. కాకపోతే ఎవరికి అనే విషయం మర్చిపోకూడదు. స్వప్నపురుషునికి అది బాహ్యంగా ఉంది, అది సత్యం.

**బహిశ్చేతో గృహీతం సత్** – బాహ్యంగా కనబడేది, ఇంద్రియాలకు కనబడుతున్నది కాబట్టి సత్యం అంటారు. స్వప్నంలో చూసిన పులి, సూర్యుడు, రైలు అన్ని మహాసత్యం అనిపిస్తాయి.

ఇక్కడ కొంచెం మెదడుకు మేత పెట్టాలి. మీరు జాగ్రత్ పురుషునిగా పడుకున్నారు, స్వప్నప్రపంచాన్ని చూస్తున్నారు. దాన్ని స్వప్నం–1 అందాము. మీకు స్వప్నంలో ఇంకొక స్వప్నం వచ్చింది. ఉదాహరణకు మీరు స్వప్నంలో నిద్రపోతుంటే, మీ యింట్లో దొంగలు పడినట్టు మీకు ఇంకొక కల వచ్చింది. అంటే స్వప్నం–1లో స్వప్నం–2 వచ్చింది.

| | |
|---|---|
| జాగ్రత్ పురుషుని కల | – స్వప్నం 1 |
| స్వప్నపురుషుని కల | – స్వప్నం 2 |

**అంతశ్చేతసా కల్పితమ్ త్వసత్** – మీరు స్వప్నం 1లో చూసిన స్వప్నం 2 కల అంటారు. ఎప్పుడు? స్వప్నం 1లో. అంటే దాన్ని అసత్ అనీ, కల్పితం అనీ, స్వప్నం 1 అనీ అంటారు, కాని స్వప్నం 1ని మాత్రం స్వప్నం 1లో ఉండగా సత్ అంటారు. కాని స్వప్నం 1నుంచి కూడా లేచాక ఏమవుతుంది?

**దృష్టం వైతథ్యమేతయోః** – స్వప్నం 1నుంచి జాగ్రదావస్థకు లేస్తే స్వప్నం 1, స్వప్నం2 కూడా మిథ్యగా, అసత్‌గా తేలిపోతాయి.

స్వప్నం 1లో స్వప్నం 2 వచ్చింది
స్వప్నం 2నుంచి లేస్తే, స్వప్నం 1కి లేస్తారు
స్వప్నం 1నుంచి లేస్తే, జాగ్రత్ ప్రపంచానికి లేస్తారు
జాగ్రత్ ప్రపంచంనుంచి లేస్తే, పారమార్థిక స్థాయికి (పారమార్థిక ప్రపంచం అనకూడదు) లేస్తారు.

గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచం కూడా ఒక కలే అంటున్నారు. దానికి ఒక సంఖ్య ఇస్తే అది స్వప్నం 3 అవుతుంది. స్వప్నం 3నుంచి లేస్తే, పారమార్థిక స్థాయికి

లేస్తారు. అంటే తురీయం స్థాయికి లేస్తారు. ఏ స్థాయిలో ఉంటే అది అప్పుడు సత్యం అనిపిస్తుంది. స్వప్నం 2లో ఉండగా అది సత్యం; స్వప్నం 1లో ఉండగా అది సత్యం; స్వప్నం 3లో ఉండగా అది సత్యం. ఈ అవస్థల్లో తిరుగుతున్నంతసేపూ అవి స్వప్నంనుంచి స్వప్నానికి తిరగటమే అవుతుంది. ఎందుకంటే అందులో చూసే వస్తువులు ఆ స్థాయిలోని ప్రమాతకు మాత్రమే దృశ్యం. అందువల్ల అది ఆపేక్షిక సత్యం మాత్రమే. ఎప్పుడు ఆగంతుక సత్యానికి వస్తారు? దృశ్యంగా చూడబడని దృక్‌ను చేరుకున్నప్పుడు. **దృగేవ న తు దృశ్యతే**. సాక్షిచైతన్యం అది సాక్షిగా చూస్తుందే కాని దాన్ని చూసేది ఇంకొకటి లేదు. అది నేనే.

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణరహిత తురీయమ్ అహమస్మి**

ఈ జ్ఞానం పొందితేనే స్వప్నం 3నుంచి కూడా లేచినట్టు అర్థం.

**కారిక 2.10**

**జాగ్రద్వృత్తావపి త్వంతశ్చేతసా కల్పితం త్వసత్ ।**
**బహిశ్చేతోగృహీతం సద్యుక్తం వైతథ్యమేతయోః ॥**

ఇదే సూత్రాన్ని జాగ్రదావస్థకు అన్వయించాలి.

**జాగ్రద్వృత్తావపి** – జాగ్రదావస్థలో కూడా,

**బహిశ్చేతోగృహీతం సత్** – బాహ్యంగా కనబడుతున్నది సత్యం.

**అంతశ్చేతసా కల్పితం త్వసత్** – అంతరంగా కనబడుతున్నది అసత్. కాని దీన్నించి తురీయానికి లేస్తే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నం 3గా తేలిపోతుంది.

**ఉక్తం వైతథ్యమేతయోః** – జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య అని అర్థం చేసుకోవాలి. వైతథ్యం అంటే మిథ్య.

ఆ విధంగా బాహ్యంగా ఉంది అనే లక్షణం కూడా సత్యం కాదు.

**కారిక 2.14**

**చిత్తకాలా హి యేఽంతస్తు ద్వయకాలాశ్చ యే బహిః ।**
**కల్పితా ఏవ తే సర్వే విశేషో నాన్యహేతుకః ॥**

మనం కారికల వరుస క్రమాన్ని కొంచెంగా మార్చుకుంటున్నాము. ఆలోచనా ప్రవాహం ఒక క్రమంలో సాగాలంటే 10 నుంచి 14కి రావాలి. ఇందులో మూడవ నిర్వచనం వస్తుంది.

సి) **నాకు భిన్నంగా ఉంది**– స్వప్నప్రపంచం మిథ్య. ఎందుకంటే అది నామీద ఆధారపడి ఉంది. నేను చూస్తేనే దానికి ఉనికి ఉంది.

ఉదాహరణకు మీరు స్వప్నంలో ఊబిలో పడిపోయిన వ్యక్తిని కాపాడుతున్నారు. అతను ఊబి పైదాకా వచ్చాక, మీకు మెలకువ వచ్చింది. అయ్యో, అతను బయటకు వచ్చాడా లేదా అని మీరు వాపోతారా? లేదు! నేను మళ్ళీ నిద్రలోకి జారుకుని, మళ్ళీ అదే కల కని అతన్ని కాపాడుతాను అంటారా! అదీ అనరు. ఎందుకు? అతను మీ కలలో మాత్రమే ఉన్నాడు, మీరు చూస్తేనే ఉన్నాడు అని మీకు తెలుసు.

దీన్నిబట్టి స్వప్నం మీరు చూస్తేనే ఉంది, లేకపోతే దానికి ఉనికి లేదు అని చాలా స్పష్టంగా తెలుస్తున్నది. మాండూక్యోపనిషత్తును స్వప్నంలో ఇవాళ నేర్చుకుని, మళ్ళీ రేపు నేర్చుకోలేరు. అందువల్ల స్వప్నం మిథ్య. దీన్ని సబ్జెక్టివిటీ అంటారు. కాని జాగ్రత్ ప్రపంచం అలా కాదు. ఇవాళ మాండూక్యం నేర్చుకుని, రేపు కూడా మళ్ళీ వెళ్ళి ఇవాళ ఎక్కడిదాకా నేర్చుకున్నారో, అక్కడనుంచి కొనసాగించవచ్చు. అందువల్ల జాగ్రత్ ప్రపంచం మీకు భిన్నంగా ఉంది. అంటే మీరు చూసినా, చూడకపోయినా అది ఉంది. మీ ఇల్లు, మీ వాహనం మీరు చూసినా, చూడకపోయినా ఉంటాయి.

ఉదాహరణకు మీరు మీ కారును పక్కవీధిలో పార్క్ చేసి, ఎవరింటికో వెళ్ళారు. ఒకవేళ మీరు వెళ్ళిన వ్యక్తి, 'కారు ఎక్కడ పెట్టారు?' అని అడిగితే, 'పక్కవీధిలో పెట్టాను,' అంటారు మీరు. పక్క వీధిలో పెట్టాను కాని ఉందో లేదో తెలియదు అనరు కదా. అక్కడ ఉంది, మీరు వెనక్కి వెళ్ళినప్పుడు, మళ్ళీ ఆ కారులో ఇంటికి వెళ్ళగలరు అనే ధీమా ఉంటుంది. అంటే దీన్నిబట్టి అర్థమయింది ఏమిటి? మీ కారును మీరు చూస్తున్నా, చూడకపోయినా కూడా దానికి ఉనికి ఉంది. దీన్ని నాకు భిన్నంగా ఉంది అంటారు. ఇంగ్లీషులో ఆబ్జెక్టివిటీ అంటారు. అందువల్ల స్వప్నం మిథ్య, జాగ్రత్ ప్రపంచం సత్యం.

అందువల్ల నాకు భిన్నంగా ఉన్నది సత్యం, నేను చూస్తేనే ఉన్నది మిథ్య.

**గౌడపాదాచార్యులవారి జవాబు** – నాకు భిన్నంగా ఉంది వాదన కూడా ఆపేక్షిక సత్యమే అంటారు గౌడపాదాచార్యులవారు. స్వప్నం నేను చూస్తేనే ఉందని ఎప్పుడు చెప్పగలరు? స్వప్నం నుంచి లేచాక!

మీ మెదడుకు బాగా మేత పెట్టాలి మాండూక్యోపనిషత్తును అర్థం చేసుకోవటానికి. ఇందాకటి కారు ఉదాహరణనే తీసుకోండి. స్వప్నంలో కూడా ఇదే సంఘటన జరిగింది. మీరు కారును పక్కవీధిలో పెట్టి, ఎవరింటికో వెళ్ళారు. కారు ఎక్కడ పెట్టారు అంటే పక్కవీధిలో పెట్టాను అంటారు. అప్పుడు కారు మీకు భిన్నంగా ఉందా లేదా? కారు మీరు చూస్తేనే ఉంది అనటానికి లేదు. అంటే స్వప్నపురుషుని దృష్ట్యా, స్వప్నప్రపంచం అతనికి భిన్నంగానే ఉంటుంది. జాగ్రత్ ప్రపంచానికి లేచినప్పుడు అది అతనికి భిన్నంగా లేదని తెలుస్తుంది.

ఇక్కడ ఒక చిన్న విశ్లేషణ చేద్దాము. జాగ్రత్, స్వప్న ప్రపంచాలను బేరీజు వేద్దాము. ఈ రెండింటిలో ఏది ఎక్కువ? గౌడపాదాచార్యులవారు ఈ బేరీజు వేసే న్యాయనిర్ణేతకు పక్షపాత వైఖరి ఉండకూడదు అంటారు. అలా ఉండకూడదంటే అతను జాగ్రత్ పురుషుడూ అవకూడదు, స్వప్నపురుషుడూ అవకూడదు. ఎందుకు?

ముందు స్వప్నపురుషుని పరంగా చూద్దాము. అతన్ని నీ ప్రపంచం గొప్పదా, జాగ్రత్ ప్రపంచం గొప్పదా అని అడిగామనుకోండి. జాగ్రత్ ప్రపంచమా, అదేమిటి అంటాడు. అతని ఉద్దేశ్యంలో అసలు అటువంటి ప్రపంచమే లేదు. స్వప్నప్రపంచానికే ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది అంటాడు. ఆ విధంగా అతనికి స్వప్నం మాత్రమే సత్యం.

అదే జాగ్రత్ పురుషుణ్ణి అడగండి. అతను స్వప్నం మిథ్య; నేను చూస్తేనే దానికి ఉనికి ఉంది, నాకు భిన్నంగా లేదు, అస్వతంత్రం, ప్రయోజనం లేదు, నానుంచే వచ్చింది అంటాడు. ఈ జాగ్రత్ ప్రపంచానికి ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది అంటాడు. ఆ విధంగా అతనికి స్వప్నం మిథ్య, జాగ్రత్ ప్రపంచం సత్యం.

మరి ఎలా చూడాలి? శాస్త్రానికి వెళ్ళాలి. శాస్త్రం తురీయం దృష్ట్యా చూడండి అంటుంది. మీరు జాగ్రత్ పురుషుడు (విశ్వ) కాదు; స్వప్నపురుషుడు (తైజస) కాదు; సుషుప్తపురుషుడు (ప్రాజ్ఞ) కూడా కాదు. అవి ఒక అవస్థలో ఉంటే, ఇంకొక అవస్థలో ఉండవు. తురీయం అన్ని అవస్థల్లోనూ, ఆయా వేషాలు వేసుకుని ఉంటుంది అంటుంది శాస్త్రం. శాస్త్రం మీరు వ్యవహారిక ప్రపంచంలో ఉన్నంతవరకూ దానితో వ్యవహారం నడపండి తప్పులేదు. కాని సత్యం తెలుసుకోవటానికి మీకున్న ప్రమాణాలు పనికిరావు, శాస్త్రానికి రండి, అందులో మీకు జవాబు దొరుకుతుంది అంటుంది.

**యే అంతః తు** – ఏ వస్తువులైతే మీలో ఉన్నాయో (స్వప్నప్రపంచంలో)

**చిత్తకాలాః హి**– అవి మీ చిత్తంనుంచి వచ్చినవి కాబట్టి వాటిని సబ్జెక్టివ్ అంటారు. అందువల్ల అవి మిథ్య.

**యే బహిః** – ఏదైతే బాహ్యంగా ఉందో,

**ద్వయకాలాః చ** – అది రెండు కాలాల్లోనూ ఉంటుంది కాబట్టి అది సత్యం.

అంటే ఇక్కడ వాదన, స్వప్నానికి ఏకకాలం మాత్రమే ఉంటుంది. అది మీరు చూస్తేనే ఉంటుంది (సబ్జెక్టివ్) కాని, జాగ్రత్ ప్రపంచానికి ద్వయకాలం ఉంటుంది. అంటే మీరు చూసినా, చూడకపోయినా ఉంటుంది. దానికి గౌడపాదాచార్యులవారి జవాబు –

**తే సర్వే కల్పితా ఏవ** – ఈ చిత్తకాలం, ద్వయకాలం రెండూ కూడా కల్పితాలే. అంటే స్వప్నప్రపంచమూ సత్యం కాదు, జాగ్రత్ప్రపంచమూ సత్యం కాదు.

**విశేషః న అన్యహేతుకః** – విశేషః అంటే అంతఃప్రపంచం, బాహ్యప్రపంచం రెండూ కూడా మిథ్యే; వాటికి సత్యత్వం లేదు.

స్వప్నంలో ఉన్న వ్యక్తికి స్వప్నం చూస్తున్నంతసేపూ వస్తువులు అతనికి భిన్నంగానే ఉంటాయి. అంటే అతనికి అక్కడ ద్వయకాలం ఉంటుంది; కాని జాగ్రదావస్థకు లేస్తే, స్వప్నం చిత్తకాలం అయిపోతుంది. అదే సూత్రం ప్రకారం జాగ్రత్ పురుషునికి కూడా జాగ్రత్ప్రపంచం అతనికి భిన్నంగా ఉన్నట్టు అనిపిస్తుంది. అతను తురీయానికి లేస్తే అతనికి కూడా ద్వయకాలం ఉండదు. అందువల్ల నాకు భిన్నంగా ఉంది వాదన కూడా చెల్లదు.

**కారిక 2.15**

**అవ్యక్తా ఏవ యేఽ_ంతస్తు స్ఫుటా ఏవ చ యే బహిః ।**
**కల్పితా ఏవ తే సర్వే విశేషస్త్వింద్రియాంతరే ॥**

డి) **స్పష్టంగా ఉంది** – స్వప్నప్రపంచం మిథ్య. ఎందుకంటే దానిలో స్పష్టత లేదు. స్వప్నం సరిగ్గా తెలియదు. అందువల్లనే చాలామంది నిద్రనుంచి లేచాక, 'ఏ కల కన్నావు?' అని అడిగితే, 'నాకు గుర్తులేదు,' అంటారు లేదా 'సరిగ్గా మొహాలు కనబడలేదు,' అంటారు. కొంతమంది 'నాకసలు కలలే రావు,' అంటారు కాని అది నిజం కాదు. వారికి కలలు గుర్తుండవు కాబట్టి కలలు రావనుకుంటారు అంతే. అందరికీ కలలు వచ్చితీరుతాయనేది విజ్ఞానశాస్త్రపరంగా నిరూపించబడింది. ఏదేమైనా, అది స్పష్టంగా లేదు కాబట్టి అది మిథ్య. జాగ్రత్ ప్రపంచం స్పష్టంగా కనపడుతుంది కాబట్టి అది సత్యం అంటారు వారు. అంతేకాదు, జాగ్రత్ ప్రపంచంలో చిన్న, సూక్ష్మభేదాలు కూడా బాగా కనిపిస్తాయి. కాబట్టి అది సత్యం అంటారు.

**గౌడపాదాచార్యులవారి జవాబు** – స్పష్టత కూడా ఆపేక్షిక పదమే అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ప్రపంచం స్పష్టంగా కనిపిస్తోందో లేదో అనే అంశం ప్రపంచాన్నిబట్టి ఉండదు, దాన్ని చూసే ప్రమాణాన్నిబట్టి ఉంటుంది. ఒక ప్రమాణానికి స్పష్టంగా కనిపించిన ఒక వస్తువు, ఇంకొక ప్రమాణానికి స్పష్టంగా ఉండకపోవచ్చు. అందువల్ల ప్రపంచం ఇలా ఉందని తేల్చి చెప్పలేము. కొన్ని జంతువులకు రంగులు తెలియవు; కుక్కలు మనకన్నా శబ్దాన్ని బాగా వినగలవు.

స్వప్నప్రపంచం జాగ్రత్ పురుషునికి (స్వప్నంనుంచి లేచాక), స్పష్టంగా ఉండదు. కాని జాగ్రత్ ప్రపంచం స్పష్టంగా సూక్ష్మభేదాలతో సహా కనిపిస్తుంది. అందువల్ల స్వప్నప్రపంచంలో స్పష్టత లేదు అనకూడదు. స్వప్నంలో ఉన్నంతవరకూ స్వాప్నికునికి స్వప్నం స్పష్టంగానే ఉంటుంది. అలాగే జాగ్రత్ పురుషునికి జాగ్రత్ ప్రపంచం స్పష్టంగా ఉంటుంది; కాని

స్వప్నపురుషునికి జాగ్రత్ ప్రపంచం స్పష్టంగా ఉండటం దేవుడెరుగు, అసలు జాగ్రత్ ప్రపంచమే లేదు.

ఒక గుడ్డివానికి కన్ను అనే ఇంద్రియం పనిచేయదు. అతను ప్రపంచంలో రూపు, రంగు చూడలేడు. అంటే ఒక భాగం ప్రపంచాన్ని చూడలేడు. అసలు మొత్తం మానవజాతికే కళ్ళు లేవనకుందాము. అప్పుడు అసలు మనకు రూపు, రంగు ఉన్న ప్రపంచం ఉందనే తెలియదు. ఇప్పుడు ఈ ఐదు ఇంద్రియాలే కాక, ఇంకొక ఇంద్రియం అదనంగా ఉందను కుందాము. అప్పుడు ఈ ప్రపంచాన్ని ఆరవకోణంలోంచి చూస్తాము. అంటే ప్రపంచం మనం వాడే ఇంద్రియంమీద ఆధారపడివుంది. ఇంద్రియం మారితే, ప్రపంచం కూడా మారుతుంది. అందువల్ల ప్రపంచానికి స్పష్టత ఉందని చెప్పలేము.

**యే అంతః తు అవ్యక్తా ఏవ** – ఏదైతే లోపల ఉందో, అది స్పష్టంగా లేదు. అంతః అంటే స్వప్నప్రపంచం; అవ్యక్తః అంటే స్పష్టంగా లేదు.

**యే బహిః తు స్ఫుటా** – ఏదైతే బాహ్యంగా ఉందో, అది స్పష్టంగా ఉంది.

జాగ్రత్ పురుషునికి స్వప్నప్రపంచం స్పష్టంగా లేనట్టు ఉన్నా, స్వప్నపురుషునికి అది బాహ్యంగా ఉంటుంది కాబట్టి, స్పష్టంగానే ఉంటుంది. అందువల్ల అతనికి అప్పుడు అది సత్యమే. ఎంతవరకు? నిద్రనుంచి లేచేవరకూ.

**తే సర్వే** – స్పష్టమైన ప్రపంచం, అస్పష్టమైన ప్రపంచం అంతా కూడా,

**కల్పితాః ఏవ** – మిథ్యే. ఎందుకంటే అది చూసే పరికరంమీద ఆధారపడివుంది.

**విశేషస్త్వింద్రియాంతరే** – ఈ భేదం ఇంద్రియాలవల్ల ఏర్పడింది కాని, ప్రపంచంవల్ల కాదు.

జంతువులు చూసే ప్రపంచం వేరు, మనుష్యులు చూసే ప్రపంచం వేరు. ఆ మాటకొస్తే భర్త చూసే ప్రపంచం వేరు, భార్య చూసే ప్రపంచం వేరు. అందువల్లనే వారి మధ్య నిరంతరం ఘర్షణ సాగుతూనే ఉంటుంది.

ఆ విధంగా దేశ, కాలపరిధిలోకి వచ్చినది ఏదైనా సరే, ఆపేక్షిక సత్యమే. ఆపేక్షికం అంటే ఒక పరిధిలోనే సరిపోతుంది. ఉదాహరణకు ఇక్కడ భారతదేశంలో పగలు, అమెరికాలో రాత్రి. దేశాన్నిబట్టి కాలం మారుతున్నది. అంటే కాలం కూడా ఆపేక్షికమే. అలాగే భూమీమ్మద ఉండగా పౌర్ణమి, అమావాస్య అని చెప్పగలము కాని చంద్రుని దగ్గరకు వెళితే దర్శపూర్ణమాస వ్రతం చేయలేము. అందువల్ల మనం చూసే ఈ జాగ్రత్ ప్రపంచం సత్యం అని ఈ జాగ్రత్ శరీరం దృష్ట్యా చూస్తేనే చెప్పగలము. మానవజాతి మొత్తం జాగ్రత్ ప్రపంచాన్ని జాగ్రత్ శరీరంతో చూస్తున్నది కాబట్టి, ఈ ప్రపంచం సత్యం అని పొరపాటు పడుతున్నది. ఆపేక్షిక సత్యం కూడా అలాంటి సందర్భంలో ఆత్యంతిక సత్యం అవుతుంది. ఈ కోణంలో ఆలోచించి

చూడండి. ఎంత అద్భుతమైన వివరణ! మీరు పగలు అంటున్న సమయంలోనే అమెరికాలో ఉన్న మీ బంధువు కాదు ఇది రాత్రి అంటాడు. అలాగే మీరు జాగ్రత్ పురుషునిగా చూస్తే, స్వప్నప్రపంచం మిధ్య; జాగ్రత్ ప్రపంచం సత్యం. స్వప్నపురుషునిగా చూస్తే స్వప్నప్రపంచం సత్యం, జాగ్రత్ ప్రపంచం మిథ్య. అందువల్ల ప్రపంచం మిథ్య.

ఆత్యంతిక సత్యం అంటే ఏమిటి? త్రికాలేపి తిష్ఠతి – మూడు కాలాల్లోనూ ఉండేది. ఆపేక్షిక సత్యం అంటే చూసే పరికరాన్నిబట్టి మారేది. అలా మారేది సత్యం కాదు. మార్పులేనిది, శాశ్వతమైనది ఆత్యంతిక సత్యం. ఆరవ కారికలో ఏది నిత్యమో అది సత్యం అని చూశాము.

ఇప్పుడు ఈ నాలుగు నిర్వచనాలనూ టూకీగా చూద్దాము.

**నాలుగు నిర్వచనాల ఖండన**

| | | |
|---|---|---|
| నాలుగు నిర్వచనాలు | – | ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది. |
| ఎ) **ప్రయోజనం ఉంది** | – | స్వప్నవస్తువులను జాగ్రత్‌లో వాడలేము నిజమే, కాని జాగ్రత్ వస్తువులను కూడా స్వప్నంలో వాడలేము. |
| బి) **బాహ్యంగా ఉంది** | – | స్వప్నప్రపంచం నా మనస్సునుంచి వచ్చింది నిజమే, కాని తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నానుంచే వచ్చింది. |
| సి) **నాకు భిన్నంగా ఉంది** | – | స్వప్నప్రపంచం నేను చూస్తేనే ఉంది నిజమే, కాని స్వప్నంలో కూడా కొన్ని వస్తువులు నేను చూడకపోయినా ఉంటాయి. నేను తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నాకు భిన్నంగా ఉండదు. |
| డి) **స్పష్టంగా ఉంది** | – | స్వప్నప్రపంచంనుంచి లేస్తే స్పష్టంగా లేనట్టు అనిపిస్తుంది నిజమే, కాని అందులో ఉండగా స్పష్టంగా ఉన్నట్టే ఉంటుంది. తురీయానికి లేస్తే రెండూ మిథ్యే. |

ఇక్కడ నాలుగు దశల్లో చూడాలి.

1. స్వప్నం, స్వప్నావస్థలో ఉండగా సత్యం
2. స్వప్నంనుంచి జాగ్రదావస్థకు లేస్తే స్వప్నం మిథ్య
3. జాగ్రత్ ప్రపంచం జాగ్రదావస్థలో ఉండగా సత్యం
4. జాగ్రదావస్థనుంచి తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం మిథ్య.

జాగ్రదావస్థనుంచి తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం మిథ్య. చూసేవారు ముగ్గురు– స్వప్నపురుషుడు, జాగ్రత్ పురుషుడు, జ్ఞాని.

అయితే రెండూ సత్యం అవాలి; లేదా రెండూ మిథ్య అవాలి.అలా అవాలంటే పోలిక రెండూ ఆ అవస్థల్లో ఉండగా చూడాలి లేదా ఆ అవస్థలనుంచి లేచాక చూడాలి. అసలు పోలికలే తప్పు. స్వప్నప్రపంచంనుంచి లేచాక పొందే అనుభవాన్ని, జాగ్రద్ ప్రపంచంలో ఉండగా పోలుస్తున్నారు.

అందువల్ల ఈ నాలుగు నిర్వచనాలూ ఆపేక్షిక సత్యాలు. దీన్ని వ్యావహారిక సత్యం అంటారు. మనం మాండూక్యోపనిషత్తులో పారమార్థిక సత్యాన్ని చూస్తున్నాము.

తురీయం లేదా బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య

ఇంతవరకూ మనం కారికల వరుసక్రమాన్ని మార్చుకున్నాము. అది 6, 8, 7, 9, 10, 14, 15. ఆరవ కారిక తురీయం నిర్వచనాన్ని ఇస్తే, తక్కినవన్నీ తక్కినవారు చెప్పిన నిర్వచనాలనూ, వాటిని గౌడపాదాచార్యుల వారు ఖండించిన తీరునూ వివరించాయి.

మిగతా వాదనలను ఖండించాక, గౌడపాదాచార్యులవారు మళ్ళీ వేదాంతబోధకు వస్తున్నారు. ఇక్కడ ఒక సందేహానికి జవాబును ఇస్తున్నారు. నిజానికి మనమందరం ఈ జవాబును అర్థం చేసుకోవాలి. ఇంతవరకూ మనం చూసిన వాదనలు – స్వప్నప్రపంచంలాగా జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య.

**యత్ యత్ దృశ్యం తత్ తత్ మిథ్యా**

ఈ నియమం ప్రకారం నువ్వు ఉపాసన చేసే దేవుడు కూడా బ్రహ్మ కాదు అంటుంది కేనోపనిషత్తు. అలా నేను చూసినదేదీ సత్యం కాకపోతే, అసలు ఏది సత్యం? మామూలు అనుభవమూ దేశకాల పరిమితిల్లోకి వస్తుంది, అది సత్యం కాదు అంటున్నారు; అసాధారణ అనుభవమూ సత్యం కాదు అంటున్నారు. అసలు సత్యం అనేది ఉందా, లేదా? వేదాంతం ఇలాంటి సందేహంలో పడవేస్తుంది మనను. దానికి జవాబు కారిక 11లో చూస్తాము.

**కారిక 2.11**

**ఉభయోరపి వైతథ్యం భేదానాం స్థానయోర్యది ।**
**క ఏతాన్ బుధ్యతే భేదాన్ కోవై తేషాం వికల్పకః ॥**

**ఉభయోరపి వైతథ్యం భేదానాం స్థానయోర్యది** – రెండు అవస్థల్లోని వస్తువులు కూడా మిథ్యే అయితే, భేదానాం అంటే ఇక్కడ భిన్నవస్తువులు. ఏమిటా వస్తువులు? జాగ్రత్ ప్రపంచంలోని వస్తువులు, స్వప్నప్రపంచంలోని వస్తువులు; వైతథ్యం– మిథ్య అయితే మిథ్య పదాన్ని ఆపేక్షిక సత్యం లేదా వ్యావహారిక సత్యం అంటారు. అది కఠినమైన విషయాన్ని మృదువుగా చెప్పే విధానం.

స్వప్నప్రపంచంతో పాటు స్వప్నప్రమాతను (తైజసను) ఖండిస్తున్నారు; జాగ్రత్ ప్రపంచంతో పాటు జాగ్రత్ ప్రమాతను (విశ్వను) ఖండిస్తున్నారు. ఈ రెండింటిని ఖండిస్తే,

**కో వై తేషాం వికల్పకః** – ఈ వ్యావహారిక సత్యాన్ని సృష్టించినది ఎవరు? ఇంకో విధంగా చెప్పాలంటే ఈ ప్రపంచానికి అధిష్ఠానం ఎవరు? ఒకదాన్ని మిథ్య అంటే దానికొక సత్య అధిష్ఠానం ఉండాలి. మారే సత్యానికి మారని అధిష్ఠానం ఉండాలి. పాముకు అధిష్ఠానం తాడు. మరి ఈ జగత్తుకు అధిష్ఠానం ఎవరు? స్వప్నప్రపంచానికి జాగ్రత్ పురుషుడు అధిష్ఠానం అందామా అంటే, అది కూడా మిథ్యే అంటున్నారు మీరు. ఈ రెండింటికీ అధిష్ఠానం ఎవరు?

**క ఏతాన్ బుధ్యతే భేదాన్** – ఈ రెండింటినీ తెలుసుకునేది ఎవరు అంటే జాగ్రత్, స్వప్నప్రపంచాలు రెండూ మిథ్య అయితే, వాటిని తెలుసుకునేది ఎవరు? వాటికి అధిష్ఠానం ఎవరు? దీనికి జవాబు వచ్చే కారికలో వస్తుంది కాబట్టి, అది కూడా చాలా ముఖ్యమైన కారిక.

### కారిక 2.12

**కల్పయత్యాత్మనాఽఽత్మానమాత్మా దేవస్స్వమాయయా ।**
**స ఏవ బుధ్యతే భేదానితి వేదాంతనిశ్చయః ॥**

గౌడపాదాచార్యులవారు ఆ ఆత్యంతిక సత్యం చూసే నువ్వే అంటున్నారు. ఆ నేను ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి. నేను అంటే తురీయచైతన్యం. నేను అవస్థాత్రయ సాక్షిచైతన్యాన్ని.

చైతన్యమైన నేను, స్థూలశరీరంతో కలిస్తే నేను విశ్వను మాత్రమే. విశ్వగా నేను స్థూలప్రపంచాన్ని అనుభవిస్తాను; నేను స్వప్నంలోకి జారుకుంటే విశ్వ లేదు, స్థూలప్రపంచమైన విరాట్ లేదు. కాని తురీయం అయిన నేను ఉంటాను. ఇప్పుడు స్వప్నంలో తైజసగా, స్వప్నప్రపంచాన్ని చూస్తాను. కాని స్వప్నంనుంచి సుషుప్తిలోకి జారుకుంటే తైజస లేదు, హిరణ్యగర్భ లేదు, కాని తురీయమైన నేను ఉంటాను. అలాగే సుషుప్తిలో నేను ప్రాజ్ఞ–ఈశ్వర జంటగా అవ్యక్తంలో ఉంటాను. కాని సుషుప్తినుంచి లేస్తే ప్రాజ్ఞ లేదు, ఈశ్వర లేదు కాని, తురీయమైన నేను ఉంటాను. ఆ విధంగా తురీయమైన నేను విశ్వ కాదు, తైజస కాదు, ప్రాజ్ఞ కాదు. అవి తాత్కాలికమే; నేను శాశ్వతం.

కాని తమాషా ఏమిటంటే నేను విశ్వగా వ్యవహారం నడిపితే, దానికి దేశకాల పరిమితులు ఉన్నాయి; తైజసగా అయితే ఆ దేశ, కాల పరిమితులు వేరే. దేవతా శరీరం తీసుకుంటే దేశ, కాల పరిమితులు వేరే. అంటే శరీరం ఏదైనా, దేశ కాల పరిమితులు తప్పవు కాని,

తురీయమైన నేను దేశకాలాతీతం. శరీరం వస్తే దేశం, కాలం వస్తాయి; శరీరం పోతే దేశం, కాలం పోతాయి. నేను దేశం, కాలంలో లేను, నిజానికి దేశకాలాలు నాలోనే ఉన్నాయి. తురీయంలో ప్రమాత ప్రమేయం విభజన లేదు. ద్వైతం ఉండాలంటే శరీరం ఉండాలి.

**నాంతః ప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్**
– మంత్రం 7

తురీయ ఆత్మగా నేను ఆత్యంతిక సత్యం. ఎప్పుడైతే ఈ సత్యాన్ని అర్థం చేసుకుంటానో అప్పుడు నేను గ్రీన్‌రూమ్‌లో విశ్వగా వేషం వేసుకుని తండ్రిగా, భర్తగా నా పాత్రలను నేను చక్కగా నిర్వర్తిస్తాను. ఒక నటుడు ఏ వేషం వేసుకుంటే, ఆ పాత్రలో ఉన్నంతవరకూ అందులో జీవిస్తాడు. అప్పుడే ఆ సినిమా రక్తి కడుతుంది. మనం కూడా మనం వేసే పాత్రకు న్యాయం చేకూర్చాలి. కాని ఆ పాత్రలో మరీ మమేకం చెందితే మాత్రం, గ్రీన్‌రూమ్‌కి వెళ్ళి ఇది నేను కాదు, నేను వేసే పాత్ర మాత్రమే అని గుర్తు తెచ్చుకోవాలి. మనకు గ్రీన్‌రూమ్ ఈ మాండూక్యోపనిషత్తే. మాండూక్యం నేర్చుకుంటున్నంతసేపూ నేను తురీయం అని బాగానే అర్థమవుతుంది కాని దాన్నుంచి బయటకు రాగానే విశ్వలో లీనమైపోయి, రాగద్వేషాలు చూపిస్తాము.

**ఆత్మా దేవః కల్పయతి** – తురీయమైన నాకు మాయ అనే శక్తి ఉంది. నేను మాయ ద్వారా సృష్టి చేస్తాను. నేను మాయతో కూడితే, ఈశ్వరుణ్ణి అవుతాను (బ్రహ్మ+మాయ=ఈశ్వర; ఈశ్వర–మాయ=బ్రహ్మ). ఆత్మయొక్క నాలుగు పాదాలు చూసినప్పుడు ఈశ్వరుడు కారణం అనీ, తక్కిన రెండూ కార్యం అనీ చూశాము.

ప్రాజ్ఞ+ఈశ్వర జంటనుంచి తైజస+హిరణ్యగర్భ జంట; విశ్వ+విరాట్ జంటలు వచ్చాయి.

ఇక్కడ దేవః అంటే చైతన్యం. స్వయంజ్యోతి. ఆత్మ అయిన నేను కల్పయతి – సృష్టిస్తాను (మాయ ద్వారా). నాకు ఉపాదానకారణం బయటనుంచి అవసరం లేదు. ఎలాగైతే నేను నా స్వప్నప్రపంచాన్ని నా వాసనలనుంచి సృష్టిస్తానో, అలా తురీయం అయిన నేను సృష్టిస్తాను.

**ఆత్మనా** – నానుంచే,

**ఆత్మానమ్** – నన్ను నేను సృష్టిస్తాను.

అంటే సబ్జెక్ట్, ఆబ్జెక్ట్, ఇన్‌స్ట్రుమెంట్ – మూడూ నేను. సాధారణంగా ఏదైనా సృష్టించాలంటే ఈ మూడూ ఉండాలి. ఒక చెక్క కుర్చీని సృష్టించాలంటే వడ్రంగి, చెక్క, రంపం – మూడూ ఉండాలి; కాని స్వప్నంలో ఈ మూడింటి విభజన లేదు. అన్నీ నేనే. నేను నా నిద్రాశక్తివల్ల సృష్టిస్తాను. అది బాగానే అర్థమవుతుంది కాని గౌడపాదాచార్యులవారు స్వప్నప్రపంచాన్ని నేను సృష్టించినట్టుగా, ఈ జాగ్రత్ ప్రపంచాన్ని కూడా నేనే సృష్టించాను

అంటారు. కాకపోతే, ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. నేను అంటే తురీయం. తురీయంగా, ఈ శరీరాన్ని కూడా నేనే సృష్టించాను.

**తత్ సృష్ట్వా తదేవానుప్రవిశతి**

ఈ శరీరాన్ని సృష్టించి, అందులోకి ప్రవేశించాడు బ్రహ్మ. ఎలాగైతే స్వప్నప్రపంచం సృష్టించి, స్వప్నశరీరంతో మమేకం చెంది స్వప్నప్రపంచాన్ని అనుభవిస్తానో, అలాగే ఈ జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టించి, జాగ్రత్ శరీరంతో మమేకం చెంది జాగ్రత్ ప్రపంచాన్ని అనుభవిస్తాను. ఎలా సృష్టిస్తాను?

**స్వమాయయా** – నాయొక్క మాయాశక్తివల్ల సృష్టిస్తాను. సృష్టి గురించి చెబితే, అది సగుణ ఈశ్వరునిగా తీసుకోవాలి. ఈ భేదం అర్థం అయితే, పరమాత్మ స్వరూపం అర్థం అయినట్టే. అప్పుడు అహం బ్రహ్మ అస్మి అని ప్రకటించవచ్చు.

**స ఏవ బుధ్యతే భేదాన్** – ఈ బ్రహ్మే సృష్టి చేశాక, జీవునిలోకి అనుప్రవేశం చేశాడు. దానికి ఉదాహరణ మన స్వప్నప్రపంచమే. జాగ్రత్ పురుషుడు తన నిద్రాశక్తితో స్వప్నప్రపంచాన్ని సృష్టించి, స్వప్నపురుషునిగా అనుప్రవేశం చేస్తే, ఈశ్వరుడు తన మాయాశక్తితో జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టించి, విశ్వగా అనుప్రవేశం చేస్తాడు. భేదాన్ అంటే జగత్తులోని విషయవస్తువులు; బుధ్యతే అంటే ప్రమాత. అంటే ప్రమాత–ప్రమేయం రెండూ బ్రహ్మే.

ఈ బ్రహ్మను లేదా తురీయాన్ని తెలుసుకోవటమెలా? తెలుసుకోవటానికి ప్రయత్నిస్తే, ప్రమాత అవుతారు; దేనిద్వారా తెలుసుకోవటానికి ప్రయత్నిస్తే అది ప్రమాణం అవుతుంది; దేన్ని తెలుసుకుంటారో అది ప్రమేయం అవుతుంది. ఒక ప్రమాత, ఒక ప్రమాణం ద్వారా తెలుసుకున్న ప్రమేయం ఆపేక్షిక సత్యమే అవుతుంది కాని ఆత్యంతిక సత్యం కాదు. అందువల్ల దాన్ని ఎన్నడూ తెలుసుకోలేరు.

**ఇతి వేదాంతనిశ్చయః** – తురీయం గురించి వేదాంతం ద్వారానే తెలుసుకోవాలి. వేదాంతమే దీనికి ప్రమాణం. ఒక ప్రమాణాన్ని వాడితే మీరు ప్రమాత అవుతారు. కన్ను అనే ప్రమాణం వాడితే ద్రష్ట అవుతారు; చెవి అనే ప్రమాణం వాడితే శ్రోత అవుతారు. ఈ ద్రష్ట, శ్రోత హోదాలు తీసేస్తే, ఏం మిగులుతుంది? ఈ అనుభవాలు లేని శుద్ధచైతన్యం మిగులుతుంది. ఈ అనుభవాలు లేవని తెలియజేప్పే చైతన్యం మిగులుతుంది.

**విశేష విజ్ఞానరహిత సామాన్య చైతన్యం అహమస్మి**

ఈ సామాన్య చైతన్యమైన నేను మూడు అవస్థల్లోనూ ఉన్నాను.

**ప్రతిబోధ విదితం మతమ్** – కేన

నటుడు ఒక పాత్ర వేస్తాడు, అది అయిపోతుంది, నటుడుగా మిగులుతాడు; ఇంకొక పాత్ర వేస్తాడు, అది అయిపోతుంది, మళ్ళీ నటుడుగా మిగులుతాడు. అతను పాత్ర వేయనీ, మాననీ – నటుడు అనే అసలు పేరు ఎప్పుడూ ఉంటుంది. అదే విధంగా తురీయం అయిన నేను మూడు వేషాలు వేస్తాను. అవి విశ్వ, తైజస, ప్రాజ్ఞ. అవి ఉన్నా, లేకపోయినా నేను తురీయంగా ఎప్పుడూ ఉంటాను. ఈ విషయం జీర్ణించుకుంటే, స్వప్నంలో ఇది స్వప్నం అని తెలిసినట్టుగా ఉంటుంది. నిజానికి స్వప్నంలో అలా తెలియదు; కాని జీవన్ముక్తి అంటే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా అటువంటి స్వప్నం అని తెలుసుకోవటమే.

### కారిక 2.13

**వికరోత్యపరాన్ భావానంతశ్చిత్తే వ్యవస్థితాన్ ।**
**నియతాంశ్చ బహిశ్చిత్త ఏవం కల్పయతే ప్రభుః ॥**

ఈ ప్రపంచాన్ని నేను ఎలా సృష్టిస్తాను? ప్రపంచం అంటే రెండు ప్రపంచాలు తీసుకోవాలి. అవి స్వప్నప్రపంచం, జాగ్రత్ ప్రపంచం.

ఈ రెండు ప్రపంచాలను సృష్టించటానికీ నేను ఒకే పరికరాన్ని వాడతాను. అది మనస్సు. ఒకే మనస్సుతో రెండు ప్రపంచాలను సృష్టిస్తే, ఏది ఎప్పుడు సృష్టించాలో ఎలా తెలుస్తుంది? మనస్సును టీవీ రిమోట్‌తో పోల్చవచ్చు. మనస్సులోని రెండు ఛానెళ్ళు – జాగ్రత్ ఛానెల్, స్వప్న ఛానెల్. మనస్సే మూలం అని ఎలా చెప్పగలరు? సుషుప్తిలో మనస్సు పడుకున్నప్పుడు ఈ రెండు ప్రపంచాలూ కూడా లేవు కదా.

ఏ ఛానెల్‌ని నొక్కాలి? గౌడపాదాచార్యులవారు మనస్సు ఇంద్రియాలను వాడనప్పుడు అది అంతర్ముఖం అయినట్టు అంటున్నారు. అప్పుడు మనస్సులోని వాసనలు పనిచేస్తాయి. ఆ వాసనలు స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాయి. ఒక్కోసారి జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తూ కూడా, మనస్సు ఎటో వెళ్ళిపోతుంది. అప్పుడు తన ఎదురుగా ఉన్న ప్రపంచాన్ని చూడకుండా, తను వేరే ప్రపంచాన్ని సృష్టిస్తుంది. అదే మనస్సు ఇంద్రియాలను వాడితే, జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తుంది.

ఇలా మనస్సు స్వప్నప్రపంచాన్ని చూస్తోంది, జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తోంది అని తెలిసేది ఎవరికి? రెండింటినీ సాక్షిగా చూసే తురీయ ఆత్మకు.

**ప్రభుః కల్పయతే (స్వమాయయా)** – ప్రభుః అంటే సర్వశక్తివంతమైనది. సర్వశక్తివంతమైనది తురీయ ఆత్మ. మాయాశక్తితో కూడిన తురీయ ఆత్మ. స్వమాయయా, ముందు కారిక నుంచి ఇక్కడికి తెచ్చుకోవాలి. ఈ మాయ అనే శక్తి ఎక్కడ ఉంది? తురీయంలోనే ఉంది. 'స్వ' పదం సూచిస్తుంది దాన్ని. అలా తురీయం తనయొక్క శక్తి అయిన మాయవల్ల సృష్టిస్తుంది. దేన్ని?

**అపరాన్ భావాన్** – స్వప్నప్రపంచంలోని విషయవస్తువులను. స్వప్నప్రపంచాన్ని ప్రాతిభాసిక సత్యం అంటారు. స్వప్నవస్తువులను అపరాన్ అని ఎందుకన్నారంటే, వాటి ఉనికి కొన్ని గంటలే ఉంటుంది. అసలు విజ్ఞానశాస్త్రం ప్రకారం స్వప్నకాలం 90 సెకనులు మాత్రమే. ప్రాతిభాసిక సత్యం అని ఎందుకంటారంటే ప్రతిభాసకాలే సత్యం. అంటే కనబడినంత కాలమే సత్యం. అది కూడా నా స్వప్నంలోని వస్తువులు నాకు మాత్రమే సత్యం.

**అంతశ్చిత్తే వ్యవస్థితాన్** – ఈ వస్తువులు మనస్సులో వాసనల రూపంలో ఉంటాయి. పగలు జాగ్రదావస్థలో చూసిన వస్తువులన్నీ వాసనల రూపంలో చిత్తంలో నిక్షిప్తమై ఉంటాయి. అవి ఈ జన్మలోనే కానవసరం లేదు, ముందు జన్మలనుంచి తీసుకొచ్చినవి కూడా అయివుంటాయి.

**వికరోతి** – ఆత్మ స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది. కాసేపు స్వప్నప్రపంచాన్ని చూశాక, విసుగు పుడితే, ఛానెల్ మారుస్తుంది.

**బహిశ్చిత్తః** – ఇప్పుడు అంతర్ముఖమైన మనస్సు వాసనలను వదిలివేస్తుంది. వదిలివేస్తుంది అంటే అవి అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. ఎప్పుడైతే వాసనలు అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయో, అప్పుడే మనస్సు బహిర్ముఖంగా మారుతుంది. ఇప్పుడు ఇంద్రియాలను తోడు తీసుకుంటుంది.

**నియతాన్ (వికరోతి)** – నియతాన్ అంటే జాగ్రత్ ప్రపంచం లేదా వ్యావహారిక ప్రపంచం. ఇప్పుడు వ్యావహారిక ప్రపంచాన్ని సృష్టిస్తుంది. ఇందులో విశ్వగా వ్యవహారం నడుపుతాను కాబట్టి అది వ్యావహారిక ప్రపంచం అయింది. ఇది ప్రాతిభాసిక ప్రపంచంకన్నా ఎక్కువ కాలం ఉంటుంది. అయినా ఇది కూడా ఒకే మాయాశక్తినుంచి వచ్చింది కాబట్టి, ఈ జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్యే. మాయిక ప్రపంచం మొత్తం మిథ్యే.

ఈ నాలుగు దశలను మర్చిపోకూడదు. ముగ్గురు చూస్తారు వీటిని. స్వాప్నికునికి స్వప్నప్రపంచం స్వప్నంలో ఉన్నంతవరకూ సత్యం. జాగ్రత్ పురుషునికి స్వప్నప్రపంచం మిథ్య కాని జాగ్రత్ ప్రపంచం సత్యం. జ్ఞానికి స్వప్నప్రపంచం, జాగ్రత్ ప్రపంచం రెండూ మిథ్యే. ఎందుకంటే జాగ్రదావస్థలో స్వప్నప్రపంచం లేదు, స్వప్నావస్థలో జాగ్రత్ ప్రపంచం లేదు. ఈ రెండూ నా మాయాశక్తివల్ల నేను సృష్టించినవే అని అతను అర్థం చేసుకుంటాడు.

**ఏవమ్** – ఈ విధంగా, తురీయం సృష్టికర్త. జ్ఞాని ఆ తురీయం నేనే అని అర్థం చేసుకుంటాడు. తురీయ ఆత్మగా నేనే సృష్టికర్తను అంటాడు.

### కారిక 2.16

**జీవం కల్పయతే పూర్వం తతో భావాన్ పృథగ్విధాన్ ।**
**బాహ్యానాధ్యాత్మికాంశ్చైవ యథావిద్యస్తథాస్మృతిః ॥**

కారిక 13 నుంచి కారిక 16కి వచ్చాము. 14, 15 కారికలు ముందే (10 తర్వాత) చూసేశాము.

ఇందులో కూడా గౌడపాదాచార్యులవారు మనకు రాగల ఒక సందేహాన్ని తీరుస్తున్నారు. సృష్టి గురించి మాట్లాడితే, సృష్టిలో రెండు అంశాలు ఉన్నాయి. అవి – జీవుడు, జగత్తు. జీవుడు చేతనం, జగత్తు అచేతన వస్తువు. చేతన జీవుడు, అచేతన వస్తువుతో వ్యవహారం నడిపితేనే ఏదైనా అనుభవం కలుగుతుంది.

ఇప్పుడు సందేహం – **ముందు సృష్టించబడినది ఏది? జీవుడా, జగత్తా?** ఇంకో భాషలో చెప్పాలంటే **ఏది ముందు, చైతన్యమా, పదార్థమా?** మామూలుగా అయితే, ఈ ప్రశ్నకు జవాబు లేదు. ఏది ముందో చెప్పాలంటే తార్కికంగా అనేక లొసుగులు ఉంటాయి. విత్తు ముందా, చెట్టు ముందా? కోడి ముందా, గుడ్డు ముందా? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పటం కష్టం. దీన్ని ఇంకా లోతుగా మళ్ళీ మూడవ అధ్యాయంలో విశ్లేషిస్తారు గౌడపాదాచార్యులవారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పటం కష్టమే కాని, రెండు జవాబులు చెబుతూ ఉంటారు. అవి –

1. రెండూ ఒకేసారి పుట్టాయి.
2. ఒక వృత్తాకారంలో సృష్టి జరిగింది. జీవునివల్ల జగత్తు, జగత్తువల్ల జీవుడు వచ్చారు.

కాని ఇక్కడ గౌడపాదాచార్యులవారు, ఈ సందర్భంలో మనం అర్థం చేసుకోవటానికి వీలుగా, ఒక వరుసక్రమాన్ని ఇచ్చారు. దాన్ని **వర్కింగ్ అరేంజ్‌మెంట్** అంటారు. దీన్ని ప్రతిపత్తి క్రమం అంటారు. అంటే మనం అర్థం చేసుకోవటానికి చేసుకున్న తాత్కాలిక ఏర్పాటు. దీన్ని అర్థం చేసుకుని వదిలేయాలి కాని, మరీ లోతుగా వెళ్ళకూడదు. అలా మనం చెప్పుకునే ఒక వరుసక్రమం **సృష్టి, స్థితి, లయ**. నిజానికి సృష్టి, లయలు ఒక వృత్తాకారంలో సాగుతాయి కాని మనం అర్థం చేసుకోవటానికి ఈ వరుస వాడతాము. దీన్నే పూజ్య స్వామీజీ – born is gone అంటారు. బార్న్–సృష్టి, ఈజ్–స్థితి, గాన్–లయ. వెనకనుంచి చూస్తే ఒక వస్తువు లయ కావాలంటే, దానికి ఉనికి ఉండితీరాలి. దానికి ఉనికి ఉండి ఉండాలంటే అది పుట్టివుండాలి. అందువల్ల పుట్టినవ్యక్తియొక్క స్థితిగతులు, మరణం గురించి మాట్లాడతాము.

**ఫ్రీవిల్లా, ఫేటా?** – ఇది కూడా ఒక అంతుపట్టని సమస్య. కాని మనం అర్థం చేసుకోవటానికి వీలుగా శాస్త్రం ముందు ఫ్రీవిల్‌తో మొదలు పెట్టమంటుంది. మీ యొక్క ఫ్రీవిల్‌వల్ల మీరు పూర్వజన్మలో మంచికర్మలో, చెడుకర్మలో చేశారు. ఈ కర్మఫలాన్ని అనుభవించటానికి ఫేట్ కావాలి. ఆ ఫేట్‌వల్ల ఈ జన్మ వచ్చింది. ఈ జన్మలో మళ్ళీ మీరు ఫ్రీవిల్ ఉపయోగించి కర్మలు చేస్తారు.

**జీవుడు ముందా? జగత్ ముందా?** – ఈ రెండింటిలోనూ మనం విషయం తేలికగా అర్థం చేసుకోవటానికి వర్కింగ్ ఆర్డర్ ప్రకారం చూస్తే, జీవుడే ముందు. ఎందుకు జీవుడు ముందు? మన అనుభవప్రమాణం కూడా అదే చెబుతున్నది. భూమ్మీద ఏడు ఖండాలు ఉన్నాయి. కాని మనుష్యులు ఆ ఖండాలలో ఒకటి కనుగొనేదాకా, అది ఉన్నట్టే ఎవరికీ తెలియదు. ఎప్పుడైతే మనిషి దానిమీద అడుగుపెడతాడో, అప్పుడే అతను అక్కడ జీవనం గడపటానికి అనేక వనరులు ఉండాలి. ఆహారం, నీరు, ఆరోగ్యం, ప్రయాణం సదుపాయాలు ఏర్పరచుకోవాలి. రహదారి దానికోసం ఉండదు, దానిమీద మనుష్యులు ప్రయాణం చేయటంకోసం ఉంటుంది. అందువల్ల జీవుడు ముందు, జగత్తు తర్వాత వస్తారు.

జగత్తులో 14 లోకాలు వస్తాయి. స్వర్గ, నరకాలు వాటికోసం అవి సృష్టించబడలేదు. జీవులు చేసుకున్న పుణ్య, పాపాల కర్మఫలాలను అనుభవించటానికి తగ్గట్టుగా అధోలోకాలు, ఊర్ధ్వలోకాలు సృష్టించబడ్డాయి. అందువల్ల జీవుని సృష్టి ముందు జరిగింది అంటాము.

**జీవం కల్పయతే పూర్వమ్** – ముందుగా జీవులను సృష్టించింది ఆత్మ.

**తతః** – దాని తర్వాత. జీవులు ఉంటే వాటి పుణ్య, పాపాలను క్షయం చేసుకోవటానికి అనేక లోకాలు కావాలని చూశాము. పుణ్యజీవులకు పుణ్యలోకాలు, పాపులకు పాపలోకాలు, మధ్యేమార్గంలో ఉన్నవారికి మధ్యలోకాలు సృష్టించబడ్డాయి.

**భావాన్ (కల్పయతే)** – అనేక వస్తువులు సృష్టించబడ్డాయి.

**పృథగ్విధాన్** – ఆ వస్తువులు జీవుని కర్మలకు తగ్గట్టుగా అనేకంగా ఉన్నాయి. మనకు ఈ జన్మలో ఒక విధమైన శరీరం ఇవ్వబడిందీ అంటే, ఆ శరీరంతో ఒక ప్రత్యేకమైన పుణ్య, పాపాలు చేయటానికి నియమించబడింది. అంటే శరీరం, మన కర్మానుసారంగా, ఎంతో చక్కగా తీర్చిదిద్దబడింది.

**బాహ్యానాధ్యాత్మికాంశ్చైవ** – ఈ సృష్టి రెండుగా జరిగింది. బాహ్యాన్ పదాన్ని భావాన్‌తో కలుపు కోవాలి; ఆధ్యాత్మికాన్ని వాసనలతో కలుపుకోవాలి. బాహ్యవస్తువులు, అంతర్గత మనస్సు కూడా సృష్టించబడ్డాయి. ఈ మనస్సు చూసినట్టుగా, ఈ బాహ్యప్రపంచాన్ని చూస్తాము. ఈశ్వరుడు సృష్టించిన జగత్తును అలాగే చూస్తే ఏ సమస్యా లేదు. కాని దాన్ని జీవసృష్టి చేస్తాము. అంటే ఆ జగత్తుకు మనం రాగం అనే ముద్రో, ద్వేషం అనే ముద్రో వేసి చూస్తాము. నిజానికి ఆ వస్తువులో ఏమీ లేదు. ఏ కర్ణాటక సంగీతం అంటే తాతగారు చెవి కోసుకుంటారో, అదే కర్ణాటక సంగీతం పొడే గిట్టదు మనవడికి. అలా మన మనస్సు పరంగా బాహ్యసృష్టిని చూడటంవల్ల, మనుష్యుల ఇష్టాయిష్టాలు కూడా మారతాయి. ఒకరు మాండూక్యోపనిషత్తు వైపు మొగ్గు చూపితే, మరొకరు సినిమాకి వెళ్ళటానికి ఇష్టపడతారు.

అదే విధంగా రాగద్వేషాలతో వస్తువులను చూస్తారు; అవి కర్మలకు దారితీస్తాయి; ఆ కర్మలు పుణ్యపాపాలనే ఫలాలను ఇస్తాయి. ఆ పుణ్యపాప ఫలాలను సుఖదుఃఖరూపాలలో అనుభవించాలి. వాటిని క్షయం చేసుకోవటానికి పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడి తిరుగుతూనే ఉండాలి.

**యథావిద్యస్తథాస్మృతిః** – జగత్తును ఎలా చూస్తే అలా స్పందిస్తారు. ఎలా స్పందిస్తే దానికి తగ్గ పుణ్యపాపాలు పొందుతారు. జగత్తు అలాగే ఉంది, కాని దాన్ని చూసే విధానాన్ని బట్టి, జీవన విధానం మారుతూ వస్తుంది.

స్వప్నప్రపంచానికీ, జాగ్రత్ ప్రపంచానికీ మధ్య పెద్దగా భేదం లేదు. ఎందుకంటే రెండూ ఆపేక్షిక సత్యాలే. రెండూ మిథ్యే. వాటికి ఉనికి వాటిని చూసే ప్రమాత ఉన్నంత వరకే ఉంటుంది. స్వప్నపురుషుడు స్వప్నం చూస్తున్నంతసేపూ అది మహాసత్యం. కాని దాన్నుంచి లేచిన మరుక్షణం, అది మిథ్య. దాని ఉనికే మాయమవుతుంది. జాగ్రదావస్థకు రాగానే, జాగ్రత్ ప్రపంచం ముందుకు వస్తుంది. అది మహాసత్యం అనిపిస్తుంది; కాని గౌడపాదాచార్యులవారు ఇదే సూత్రం ప్రకారం జాగ్రత్ ప్రపంచంనుంచి లేస్తే, అది కూడా మిథ్య అంటున్నారు. ఒక అవస్థలో సత్యం అనిపించిన బాహ్యవస్తువు, ఇంకొక అవస్థకు లేస్తే, మిథ్య అవుతున్నది. ప్రమాతనిబట్టి ప్రమేయం మారుతుంది.

ఏ స్థాయిలో ఉన్న ప్రమేయం కూడా ఆత్యంతిక సత్యం కాదు; దాన్నుంచి పైస్థాయికి లేస్తే, అది ఆపేక్షిక సత్యం మాత్రమే. ఆపేక్షిక సత్యాన్ని వ్యావహారిక సత్యం లేదా మిథ్య అని కూడా అంటారు. ఎందుకు దాన్ని ఆత్యంతిక సత్యం అంటున్నారు? దానికి కారణాలు–

ఎ) **జగత్ స్వరూపం** – మీరు చూసే జగత్తును మీ ప్రమాణంతో చూస్తున్నారు. చూసే పరికరం మారితే, చూడబడే వస్తువు (ప్రమేయం) కూడా మారుతుంది. కన్ను అనే ప్రమాణం వాడితే రంగు, రూపుల ప్రపంచమే కనబడుతుంది; చెవి అనే ప్రమాణం వాడితే శబ్ద ప్రపంచమే వినబడుతుంది. అందువల్ల జగత్తును ఒక ప్రమాణం ద్వారా చూస్తున్నారు. అప్పుడు జగత్తుకు మీ రాగద్వేషాలనే రంగులు పూస్తున్నారు. మీ రాగద్వేషాలు లేకుండా చూడాలంటే, మీ ప్రమాణాన్ని వదిలివేయాలి. కాని ప్రమాణాన్ని వదిలివేస్తే, జగత్తునే చూడలేరు. అంటే మీరు రంగులు పులమని జగత్తును ఎన్నడూ అనుభవించలేరు.

బి) **జగత్ ఉనికి** – ప్రమేయంయొక్క ఉనికి దాన్ని చూసే ప్రమాతమీద ఆధారపడివుంది. స్వప్నపురుషుడు స్వప్నంనుంచి లేస్తే, ఆ స్వప్నప్రపంచం ఉనికిని కోల్పోతుంది. అలాగే జాగ్రత్ పురుషుడు జాగ్రత్ ప్రపంచంనుంచి స్వప్నంలోకి జారుకుంటే, దానికీ ఉనికి లేదు. అంటే జగత్తుయొక్క స్వరూపం, జగత్తుయొక్క ఉనికి చూసే ప్రమాతమీద ఆధారపడివుంది. దాని ఉనికికి ఇంకొక దానిమీద ఆధారపడే దాన్ని సత్యంగా తీసుకోలేము.

ఇలా అనుభవంలోకి వచ్చిన ప్రతి ప్రమేయం కూడా మిథ్యే అయితే, మరి ఏమిటి సత్యం? చూడబడుతున్నవన్నీ మిథ్య అయితే, ఆత్యంతిక సత్యం దానికి భిన్నంగా ఉండాలి కదా? ప్రమేయ ప్రపంచానికి భిన్నంగా ఉన్నది ఏమిటి? ఒక్కటే ఉంది. అది చూసే నేను. అంటే ప్రమాతనైన నేను.

ఆత్యంతిక సత్యం ప్రమేయం కాదు. ప్రమేయం సత్యం కాదు కాబట్టి, అప్రమేయం సత్యం అవాలి. ఉనికి ఉంది కాని ప్రమేయం కానిది ఏమిటి? దానికి జవాబు ఒక్కటే. అది ఆత్మ; ప్రమాత.

నేను స్వప్నప్రపంచాన్ని సృష్టించి, దానికి సత్యం హెూదాను ఇస్తాను. కాని అది తిరిగి నాకు ఏం చేస్తుంది? నన్ను సంసారంలో పడవేస్తుంది. నేను సృష్టించిన స్వప్నప్రపంచం నన్ను భయపెడుతుంది, నన్ను పరుగులు తీయిస్తుంది. దాన్నించి బయటపడాలంటే ఎలా? నేను నిద్రనుంచి లేవటం ఒక్కటే మార్గం.

అలాగే ప్రమాతనైన నేను ఈ ప్రమేయమైన జగత్తును సృష్టించాను. దాన్ని సృష్టించి, అందులో అడుగుపెట్టాను. నేను సృష్టించిన జాగ్రత్ ప్రపంచం నన్ను భయపెడుతున్నది, నన్ను పరుగులు తీయిస్తున్నది. దాన్నుంచి బయటపడాలంటే ఎలా? ఈ నిద్రనుంచి లేవటం ఒక్కటే మార్గం. కాకపోతే ఈ నిద్రనుంచి నా అంతట నేను లేవలేను, గురువు లేపాలి. గురువు నువ్వు చూస్తున్న ప్రమేయం సత్యం కాదు, ప్రమాతవైన నువ్వు సత్యం అంటాడు.

ఇక్కడితో మన ప్రయాణం ముగియలేదు. ప్రమాత కూడా ఆపేక్షిక ప్రమాతే అవుతుంది. జాగ్రత్ ప్రమాత, జాగ్రత్ ప్రపంచాన్ని మాత్రమే చూస్తే; స్వప్నప్రమాత స్వప్నప్రపంచాన్ని మాత్రమే చూస్తాడు. ఒక అవస్థలో ఉండి, ఇంకొక అవస్థలో లేని ప్రమాత ఆపేక్షిక ప్రమాత మాత్రమే. తురీయం అంటే ప్రమాతృ, ప్రమేయ విలక్షణం.

అసంగ చైతన్యం - తురీయం

సంగ చైతన్యం - విశ్వ, తైజస, ప్రాజ్ఞ

అంటే తురీయానికి మూడు ప్రపంచాలతోనూ సంగత్వం లేదు. కాని జీవుడు సృష్టించబడ్డాక, జగత్తును చూస్తాడు. జగత్తును చూస్తే, దాని గురించిన జ్ఞానాన్ని పొందుతాడు.

ఎ) **జానాతి** - జీవుని ఇంద్రియాలు బహిర్ముఖంగా ఉండటంవల్ల, వాటి ద్వారా బాహ్యప్రపంచాన్ని చూస్తాడు. వాటి అనుభవాలను మనస్సులో పదిలపరుచుకుంటాడు. అంటే ప్రపంచాన్ని తన పరంగా చూస్తాడు. ఒకే వస్తువును ఎంతో బాగుంది అని ఒకరంటే, అసలేం బాగోలేదు అని ఇంకొకరు అంటారు.

బి) **స్మరతి** - పొందిన జ్ఞానాన్నిబట్టి, జ్ఞాపకం ఏర్పడుతుంది. జ్ఞానం ఇది ఆనందహేతువు అంటుంది లేదా ఇది దుఃఖహేతువు అంటుంది. ఎప్పుడైతే కొన్ని నచ్చుతాయో,

ఆ అనుభవాలనే పదేపదే పొందాలనుకుంటాడు. అంటే జ్ఞానం, స్మరణం ఒక వస్తువును మళ్ళీ చూసేలాగా చేస్తాయి.

సి) **ప్రవృత్తి, నివృత్తి** – తను జ్ఞానం పొందిన వస్తువు జ్ఞాపకంలో నిలిచి, ప్రవృత్తి మార్గాన్నో, నివృత్తి మార్గాన్నో ఎన్నుకునేలా చేస్తుంది. దశలు ఈ విధంగా ఉంటాయి.

**జానాతి, స్మరతి, ఇచ్ఛతి, యతతే** – తెలుసుకుంటాడు, గుర్తుంచుకుంటాడు, ఇష్టపడతాడు, దాని వెంట వెళతాడు. దీన్ని యత్నం అంటారు. వెంట వెళితే ప్రవృత్తి, దాన్ని ఇష్టపడక దూరం తొలిగితే అది నివృత్తి.

డి) **పుణ్యపాప ఫలం** – ఈ ప్రవృత్తి, నివృత్తులు పుణ్యపాపాలను కలుగజేస్తాయి. అవి కూడా దృష్టఫలం, అదృష్టఫలం రూపంలో వస్తాయి. దాన్ని **ఆగామికర్మ** అంటారు. ప్రారబ్ధ కర్మలను క్షయం చేసుకోవటానికి ఈ జన్మలో కొన్ని కొత్త కర్మలు చేస్తాడు, వాటి ఫలంగా కొత్త ఫలాలు వస్తాయి, దాన్ని ఆగామికర్మ అంటారని చూశాము. ఖర్చయ్యేది తక్కువ, కొత్తగా వచ్చేది ఎక్కువ ఉంటుంది. ఆగామికర్మల్లో కొన్ని ఈ జన్మలోనే క్షయమవుతాయి కాని కొన్ని మళ్ళీ సంచితకర్మల్లో వెళ్ళి కలుస్తాయి. వాటిని క్షయం చేయటంకోసం వేరే జన్మ ఎత్తక తప్పదు. మరణం కామా మాత్రమే, అది పునరపి జననానికి దారితీస్తుంది. మళ్ళీ కొత్త ఆగామి కర్మలు వస్తాయి; మళ్ళీ ఈ వృత్తం కొనసాగుతుంది.

ఈ వృత్తంనుంచి బయటపడాలంటే అహం సత్యం, జగన్మిథ్యా జ్ఞానం ఒక్కటే మార్గం. అది కూడా గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే సాధ్యం. ఎప్పుడైతే ఈ సత్యం జీర్ణించుకుంటాడో, అప్పుడే ఈ జగత్తు కోరలు తీసిన కోడెత్రాచులాగా అతన్నేమీ చేయలేదు.

### కారిక 2.17

**అనిశ్చితా యథా రజ్జురంధకారే వికల్పితా ।**
**సర్పధారాదిభిర్భావైస్తద్వదాత్మా వికల్పితః ॥**

స్వప్నప్రపంచం మిథ్య అని గౌడపాదాచార్యులవారు నిరూపించారు. ఈ మిథ్యాత్వాన్ని వివరించటానికి గౌడపాదాచార్యులవారు ఒక ఉదాహరణ తీసుకున్నారు. అది వేదాంత శాస్త్రంలో చాలా ముఖ్యమైన ఉదాహరణ. అది రజ్జు–సర్ప భ్రాంతి. దీన్ని శంకరాచార్యులవారు తన బ్రహ్మసూత్రభాష్యంలో అధ్యాసభాష్యం పేరిట చాలా వివరంగా చర్చించారు. అది శంకరాచార్యులవారి సృష్టి కాదు, ఎప్పటినుంచో ఉందని ఈ కారిక ద్వారా తెలుస్తుంది. గౌడపాదాచార్యులవారు శంకరాచార్యులవారి గురువుకు గురువు. అంతేకాదు కంబ రామాయణంలో కూడా ఈ ఉదాహరణ చూస్తాము.

**రజ్జుః అంధకారే అనిశ్చితా** – క్రీనీడలో తాడు స్పష్టంగా కనిపించదు. అక్కడేదో ఉన్నట్టు తెలుస్తుంది కాని, అదేమిటో స్పష్టంగా తెలియదు. ఈ సగం జ్ఞానమే అన్ని సమస్యలకూ

మూలకారణం. అక్కడ పూర్తిగా చీకటి ఉండి, అక్కడ ఏదో ఉందని తెలియకపోతే ఏ సమస్యా లేదు. అందువల్లనే అజ్ఞానం ఆనందం అంటారు. అలాగే అక్కడ పూర్తి వెలుతురు ఉండి, అక్కడ ఉన్నది తాడు అని స్పష్టంగా తెలిసినా కూడా, ఏ సమస్యా లేదు. అందువల్లనే జ్ఞానం ఆనందం అంటారు. పూర్తి అజ్ఞానం, పూర్తి జ్ఞానం రెండూ ఆనందమయమే. అరకొర జ్ఞానంతో వస్తుంది చిక్కంతా. దీన్ని అనిశ్చితా అంటున్నారు గౌడపాదాచార్యుల వారు.

| | |
|---|---|
| అక్కడ ఉన్నది తాడు | – వాక్యం |
| ఉన్నది | – సామాన్య జ్ఞానం, అనావృత అంశం |
| తాడు | – విశేష జ్ఞానం, ఆవృత అంశం |

అక్కడ ఉన్నది – కప్పబడిలేదు, ఆ జ్ఞానం ఉంది. దాన్ని సామాన్య జ్ఞానం అంటారు. తాడు – కప్పబడివుంది, దాన్ని విశేష జ్ఞానం అంటారు. అనిశ్చితా అంటే సామాన్య జ్ఞానం ఉంది కాని, విశేష జ్ఞానం లేదు అని అర్థం.

**విశేష అజ్ఞాన పూర్వక సామాన్య జ్ఞానమ్**

అది తాడు అని తెలియకపోవటంవల్ల నన్ను భయభ్రాంతుణ్ణి చేస్తున్నది. ఈ విశేష అజ్ఞానానికి రెండు శక్తులు ఉన్నాయి. అవి – ఆవరణశక్తి, విక్షేపశక్తి. ఆవరణశక్తి కప్పివేస్తుంది; విక్షేపశక్తి సృష్టిస్తుంది. ఆవరణశక్తి అక్కడ ఉన్న తాడును కప్పివేస్తుంది. తాడు తాడుగా తెలియదు. దాని తర్వాత విక్షేపశక్తి రంగంలో దిగుతుంది. అది ఒక రిలే రేసులా సాగుతుంది. తాడును చూసి, తాడు తప్ప వేరే ఏదైనా ఉన్నట్టుగా సృష్టిస్తుంది. మనం ఏదంటే భయపడతామో, దాన్ని చూపిస్తుంది.

ఉదాహరణకు నాకు తలనెప్పి వచ్చింది అనుకుందాము. అంటే శరీరంలో ఏదో రుగ్మత వచ్చింది అనే సామాన్య జ్ఞానం ఉంది కాని, ఆ రుగ్మత ఏమిటో తెలిసే విశేషజ్ఞానం లేదు. అప్పుడు నా విక్షేపశక్తి రంగంలోకి దిగుతుంది. తలనెప్పి అనేక కారణాలవల్ల రావచ్చు కాని, నాకు అన్నింటికన్నా భయం వేసే కారణాన్ని చూపిస్తుంది. అది కాన్సరో, బ్రెయిన్ ట్యూమరో అయివుంటుంది అనుకుంటాను. అందువల్లనే డాక్టరు దగ్గరకు వెళతాను. ఒకవేళ డాక్టరు ఎందుకన్నా మంచిది, బయాప్సీ చేయాలి అన్నాడా, అంతే! అగ్నిలో ఆజ్యం పోసినట్టు ఉంటుంది నా పరిస్థితి. వంద ఆలోచనలు నన్ను భయంలోకి త్రోసివేస్తాయి. నేను వీలునామా కూడా రాసే పరిస్థితికి తీసుకువెళతాయి. ఆ భయం ఎప్పుడు పోతుంది? పరీక్షలన్నీ అయి, నాకేం ప్రమాదం లేదని డాక్టరు చెప్పాక.

అదే విధంగా తాడును చూసి ఏదో అనుకున్నాను. సాధారణంగా పాము అనుకుంటాను. నిజంగా అక్కడ పాము ఉందా? లేదు! కాని అది నా అజ్ఞానంవల్ల ఏర్పడిన భయం. కాని తమాషా ఏమిటంటే – అసలు లేని పాము నన్ను భయభ్రాంతుణ్ణి చేస్తుంది. నిజానికి అది

లేదు అనేకన్నా దాన్ని ప్రాతిభాసిక సత్యం అందాము. ఎందుకంటే దాన్ని చూసినంత సేపూ అది మహాసత్యం. అది భయపెడుతుంది, పరుగులు తీయిస్తుంది. తమాషా ఏమిటంటే, నేను పరుగులు తీస్తుంటే, అది నా వెంటే వస్తున్న భ్రమ కలుగుతుంది.

ఎందుకు దీన్ని ప్రాతిభాసిక సత్యం అంటున్నాము? ఎందుకంటే, దాని దగ్గరకి వెళ్ళి టార్చిలైటు వేస్తే, అక్కడ పాము మాయమవుతుంది. జ్ఞానం పొందితే, అజ్ఞానం తొలుగుతుంది. పాము అసలు లేదా అంటే నా భావనలో ఉంది. నిజంగా ఉందా అంటే దగ్గరికి వెళితే లేదు. అంటే నన్ను భయపెట్టేటంత సత్యంగా ఉంది. కాని విచారణ చేస్తే, ఉనికి ఉండేటంత సత్యంగా లేదు. అటువంటి సత్యాన్ని మిథ్య అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ప్రపంచం కూడా అలాంటి మిథ్యలోకే వస్తుంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

ప్రపంచం కూడా దాని గురించిన విచారణ చేయకపోతే, అలాగే భయపెడుతుంది. నేను పరుగులు తీస్తే, పాము కూడ నా వెనుకే వస్తున్నట్టు ఎలా అనిపిస్తుందో, అలా సంసారంనుంచి పారిపోవటానికి ఎన్ని కర్మలు, ఎన్ని యజ్ఞయాగాదులు చేసినా, అవి నన్ను రక్షించవు. టార్చ్‌లైటు వేస్తే 'పాము పారిపోతుంది.' ఈ వాక్యాన్ని చూడండి. అసలు అక్కడ నిజంగా పాము లేదు, నేను పారిపోవటానికి. పామే పారిపోతుంది. అలాగే అక్కడ నిజంగా సంసారం లేదు నేను సంసారంనుంచి పారిపోవటానికి. సంసారమే నానుంచి పారిపోతుంది. ఇప్పుడు ఈ కారికను మళ్ళీ చూద్దాము.

**అంధకారే** – క్రీనీడలో

**రజ్జుః అనిశ్చితా** – తాడు కొంచెమే తెలుస్తున్నది. అంటే ఆవరణశక్తి తాడుని కప్పివేసింది.

**వికల్పితా** – విక్షేపశక్తి దాన్ని ఈ విధంగా సృష్టిస్తోంది.

**సర్పధారాదిభిర్భావైః** – సర్పంగా, నీటిధారగా. ఆది అంటే ఇంకేమైనా ఊహించుకోవచ్చు. నేలలో చీలికలాగా లేదా దండలాగా కనిపిస్తుంది.

**తద్వద్** – అదే విధంగా,

**ఆత్మా వికల్పితః** – ఆత్మ కూడా వివిధంగా కనిపిస్తున్నది. అంటే తురీయ ఆత్మను విశ్వగానో, తైజసగానో, ప్రాజ్ఞగానో, అజ్ఞానంవల్ల పొరపాటు పడుతున్నాము. సమష్టి స్థాయిలో అజ్ఞానాన్ని మాయ అంటే, వ్యష్టి స్థాయిలో అజ్ఞానాన్ని అవిద్య అంటారు.

### కారిక 2.18

**నిశ్చితాయాం యథా రజ్జ్వాం వికల్పో వినివర్తతే ।**
**రజ్జురేవేతి చాద్వైతం తద్వదాత్మవినిశ్చయః ॥**

రజ్జు-సర్ప భ్రాంతిని కేవలం ఒక్క పద్ధతివల్లనే పోగొట్టగలము. అది పొరపాటుకు కారణమైన అజ్ఞానాన్ని తొలగించటం ద్వారా.

**కారణ నివృత్తే కార్య నివృత్తిః**

రజ్జు-సర్పభ్రాంతికి కారణమేమిటి? తాడు అజ్ఞానం. తాడు అజ్ఞానాన్ని పోగొట్టాలంటే తాడు జ్ఞానాన్ని ఇవ్వాలి. తాడును కర్రతో కొడితే పాము పోదు, తాడు మీద టార్చ్‌లైటు వేసి చూడాలి, అంతే. అంటే సర్పభ్రాంతి తాడు అజ్ఞానంవల్ల ఏర్పడింది; తాడు అజ్ఞానం తాడు జ్ఞానంవల్ల పోతుంది కాని, వేరే దేనివల్లా పోదు. పాము అనే భ్రాంతిని అధ్యాస అంటారు; దాని సత్యాన్ని అధిష్ఠానం అంటారు. అంటే అధిష్ఠాన జ్ఞానంవల్ల అధ్యాస పోతుంది.

**అధిష్ఠాన జ్ఞానేన మిథ్యా సర్పనివృత్తిః**

**నిశ్చితాయాం యథా రజ్జ్వాం** - తాడు గురించిన నిశ్చయజ్ఞానం పొందితే;

**రజ్జురేవేతి** - అంటే అక్కడ ఉన్నది తాడే, పాము కాదనే నిశ్చయజ్ఞానం పొందితే,

**వికల్పో వినివర్తతే** - అజ్ఞానంవల్ల ఏర్పడిన పొరపాట్లు తొలగిపోతాయి. తమాషా ఏమిటంటే, తాడు గురించిన జ్ఞానం ఒక్కటే; కాని అది తాడు గురించిన అజ్ఞానంవల్ల ఏర్పడిన అనేక పొరపాట్లను ఒక్క తృటిలో పారద్రోలుతుంది. నాకు తాడు అజ్ఞానం పోయింది కాని పాము పొరపాటు ఇంకా ఉంది అనుకూడదు. పొరపాట్లు అన్నీ ఒక్కసారి పోతాయి. పొరపాట్లు అన్నీ పోతే, మిగిలేది ఏమిటి?

**అద్వైతం (అవశిష్యతే)** - అద్వైతమే మిగిలుతుంది. అంటే ఒక్కటే తాడు మిగులుతుంది.

**తద్వద్** - అదే విధంగా,

**ఆత్మ వినిశ్చయః** - ఆత్మజ్ఞానం పొందితే అన్ని పొరపాట్లు పోతాయి. ఆత్మ అనే అధిష్ఠానం మీద అధ్యాస - విశ్వ, తైజస, ప్రాజ్ఞలు. శాస్త్రజ్ఞానం అనే టార్చ్‌లైటు వేస్తే, అధిష్ఠానజ్ఞానం కలుగుతుంది. అధిష్ఠానజ్ఞానం కలిగితే, ప్రపంచం మిథ్య అని తెలుస్తుంది.

ప్రపంచాన్ని నాలుగు విధాలుగా వర్ణిస్తుంది మాండూక్యం.

ఎ) విశ్వ-విరాట్ జంట + తైజస-హిరణ్యగర్భ జంట + ప్రాజ్ఞ-ఈశ్వర జంట = 6

బి) స్థూలశరీరం-స్థూలప్రపంచం + సూక్ష్మశరీరం-సూక్ష్మప్రపంచం + కారణశరీరం-కారణప్రపంచం = 6

సి) ఆత్మయొక్క ప్రథమ పాదము + ద్వితీయ పాదము + తృతీయ పాదము - పాదత్రయము = 3

డి) మొదటి రెండు పాదాలు కార్యం + మూడవ పాదం కారణం = 3

**కార్యకారణాత్మక ప్రపంచ మిథ్యాత్వ నిశ్చయమ్**

మిథ్య అంటే అసలు ఉనికి లేనిది అని అర్థం తీసుకోకూడదు. మిథ్య అంటే ఒక అవస్థలో ఉండి, ఇంకొక అవస్థలో లేనిది. స్వప్నం స్వాప్నికునికి సత్యం; జాగ్రత్ ప్రపంచం జాగ్రత్ పురుషునికి సత్యం; కాని జాగ్రత్ పురుషునికి స్వప్నం మిథ్య. అజ్ఞానంవల్ల పుట్టినది ఏదైనా మిథ్య; అజ్ఞానాన్ని పారద్రోలితే పొరపాటు పోతుంది. తాడు అజ్ఞానం మిథ్యా పామును సృష్టించింది; తాడు జ్ఞానం మిథ్యా పామును పోగొట్టింది. ఆ విధంగా ఆబ్జెక్ట్ మిథ్య, సబ్జెక్ట్ సత్యం. తురీయజ్ఞానం పొందితే ఈ పొరపాటు పోతుంది.

**కారిక 2.19**

**ప్రాణాదిభిరనంతైశ్చ భావైరేతైర్వికల్పితః ।**
**మాయైషా తస్య దేవస్య యయా సంమోహితస్స్వయమ్ ॥**

3. **కల్పనా ప్రకారాః – కారికలు 19–29**

కల్పనా ప్రకారాః అంటే అనేక పొరపాట్లు.

**దృక్ ఆత్మా అజ్ఞానేన దృశ్య అజ్ఞాన ఉత్పత్తిః**

చూస్తున్న నేనే ఆత్మను (తురీయాన్ని) అని తెలియక, బాహ్యవస్తువు సత్యం అనుకుని పొరపాటు పడుతున్నాను.

ఎప్పుడైతే సత్య అధిష్ఠానం తెలియదో, అప్పుడే మిథ్యా వస్తువును పొరపాటుగా సత్యం స్థాయికి పెంచుతారు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. తాడు తెలియకపోతే, పాము సత్యం అయి కూర్చుంటుంది; జాగ్రత్ పురుషుడు తెలియకపోతే, స్వప్నం నిజమై కూర్చుంటుంది; తురీయం తెలియకపోతే, దృశ్యప్రపంచం సత్యమై కూర్చుంటుంది. ఇలా సత్యం కాని సత్యంగా మారటమే సంసారం.

సత్యంకోసం బాహ్యవస్తువుల్లో వెతికితే అది ఎన్నటికీ దొరకదు. ఎందుకంటే వెతికే నేనే సత్యం; వెతకబడుతున్న వస్తువు కాదు సత్యం. ఈ విషయం మామూలు మనుష్యులే కాదు, దార్శనికులు కూడా మర్చిపోతున్నారు. అందువల్ల అనేక పొరపాట్లు జరుగుతున్నాయి. సత్యాన్వేషణలో విజయం సాధించలేకపోతున్నారు. వారి అన్వేషణే సత్యదూరంగా సాగుతున్నది.

**అనంతైశ్చ భావైరేతైర్వికల్పితః** – అనేక విషయవస్తువులను ఆత్యంతిక సత్యంగా భావిస్తారు. నిజమేమిటంటే, అసలు ఏ ఆబ్జెక్ట్ కూడా సత్యం కాదు; సబ్జెక్ట్ మాత్రమే సత్యం. ఎందుకు విషయవస్తువులను సత్యంగా పొరపాటు పడుతున్నారు?

**మాయైషా** – అజ్ఞానంవల్ల. తమిళంలో ఈ అజ్ఞానాన్ని వర్ణించే ఒక అద్భుతమైన కవిత ఉంది. దాని సారాంశం – సత్యం సాక్షిచైతన్యమైన నేను, అది తెలియక, సుదూరంగా ఉన్న

అంతరిక్షంలో టెలిస్కోప్‌తోనో, అంతర్గతంగానో వెతుకుతాను. సత్యం నాకు దూరంగానూ లేదు, నా లోపలా లేదు; సత్యం వెతుకుతున్న నేనే సత్యాన్ని.

ఒక దొంగ ఒక జమీందారుతో కలిసి రైలులో ప్రయాణించాడు. ఆ జమీందారు చాలా ధనం తెచ్చుకున్నాడు తన వెంట. రోజూ అది తీసి, లెక్క పెట్టుకుని దాచేసేవాడు. రాత్రిపూట ఆ డబ్బును కొట్టేద్దామని దొంగ ఎంత తీవ్రంగా ప్రయత్నించినా, అతను సఫలీకృతం కాలేకపోయాడు. అలా మూడు రాత్రులు గడిచాయి కాని ప్రయోజనం కలుగలేదు. ఇంక లాభంలేదని, కుతూహలం చంపుకోలేక, ఆ జమీందారునే అడిగేశాడు; ఆయన ఎక్కడ డబ్బు దాచాడని. జమీందారు నవ్వి, 'నువ్వు అలా వెళ్ళినప్పుడు నీ దిండు గలేబులోనే దాచేవాడిని,' అన్నాడు. దొంగ అక్కడ తప్ప అన్నిచోట్లా వెతికాడు కాబట్టి దొరకలేదు. మనమూ అంతే. భగవంతునికోసం అంతటా వెతుకుతాము – బయటా, లోపలా. కాని మనమే చైతన్యపరంగా భగవంతులమని తెలుసుకోలేము. ఇది మాయయొక్క శక్తి.

ఏష మాయ – ఈ మాయ మనిషిని బహిర్ముఖంగా చేస్తున్నది.

**తస్య దేవస్య** – ఈ మాయ తురీయ ఆత్మయొక్క శక్తి.

**యయా సంమోహితస్స్వయమ్** – యయా అంటే ఆ మాయవల్ల; సంమోహితం అంటే మోహంలో పడిపోతున్నాము. స్వయం అంటే మనం. అంటే మనం మాయవల్ల మోహంలో పడిపోతున్నాము. సత్యం ఒకటే కాని అది తెలియక, అనేక పొరపాట్లు పడుతున్నాము. ఈ కారికలో ఒక పొరపాటును పేర్కొంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**ప్రాణాదిభిః** – భగవంతుణ్ణి ఆబ్జెక్టుగా అంటే ప్రమేయంగా చూసే పొరపాటు మొట్టమొదటిది. భగవంతుణ్ణి ప్రమేయంగా చూడటం పొరపాటు అనే ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. నువ్వు కొలిచే దేవుడు, బ్రహ్మ అంటారు చాలామంది దార్శనికులు.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన

నువ్వు కొలిచే దేవుడు బ్రహ్మ కాదు, దేవుణ్ణి కొలిచే నువ్వే బ్రహ్మవు అంటుంది కేనోపనిషత్తు.

మాండూక్యోపనిషత్తులోనే ఒక సూత్రం చూశాము –

యత్ యత్ దృశ్యం తత్ తత్ మిథ్యా

మనం కొలిచే దేవుడు మిథ్య; మనం చూసే ప్రపంచం మిథ్య. పరమాత్మ సత్యం అని ఒక్క సందర్భంలోనే చెప్పగలము అంటుంది శాస్త్రం. ఎప్పుడు? జీవాత్మ, పరమాత్మ ఐక్యం అర్థమైనప్పుడే. **అహం బ్రహ్మ అస్మి** అనే జ్ఞానం పొందినప్పుడే అది సత్యం. ప్రాణః అంటే ప్రమేయంగా కనబడే ఈశ్వరుడు. దీన్నే సాంకేతికంగా చూస్తే **తటస్థ ఈశ్వరః** అంటాము.

న్యాయదార్శనికులు కూడా పరమాత్మను ఆబ్జెక్టుగా చూస్తారు కాని అద్వైతంలో అది సత్యం కాదు. ఇప్పుడు వరుసగా అనేక పొరపాట్లు చూస్తాము.

**కారిక 2.20**

**ప్రాణ ఇతి ప్రాణవిదో భూతానీతి చ తద్విదః ।**
**గుణా ఇతి గుణవిదస్తత్త్వానీతి చ తద్విదః ॥**

దార్శనికులను రెండు తెగలుగా విభజించవచ్చు – ఆస్తికులు, నాస్తికులు. ఆస్తికులు వేదాన్ని నమ్ముతారు; నాస్తికులు నమ్మరు. కాని పరమాత్మ విషయంలో ఇద్దరూ పొరపాటు పడతారు. ఈ భాగానికి (19–28) శంకరాచార్యులవారు భాష్యం రాయలేదు. ఆయన ఉద్దేశ్యంలో ఇతరుల అయోమయాన్ని మనం తెలుసుకుని ప్రయోజనం ఏమిటి అని. కాని ఆయన భాష్యాలకు ఉపభాష్యం రాసే ఆనందగిరి వీటిమీద కొంత భాష్యం రాశారు. అవి ముఖ్యమని చెప్పటానికి కాదు, అవి తెలుసుకుని మనం కూడా ఆ అయోమయంలో పడకుండా జాగ్రత్త పడాలనే ఉద్దేశ్యంతో రాశారు. వరుసగా చూసుకుంటూ వద్దాము.

1. **ప్రాణ ఇతి ప్రాణవిదః** – ప్రాణం అంటే ప్రమేయంగా చూస్తారు అని చూశాము. భగవంతుణ్ణి వారు ప్రమేయంగా చూస్తారు. అలా చూడటంలో తప్పేంలేదు. హిరణ్యగర్భను సమష్టిప్రాణం అంటారు. కర్మకాండలో భగవంతుణ్ణి ప్రమేయంగా తీసుకుని కర్మలు చేస్తాము. ఉపాసనకాండలో కూడా పరమాత్మను ఉపాస్యదేవతగా భావించి ఉపాసన చేస్తాము. అందువల్ల మన భక్తి ఏకరూప ఈశ్వరునితోనే మొదలవ్వాలి కాని అక్కడితో ఆగిపోకూడదు. చివరికి అరూప ఈశ్వరునికి రావాలి. ఉన్నదొకటే చైతన్యం అని అర్థం చేసుకోవాలి. మహావాక్యమైన **తత్త్వమసి** జీవ ఈశ్వర ఐక్యాన్ని చూపించి, పరమాత్మ ప్రమేయం అనే అపోహను పోగొడుతుంది.

భగవద్గీతలో కూడా కృష్ణపరమాత్మ నాలుగు రకాల భక్తులను పేర్కొని, నాలుగవ రకం భక్తిలో భక్తునికి, భగవంతునికీ భేదం లేదని చెప్పాడు.

**జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** – గీత 7–18

ద్వైతభక్తి ఉన్నవారు భగవంతుణ్ణి తమకు భిన్నంగా, ప్రమేయంగా కొలుస్తారు.

2. **భూతానీతి చ తద్విదః** – కొంతమంది భగవంతుణ్ణి నమ్మరు. వారు పంచభూతాలే సత్యం అంటారు. అక్కడ కూడా వారు నాలుగు భూతాలనే సత్యంగా తీసుకుంటారు. ఆకాశం కంటికి కనబడదు కాబట్టి దాన్ని తీసుకోరు. వారు భూతాలే సత్యం అని ఎందుకంటారంటే, ప్రళయంలో అన్నీ ఈ భూతాలలోనే లయమైపోతాయి కాబట్టి.

3. **గుణా ఇతి గుణవిదః** – సాంఖ్యదార్శనికులు గుణత్రయమే సత్యం అంటారు. మూడు గుణాలు – సత్త్వరజస్తమో గుణాలు. ఎవరిని చూసినా వారిలో ఈ మూడు గుణాలూ

ఉంటాయి. అందువల్ల అవే సత్యం అనుకుంటారు. వారికి గుణాతీత నిర్గుణబ్రహ్మ గురించి తెలియదు.

4. **తత్త్వానీతి చ తద్విదః** – తత్త్వం అంటే తత్త్వత్రయం. తత్త్వత్రయమే సత్యం అంటారు ఒక విధమైన శైవులు. వారు చెప్పే త్రయం – పశు, పతి, పాశం. పశు అంటే అన్ని జీవులు; పతి అంటే అధిపతి; పాశం అంటే భగవంతుడు వాడే పాశం (తాడు). పశువులమైన మనను పాశంతో అదుపులో పెడతాడు పతి; తోలుబొమ్మలాటలో దారాలతో ఆ బొమ్మలను ఆడిస్తాడు ఆటగాడు. విశిష్టాద్వైతంలో కూడా తత్త్వత్రయం వస్తుంది కాని అది వేరు. అవి – చిత్, అచిత్, విష్ణు.

వీటన్నింటిలోనూ సమానంగా ఉన్న అంశం – భగవంతుడు ప్రమేయం.

**కారిక 2.21**

**పాదా ఇతి పాదవిదో విషయా ఇతి తద్విదః ।**
**లోకా ఇతి లోకవిదో దేవా ఇతి చ తద్విదః ॥**

5. **పాదా ఇతి పాదవిదః** – కొంతమంది విజయవంతంగా మాండూక్యోపనిషత్తుదాకా వస్తారు; ఆత్మను చతుష్పాద ఆత్మ అంటారని నేర్చుకుంటారు; చతుష్పాద ఆత్మే సత్యం అంటారు. ఇందులో పొరపాటు ఏముంది, అది సత్యమే కదా అనిపిస్తుంది మనకు. కాని అక్కడే వస్తుంది చిక్కంతా. వారు అక్కడే ఆగిపోతారు. ఆత్మను నాలుగు పాదాలుగా వర్ణించింది ఉపనిషత్తు నిజమే కాని నాలుగవ పాదానికి వచ్చేసరికి ఏం చేసింది? మొదటి మూడు పాదాలను కొట్టివేసింది.

**నాంతః ప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాఽప్రజ్ఞమ్**
– మంత్రం 7

అంది. అంటే ఆత్మయొక్క నాలుగు పాదాల్లో మొదటి మూడు కార్యకారణ పాదాలు; నాలుగవ పాదం – కార్యకారణ విలక్షణ తురీయ ఆత్మ. మూడు పాదాలు మిథ్య, నాలుగవ పాదమే సత్యం. కాని వారు నాలుగు పాదాలూ సత్యమే అంటారు.

6. **విషయా ఇతి తద్విదః** – ఇంకొక దార్శనికులు ఉన్నారు. వారి లౌకికవిషయాలే సత్యం అంటారు. వారికి వేదాంతం వంటబట్టదు. ఫిలాసఫీ అంటే ఒక గుడ్డివాడు ఒక చీకటిగదిలో అక్కడ లేనేలేని నల్లపిల్లిని వెతికినట్లు ఉంటుంది అంటారు. వారు తిను, తాగు, అనుభవించు అంటారు. వారిని చార్వాకులు అంటారు.

ఆంగ్లదేశంలో కూడా ఎపిక్యూరస్ అనే ఒక సిద్ధాంతి ఉన్నాడు. అతని సిద్ధాంతం కూడా అదే – ఈట్, డ్రింక్ అండ్ బి మెర్రీ. చార్వాకులు చెప్పేది ఒకటే – స్వర్గం ఉందో లేదో

ఎవరికి తెలుసు? పునర్జన్మ ఉందో లేదో ఎవరికి తెలుసు? అందువల్ల ఇప్పుడే అనుభవించు. అందువల్ల వారు చెప్పేది విషయవస్తువులే పరమసత్యం.

7. **లోకా ఇతి లోకవిదః** – లోకాలను తెలుసుకున్న పౌరాణికులు లోకత్రయమే సత్యం అంటారు. ఆ లోకాలను భూః, భువః, సువః గా తీసుకోవచ్చు; లేదా కారణ, సూక్ష్మ, స్థూల ప్రపంచాలుగా తీసుకోవచ్చు.

8. **దేవా ఇతి చ తద్విదః** – కొంతమంది దేవతలే సత్యం అంటారు. దేవతోపాసకులు, దేవతలే అన్నింటిని నియంత్రిస్తారు అంటారు. వారు కర్మకాండలోని దేవతాకాండాన్ని నమ్ముతారు. ఏ కష్టం వస్తే ఏ దేవతకు పూజ చేయాలో, ఆ దేవతకు చేస్తారు. వీరు ఉపాసకులు.

**కారిక 2.22**

**వేదా ఇతి వేదవిదో యజ్ఞా ఇతి చ తద్విదః ।**

**భోక్తేతి చ భోక్తృవిదో భోజ్యమితి చ తద్విదః ॥**

9. **వేదా ఇతి వేదవిదః** – ముందు వారు దేవతలు సత్యం అంటే, వీరు వేదాలు సత్యం అంటున్నారు. వేదాలను **శబ్దబ్రహ్మ** లేదా **నాదబ్రహ్మ** అంటారు. వీరి వాదనను **స్ఫోటవాదం** అంటారు. వేదపారాయణం చేస్తే, ఆ మంత్రాల శబ్దమే వారిలో మార్పు తెస్తుంది అంటారు వారు. పరిహార మంత్రాలు కూడా వారికి వేదమంత్రాలే. వారి దృష్టంతా వేదమంత్రాల మీద, ఆ వేదఘోష తెచ్చే ప్రకంపనలమీద ఉంటుంది. దాన్ని ప్రకంపనల సిద్ధాంతం అనవచ్చు. దానిమీద వారు పరిశోధనలు కూడా జరుపుతారు. ఆలయంలో రుద్రాభిషేకం చేస్తే ఎటువంటి ప్రకంపనలు కలుగుతాయో విశ్లేషిస్తారు వారు.

అంతేకాదు వారు సంగీతం మోక్షాన్ని ఇస్తుంది అంటారు. దాన్ని నాద ఉపాసన అంటారు. సంగీతం చిత్తశుద్ధి ఇస్తుంది అంటే వేదాంతం అంగీకరిస్తుంది కాని, నాదబ్రహ్మే సత్యం, నాద ఉపాసన మోక్షాన్ని ఇస్తుంది అంటే మాత్రం ఒప్పుకోదు. వేదమంత్రాలకే ప్రాముఖ్యతను ఇచ్చేవారు, అర్థాలు తెలుసుకోవటానికి ప్రయత్నించరు. వారి దృష్టి ఎంతసేపూ స్వరం, పదం, క్రమం, జట – వీటిమీదే ఉంటుంది.

10. **యజ్ఞా ఇతి చ తద్విదః** – కొంతమంది వీరికన్నా కొంచెం ముందడుగు వేస్తారు. వారిని పూర్వమీమాంసకులు అంటారు. వేదమంత్రాలను పఠిస్తే చాలదు, వాటి అర్థాలు కూడా తెలుసుకోవాలి అంటారు. మంచిదే కదా, మరి ఏమిటి సమస్య? వారు అర్థాలు తెలుసుకోవాలన్నది వేదపూర్వభాగాన్ని మాత్రమే. వేదపూర్వభాగం కర్మకాండ అని చూశాము.

అందులో అనేక యజ్ఞయగాదులు వస్తాయి. వారు యజ్ఞయాగాదులే సత్యం అంటారు. వాటిని చిత్తశుద్ధికోసం వాడితే చాలా మంచిది, కాని అవే మోక్షాన్ని ఇస్తాయనే భ్రమ ఉంది వారిలో. ఆ విధంగా వారు నిరంతరం యజ్ఞాల్లో కూరుకుపోతారు.

**కృతి మహోదధౌ పతనకారణమ్, ఫలమశాశ్వతం గతి నిరోధకమ్** – ఉపదేశసారము

కర్మ ఆత్మ అజ్ఞానాన్ని పారద్రోలలేదు. ఆ మాటకొస్తే కర్మ ఏ అజ్ఞానాన్నీ పారద్రోలలేదు. ఒకవేళ మీరు క్రికెట్‌స్కోర్ తెలుసుకుందామనుకున్నారు అనుకోండి – మీరు అగ్నిహోత్రం; విష్ణుసహస్రనామ పారాయణం, శీర్షాసనం – ఇవేమైనా చేస్తే తెలుస్తుందా? వీటినేవీ కించపరచటం లేదు మనం. కర్మకాండ పుణ్యం ఇస్తుంది నిజమే, కాని అది అజ్ఞానాన్ని పారద్రోలలేదు. జ్ఞానం కావాలంటే, ఆ జ్ఞానాన్ని ఇచ్చే సరియైన చోటికి వెళ్ళాలి. తురీయజ్ఞానం పొందాలంటే, కర్మకాండలో కుదరదు; వేదాంతానికి వచ్చి, వేదాంత విచారణ చేయాలి. కాని వీరు ఎన్నడూ వేదాంతానికి రారు.

మండనమిశ్రుడు కర్మకాండనే నమ్మేవాడు. ఒకసారి శంకరాచార్యుల వారితో తీవ్రమైన వాదోపవాదాలు అయ్యాక, ఆయన తన అభిప్రాయాలను మార్చుకుని, శంకరాచార్యులవారి శిష్యుడు అయ్యాడు. సురేశ్వరాచార్యుల పేరుతో, తన గురువు సూచనల మేరకు నైష్కర్మ్యసిద్ధి రాశారు. నైష్కర్మ్యసిద్ధి అంటే కర్మవల్ల మోక్షం పొందలేమని అర్థం. ఒకప్పుడు కర్మకాండలో లోతుగా కూరుకుపోయిన వ్యక్తే, కర్మవల్ల మోక్షం రాదని చెబితే, దాని ప్రభావం బాగా ఉంటుంది.

ఆ విధంగా పూర్వమీమాంసకులు యజ్ఞయాగాదులే సత్యం అంటారు.

11. **భోక్తా ఇతి చ భోక్తృవిదః** – సాంఖ్యదార్శనికులు ఆత్మ సత్యం అంటారు నిజమే కాని వారు ఆత్మ అకర్త కాని ఆత్మ భోక్త అంటారు. భోక్త అంటే కర్మఫలాన్ని అనుభవిస్తుంది అని అర్థం.

12. **భోజ్యమితి చ తద్విదః** – భోజ్యపదార్థాలే సత్యం అని కొందరు అంటారు. వారిని పాకశాస్త్రనిపుణులు అంటారు

**కారిక 2.23**

**సూక్ష్మ ఇతి సూక్ష్మవిదః స్థూల ఇతి చ తద్విదః ।**

**మూర్త ఇతి మూర్తవిదోఽ మూర్త ఇతి చ తద్విదః ॥**

13. **సూక్ష్మ ఇతి సూక్ష్మవిదః** – జైనమతస్థుల్లో రెండు తెగలవారు ఉన్నారు. వారు శ్వేతాంబరులు, దిగంబరులు. శ్వేతాంబరులు తెల్లని వస్త్రాలను ధరిస్తే, దిగంబరులు వస్త్రాలను

ధరించరు. దిగంబరులు ఆత్మ అతి సూక్ష్మం అంటారు. సూక్ష్మ ఆత్మ సత్యం అంటారు కాని వారు ఆత్మలు అనేకం అంటారు.

14. **స్థూల ఇతి చ తద్విదః** – చార్వాకులు స్థూలశరీరమే సత్యం అంటారు. వారు సూక్ష్మ శరీరాన్ని, అందులోని మనస్సును నమ్మరు. కారణశరీరాన్ని నమ్మరు; సాక్షిచైతన్యాన్ని అసలే నమ్మరు. మరణించాక సూక్ష్మశరీరంయొక్క ప్రయాణాన్ని నమ్మరు. మనస్సు మెదడులో ఉంది, శరీరం మరణిస్తే, మనస్సు కూడా మరణిస్తుంది కాబట్టి మనస్సు ప్రయాణం చేసే ప్రసక్తే లేదు అంటారు వారు. చైతన్యం మాటేమిటి? అదీ లేదు, అటువంటి చైతన్యం ఉందని ఎవరూ నిరూపించలేదు అంటారు.

అప్పుచేసి పప్పుకూడు సిద్ధాంతం వారిది. ఉన్నన్నాళ్ళూ నేతి వంటకాలతో అప్పు చేసైనా సరే సుష్టుగా భోజనం చేయాలి. అప్పు తీర్చే ప్రసక్తే లేదు, అది ఇచ్చినవారి సమస్య, తమ సమస్య కాదు. స్వర్గనరకాలు ఉన్నాయో లేవో ఎవరికి తెలుసు? అందువల్ల ఈ చార్వాకులకు స్థూలశరీరమే సత్యం.

15. **మూర్త ఇతి మూర్తవిదః** – కొంతమంది పరమాత్మే అంతిమసత్యం అంటారు కాని ఆ పరమాత్మ ఏదో లోకంలో ఉన్న ఏకరూప ఈశ్వరుడు. వీరిది వల్లభ సాంప్రదాయం లేదా శుద్ధాద్వైత సాంప్రదాయం అంటారు. ఇది హరేకృష్ణ సాంప్రదాయానికి చాలా దగ్గరగా ఉంటుంది. వారు కృష్ణుడు మాత్రమే సత్యం, వేరే దేవుళ్ళు ఎవరూ సత్యం కాదు అంటారు. పైగా ఆ విషయం కృష్ణపరమాత్మే స్వయంగా భగవద్గీతలో బోధించాడు అంటారు వారు. కృష్ణపరమాత్మ నేను సర్వం అన్నచోట, నేను అంటే కృష్ణపరమాత్మే అంటారు వారు. శంకరాచార్యులవారే, ఆ నేనును పొరపాటుగా తురీయ ఆత్మ, నిర్గుణబ్రహ్మగా తీసుకున్నారు అని వాదిస్తారు.

ఒకసారి ఒక వ్యక్తి పరమార్థానంద స్వామీజీతో శంకరాచార్యులవారు భగవద్గీతకు పొరపాటు భాష్యం చెప్పారని చాలాసేపు వాదించాడు. అతని వాదన సారం– కృష్ణపరమాత్మే అంతిమసత్యం. ఆ వచ్చిన వ్యక్తిది వల్లభాచార్యులవారి సిద్ధాంతం. మన స్వామీజీ చాలా ఓపిగ్గా ఆయన వాదన అంతా విని, 'నేను వల్లభాచార్యుల సిద్ధాంతాన్ని ఖండించలేను. ఎందుకంటే నాకా సిద్ధాంతం గురించి ఏమీ తెలియదు,' అని వినయంగా చెప్పారు.

అది విన్న ఆగంతకుడు ఒక్కసారిగా గాలి తీసిన బెలూన్‌లా అయిపోయాడు. అంతవరకూ శంకరాచార్యులవారు చెప్పింది తప్పు, కృష్ణపరమాత్మే అంతిమసత్యం అన్న వ్యక్తి కాస్తా, స్వామీజీలాగా వినయంగా చెప్పాడు, 'నేను కూడా శంకరాచార్యులవారి సిద్ధాంతం చదవలేదు,' అన్నాడు. చూశారా, అలా కొందరు ఏమీ చదవకుండానే, దాని గురించి వాదోపవాదాలు తీవ్రంగా చేసేస్తారు. వీరు భగవంతుణ్ణి ఒక రూపంలో కొలుస్తారు. రూపమే సత్యం అంటారు.

16. **అమూర్తా ఇతి చ తద్విదః** – మరికొంతమందిది ఇంకొక వాదన. అమూర్తం అంటే శూన్యం. అమూర్తాన్ని నిర్గుణబ్రహ్మగా తీసుకోకూడదు. ఎందుకు? ఇక్కడ మనం చూస్తున్నది పొరపాట్ల పట్టికను. నిర్గుణబ్రహ్మను కూడా పొరపాట్లలో కలిపివేస్తే, నిర్గుణబ్రహ్మ కూడా అసత్యం అవుతుంది. అందువల్ల బౌద్ధమతస్థులు శూన్యవాదమే సత్యం అంటారు.

**కారిక 2.24**

**కాల ఇతి కాలవిదో దిశ ఇతి చ తద్విదః ।**
**వాదా ఇతి వాదవిదో భువనానీతి తద్విదః ॥**

17. **కాల ఇతి కాలవిదః** – కొంతమంది కాలమే సత్యం అంటారు. జ్యోతిశ్శాస్త్రాన్ని నమ్మేవారు కాలమే సత్యం అంటారు. వారు ప్రతిదీ కాలానికి ముడిపెడతారు. వేదాంతం జ్యోతిష్యాన్ని త్రోసిపుచ్చదు కాని, అదే సత్యం అంటే మాత్రం ఒప్పుకోదు. 'ఎప్పుడైతే కాలం నన్ను నడిపిస్తోంది,' అని మీరు అంటారో, అప్పుడే బాహ్యశక్తి మీకన్నా శక్తివంతమైనది అవుతుంది.

అద్వైతం నువ్వే అంతిమసత్యానివి, నువ్వు దేశకాలాతీతుడివి, దేశం, కాలం నీ అధీనంలో ఉంటాయని నేర్పిస్తుంది. కాని జ్యోతిష్యం ఏమంటుంది? నువ్వు ఎంత గొప్పవాడివైనా కూడా, నిన్ను కాలం నియంత్రిస్తుంది అంటుంది. ఇటువంటి వాదన అహం బ్రహ్మ అస్మి జ్ఞానాన్ని పొందటానికి తోడ్పడదు. అందువల్ల జ్యోతిష్యం మీద పూర్తిగా ఆధారపడ వద్దంటుంది వేదాంతం. ఏదో ముఖ్యమైన విషయానికి జ్యోతిష్యానికి వెళితే అర్థం ఉంది కాని, ఇవాళ పొద్దున్న అల్పాహారం ఏం తినాలి అనే అంశానికి కూడా వెళ్ళకూడదు. కొందరైతే మీ జన్మనక్షత్రం ప్రకారం మీరే రంగు దుస్తులు వేసుకోవాలో కూడా చెబుతారు. అలా ప్రతి చిన్నదానికీ ఆధారపడితే, మీరు ప్రపంచానికి బానిస అవుతారు. బానిసత్వం, మోక్షసాధన చేయీ చేయీ కలపలేవు. అందువల్ల ఇటువంటి వాటినుంచి వీలున్నంత తొందరగా బయటపడాలి.

మనం జ్యోతిష్యాన్ని విమర్శించటం లేదు. అది తప్పనీ అనటం లేదు. కాని జ్యోతిష్యంలోనే మునిగిపోయి ప్రతి చిన్నపనికీ తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ, మహాదశ, కేతుదశ అంటూ చూసుకుంటూ కూర్చోకూడదు. అలా దానికి అంకితమైపోతే, అదే సత్యమనుకుంటారు. దానిలో ఎంతగా కూరుకుపోతే, ఆత్మవిచారణకు అంత దూరమవుతారు. ఇది ఆపేక్షిక సత్యమనీ, మీరు ఆత్యంతిక సత్యానికి రావాలనీ అర్థం చేసుకోవాలి. ఏదైతే ఆత్యంతిక సత్యానికి మిమ్మల్ని దూరం చేస్తుందో, దాన్ని మీరు దూరం చేసుకోవాలి. ప్రతి ఒక్క అపరావిద్య మిమ్మల్ని పరావిద్య వైపు తీసుకువెళ్ళాలి. కాని ఈ సిద్ధాంతులందరూ అపరావిద్య వైపు వెళ్ళటంవల్ల పరావిద్యకు అంతకంతకూ దూరమవుతున్నారు.

ముండకోపనిషత్తులో జ్యోతిష్యం వేదఅంగాలలో ఒకటని చూశాము. వేదం ముఖ్యమైన శాస్త్రం అయితే, జ్యోతిష్యం అందులో ఒకభాగం మాత్రమే. అటువంటిది మీ ముఖ్యమైన లక్ష్యానికి మిమ్మల్ని దూరం చేయకూడదు.

18. **దిశ ఇతి చ తద్విదః** – కొంతమందికి దిశలే సత్యం. వారు దక్షిణం వైపు తిరిగి ఏ పనీ చేయరు. భగవంతునికి నమస్కారం కూడా చేయరు. ఇవన్నీ పాటించకూడదనటం లేదు, కాని వాటినుంచి బయటపడాలి. ఈ దిశలు కూడా ఆపేక్షికమే. సూర్యుని దగ్గర ఏ దిశలూ ఉండవు. దక్షిణదిశ అంటే ఉండే భయాన్ని పోగొట్టటానికే దక్షిణామూర్తి దక్షిణం దిక్కును చూస్తాడు. ఎలాగైతే దక్షిణామూర్తికి దక్షిణం దిశ అన్నా, యమధర్మరాజు అన్నా, మరణం అన్నా భయం లేదో, అలా మనం కూడా భయపడకూడదు. మంచిరోజు, మంచి దిక్కులు, మంచి శకునాలు అన్నీ చూడండి – కాని వాటినుంచి బయటకు రండి.

చివరికి నేనే బ్రహ్మను అని చెప్పగలగాలి. ఆ దశకు వస్తే, యమధర్మరాజే బ్రహ్మ అంటే భయపడతాడు అంటుంది కఠోపనిషత్తు.

**భయాదస్యగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః । భయాదింద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః**

అంతేకాదు, జ్ఞాని యమధర్మరాజును కూడా తనలో లయం చేసుకుంటాడు అంటుంది కఠోపనిషత్తు.

**యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదనః।**
**మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః॥** – కఠ

జ్ఞానికి మొత్తం ప్రపంచమే ఆహారం. ప్రపంచంలో కాలం, దేశం వస్తాయి. కాలంలోకి యమధర్మరాజు వస్తాడు. అజ్ఞాని యమధర్మరాజుకు భయపడతాడు.

19. **వాదా ఇతి వాదవిదః** – వాద అంటే మంత్రవాదం, తంత్రవాదంవంటి అనేక అపూర్వవిద్యలు. వీరిలో ఎవరికి వారే వారి వాదనే గొప్పదని మిమ్మల్ని నమ్మిస్తారు. మంత్రం, తంత్రం, రత్నాలు, రంగులు – ఇలా అనేకం చెబుతారు. మీరు నవరత్నాలలో ఈ రత్నం ఉంగరం పెట్టుకుంటే మీ దశ మారిపోతుంది అంటారు కొందరు. మీరు ఈ రంగు అసలు ఎప్పుడూ వేసుకోకూడదు అంటారు మరికొందరు. ఇంకొకటి వేరు వాదం. ఫలానా వేర్లు మీ ఇంట్లో పెట్టుకుంటే మీకు అసాధారణ శక్తులు వస్తాయనీ, తద్వారా మీరు ఎదుటివారి ఆలోచనలను కూడా ప్రభావితం చేయగలరనీ అంటారు వారు. అలా మంత్రం, మూలిక, రత్నం – ఏది తీసుకుంటే అది మీ జీవితాన్ని మార్చివేస్తుంది అంటారు వారు. మాండూక్యానికి వచ్చి ఈ మంత్రం, మూలిక, ఔషధాల వివరాలు చెప్పండి అంటే, రాజు దర్శనానికి వెళ్ళి గుమ్మడికాయలు కోరినట్టు అవుతుంది. అసలు మీ జీవితం మారటం ఎందుకు, మీరు ముందే పూర్ణపురుషులు, ముక్తపురుషులు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

20. **భువనానీతి తద్విదః** – పద్నాలుగు లోకాలే సత్యం అంటారు మరికొందరు. అంతకు ముందు మూడు లోకాలు సత్యం అన్నారని చూశాము.

**లోకా ఇతి లోకవిదః – కారిక 21**

ఇక్కడ భువనాలు అంటే పద్నాలుగు లోకాలు – భూ, భువ, సువ, మహ, తప, జన, సత్యలోకాలు ఊర్ధ్వలోకాలు. అతల, వితల, సుతల, రసాతల, మహాతల, తలాతల, పాతాళ లోకాలు అధోలోకాలు. ఈ లోకాలు వారి జీవితాన్ని నిర్దేశిస్తాయి అనుకుంటారు వారు.

**కారిక 2.25**

**మన ఇతి మనోవిదో బుద్ధిరితి చ తద్విదః ।**
**చిత్తమితి చిత్తవిదో ధర్మాధర్మౌ చ తద్విదః ॥**

21. **మన ఇతి మనోవిదః** – మనస్తత్వ శాస్త్రవేత్తలు మనస్సే సత్యం అంటారు. మీ జీవితాన్ని ఆటాడించేది మీ మనస్సు చేసే గారడీనే అంటారు. మనస్సు జీవితాన్ని నిర్దేశిస్తుంది వరకూ నిజమే, కాని వారు చూసే కోణం వేరు. వారు మనస్సుకు ఫ్రీవిల్ ఉందని ఒప్పుకోరు.

వారు మనస్సును రెండు భాగాలుగా విభజిస్తారు. చేతన మనస్సు (కాన్షస్ మైండ్), సుప్తచేతన మనస్సు (సబ్‌కాన్షస్ మైండ్). ఈ సుప్తచేతన మనస్సులో చిన్ననాటి అనుభవాలు నిక్షిప్తమై ఉంటాయి. మీ తల్లిదండ్రుల పెంపకం, గురువుల బోధ, మీరు పెరిగిన వాతావరణం, ఇవన్నీ మీకు తెలియకుండా మీ మనస్సులో నిండివుంటాయి. ఆ విధంగా మీకొక శక్తివంతమైన నిధి మీ సుప్తచేతన మనస్సు.

ఆ సుప్తచేతన మనస్సే మీ చేతన మనస్సును నియంత్రిస్తుంది అంటారు వారు. మీరు వేదాంతం నేర్చుకోవాలనుకున్నా, పెళ్ళి చేసుకోవాలనుకున్నా, సన్యాసం స్వీకరించాలనుకున్నా– ఈ కోరికలన్నిటికీ మూలం ఈ సుప్తచేతన మనస్సే. అంటే ఈ శాస్త్రజ్ఞుల ప్రకారం మీరు మనస్సుకు బానిసలు, మీ మనస్సు మీ గతానికి బానిస.

అందువల్ల ఇవాళ మీరు కోపిష్టిగా పేరుపొందితే, దానికి మీ బాల్యమే కారణం; మీరు ఈర్ష్యా అసూయలకు లోనయితే, దానికీ మీ బాల్యమే కారణం. వీరు ఇంకొక రకం చార్వాకులు. ఏదీ మీ చేతిలో లేదు అంటారు. అంతా లౌకికంగా ఉంటుంది వారి ప్రవర్తన. ఎవరైనా 'ఎందుకింత చిటపటలాడుతావు ఎప్పుడూ?' అని అడిగితే, అటువంటివారు 'నేనేం చేయను, అది నా స్వభావం,' అంటారు. 'ఎందుకు ప్రపంచం మునిగిపోతున్నట్టుగా దిగులుగా ఉంటావు?' దీనికీ అదే జవాబు. మనిషికి ఫ్రీవిల్ ఉందనీ, దానితో మార్చుకోవచ్చనీ తెలీదు.

22. **బుద్ధిరితి చ తద్విదః** – ఒక తెగ బౌద్ధమతస్థులు క్షణిక విజ్ఞానమే సత్యం అంటారు. వారిని క్షణికవిజ్ఞానవాదులు అంటారు. వారు బాహ్యంగా ఒక జగత్తు ఉందని ఒప్పుకోరు. నువ్వు చూస్తున్నావు కాబట్టి జగత్తు ఉంది అంటారు. అంటే బుద్ధిలో కలిగే జ్ఞానమే అంతిమ సత్యం అంటారు. వారికి బుద్ధికి భిన్నంగా వేరే ఆత్మలేదు. ఆలోచనల ప్రవాహమే సత్యం అంటారు. వారికి మనస్సు అంటే ఆలోచనల ప్రవాహం తప్ప వేరే ఏమీ కాదు. ఆ ఆలోచనల కాలం ఎంత? ఒక్క క్షణం. ప్రతి ఒక్క ఆలోచన కూడా క్షణకాలమే ఉంటుంది. అందువల్లనే వారిది క్షణికవిజ్ఞాన వాదం అంటారు. ఇది యోగాచార బౌద్ధమతం వాదన. (దీని ఖండన తరువాత చూస్తాము).

23. **చిత్తమితి చిత్తవిదః** – చిత్తం అంటే జ్ఞాపకం. కొంతమంది జ్ఞాపకమే సత్యం అంటారు. మనుష్యులను మీరు బేరీజు వేసేది, వారితో మీకు జరిగిన అనుభవాల జ్ఞాపకంవల్లనే కాబట్టి జ్ఞాపకమే సత్యం అనేది వీరి వాదన. ఇది కూడా మన ఇతి మనోవిదఃకు కొంచెం దగ్గరగా ఉంది. ఆ జ్ఞాపకాలు ఎంతగా ప్రభావితం చేస్తాయంటే, ఒకవేళ చిన్నప్పుడు మీరు నదిలో మునిగి, చచ్చి బ్రతికారనుకోండి. అప్పటినుంచీ ఆ నదియొక్క దరిదాపులకు కూడా వెళ్ళరు. ఆ మాటకొస్తే నదే కాదు, నీరున్న ప్రాంతాలకే వెళ్ళరు. అంతలా మీలో భయం పేరుకుపోతుంది. ఆ విధంగా ఇప్పటి ప్రవర్తనకు మూలం, అప్పటి అనుభవం.

24. **ధర్మాధర్మౌ చ తద్విదః** – పూర్వమీమాంసకులు పుణ్యపాపాలే సత్యం అంటారు. వారి దార్శనికుడు జైమినీ మహర్షి. ధర్మాధర్మాలు అంటే పుణ్యపాపాలు. మీరు చేసుకున్న పుణ్య పాపాలవల్ల మీరు దానికి సంబంధించిన లోకాలకు వెళతారు అంటారు. వారిది నిరీశ్వర వాదం. అంటే ఈశ్వరుడు లేడంటారు; ఈశ్వరుడు కర్మఫలదాత కాదు అంటారు. తమాషా ఏమిటంటే వారు వేదాన్ని నమ్ముతారు; అందువల్ల ఆస్తికులు అయ్యారు కాని వేదంలో చెప్పబడిన ఈశ్వరుణ్ణి నమ్మరు; అందువల్ల నాస్తికులూ అయ్యారు. రెండూ కలిపి వారిని ఆస్తిక–నాస్తికులు అంటారు.

ఈశ్వరుణ్ణి నమ్మకపోతే వేదాలను ఎవరు సృష్టించారు అంటే వేదాలు అనాది అంటారు. వేదంలో చెప్పబడిన ధర్మం, అధర్మమే అంతిమసత్యం అంటారు.

ఇంతవరకూ చూసిన దర్శనాలను గమనిస్తే అందరూ చెప్పేది ఒకటే. వారి దేన్ని సత్యంగా తీసుకున్నా అది ప్రమేయం మాత్రమే. బాహ్యప్రపంచం మీ జీవితాన్ని నిర్దేశిస్తుంది అంటారు. వారిలో ఎవరూ కూడా 'నువ్వు స్వామివి,' అనరు. 'నువ్వు దాసుడువు,' అంటారు. అంటే అందరూ ఏదో ఒక విధంగా, దేనికో ఒకదానికి బానిసలు అవుతున్నారు.

**కారిక 2.26**

**పంచవింశక ఇత్యేకే షడ్వింశ ఇతి చాపరే ।**

**ఏకత్రింశక ఇత్యాహురనంత ఇతి చాపరే ॥**

ఈ సిద్ధాంతులు బాహ్యప్రపంచమే సత్యం అన్నప్పుడు, ఆ బాహ్యప్రపంచాన్ని వర్ణించటానికి ఒక్కొక్క కోణంలోంచి ప్రపంచాన్ని విభజించారు. విజ్ఞానశాస్త్రం అణువులు, పరమాణులు ఉన్నాయి విశ్వంలో అంటుంది. అలా ఇప్పుడు జగత్తును కొన్ని తత్త్వాలుగా కొందరు విభజించారు. అవేమిటో చూద్దాము.

25 ఎ) **పంచవింశక ఇత్యేకే** – సాంఖ్యదర్శనం 25 తత్త్వాలే సత్యం అంటుంది. దీని దార్శనికుడు కపిలముని. పంచవింశక అంటే 25. ఇతి ఏకే అంటే ఇది ఒకరి వాదన. ఈ 25 తత్త్వాల రకరకాల కలయిక తప్ప మరేం కాదు ఈ ప్రపంచం అంటారు వారు. అవి– పురుషుడు, ప్రధానము, మహత్, అహంకారం, ఐదు తన్మాత్రలు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఐదు శబ్దాది విషయాలు, మనస్సు.

25 బి) **షడ్వింశ ఇతి చాపరే** – యోగదర్శనం 26 తత్త్వాలే సత్యం అంటుంది. ఈ 25కు ఈశ్వరుణ్ణి జోడిస్తే 26 అవుతుంది. దీని దార్శనికుడు పతంజలి.

తమాషా చూశారా! సత్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేని వారిని పేర్కొంటూ వారిలో ముఖ్యమైన ఆస్తికులను, నాస్తికులను కూడా పేర్కొంటున్నారు. తక్కినవారు శాస్త్రాన్ని నేర్చుకోకుండా అయోమయంలో పడితే, ఆస్తికులు నేర్చుకుని కూడా పడ్డారు. ఎందుకంటే సత్యం బాహ్యవస్తువు అంటేనే శాస్త్రాన్ని ఇంకా పూర్తిగా అవగాహన చేసుకోలేదని అర్థం. వారు బాహ్యవస్తువులు సత్యం అంటున్నారు; బాహ్యవస్తువులు నీకు బానిసలు అంటుంది వేదాంతం.

25 సి) **ఏకత్రింశక ఇత్యాహుః** – పాశుపత శైవులు 31 తత్త్వాలే సత్యం అంటారు. మళ్ళీ ఈ శైవుల్లో నాలుగు తెగలవారు ఉన్నారు. వారిని చతుర్విధ శైవులు అంటారు. వీరిని వ్యాసాచార్యులవారు బ్రహ్మసూత్రాల్లో ఖండించారు. పైన చెప్పిన 26కు రాగం, అవిద్య, నియతి, కాలం, కళ, మాయ అనే ఆరింటిని జోడిస్తే అవి 31 అవుతాయి.

నేను ఎవరు? శైవుణ్ణా, వైష్ణవుణ్ణా? దీనికి జవాబు చెప్పేముందు శివుడు లేదా విష్ణువు అంటే నీ దృష్టిలో ఎవరని మీరు ఎదురు ప్రశ్నించాలి. శివుడు లేదా విష్ణువు ఏకరూప ఈశ్వరుడు అంటే మీరు శైవుడైతే కైలాసంలో ఉన్న శివుణ్ణి కొలుస్తారు; మీరు వైష్ణవుడు అయితే వైకుంఠంలో ఉన్న విష్ణుమూర్తిని కొలుస్తారు. మీరు అద్వైతానికి వస్తే మీరు ఈ రెండూ కాదు. మీరు **బ్రహ్మవాదినులు**. శివ నాకు భిన్నంగా లేడు అంటారు. **శాంతం, శివం, అద్వైతం.**

చిత్తశుద్ధి పొందటానికి కొన్నాళ్ళు ఏకరూప ఈశ్వరుణ్ణి కొలవాలి. అప్పుడు ఏ రూపంలో ఉన్న భగవంతుణ్ణి కొలిచినా ఫర్వాలేదు. కాని దాన్నుంచి అరూప ఈశ్వర జ్ఞానానికి రావాలి.

25 డి) **అనంత ఇతి చాపరే** – కొంతమంది అనంతమైన పదార్థాలే సత్యం అంటారు. వారు 25, 26, 31 అంటూ తత్త్వాలను చెప్పరు. అవి అనంతం అంటారు.

**కారిక 2.27**

**లోకాన్ లోకవిదః ప్రాహురాశ్రమా ఇతి తద్విదః ।**
**స్త్రీపుంనపుంసకం లైంగాః పరాపరమథాపరే ॥**

26. **లోకాన్ లోకవిదః ప్రాహుః** – కొంతమంది ఆనందాన్ని ఇచ్చే విషయవస్తువులే సత్యం అంటారు. ఇక్కడ లోకాన్ అంటే లోకాలు కాదు. ఇప్పటికే మూడు లోకాలు సత్యం, పద్నాలుగు లోకాలు సత్యం అనే వాదనలు చూశాము. ఇక్కడ ఆనందాన్ని ఇచ్చేది ఏదైనా సత్యమే అంటారు. లోక అంటే జనః; జనః అంటే జనఅనురంజనం. అంటే మనుష్యులకు ఆనందం కలిగించేది.

27. **ఆశ్రమా ఇతి తద్విదః** – కొంతమంది వర్ణాశ్రమ ధర్మాలే సత్యం అంటారు. వర్ణాశ్రమ ధర్మాలను శాస్త్రం అద్భుతంగా నిర్దేశించింది; దాన్ని పాటిస్తే ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడుతుంది నిజమే కాని దానిలోనే కూరుకుపోకూడదు. దాన్నుంచి బయటకు రావాలి. వర్ణధర్మాలు, ఆశ్రమధర్మాలు, యజ్ఞయాగాదులు, ఆచారాలు, అనుష్ఠానం – అన్నీ పాటించాలి నిజమే కాని అవే అంతిమలక్ష్యం అనుకోకూడదు. అవి మీ లక్ష్యానికి తీసుకువెళ్ళే మార్గాలు. కాని అవే లక్ష్యం అనుకోవటంతో వస్తుంది సమస్య. సంధ్యావందనం చేయాలి నిజమే కాని అక్కడే ఆగిపోకూడదు.

మార్గం వేరు, లక్ష్యం వేరు. ఒక మార్గం ద్వారా, ఒక లక్ష్యాన్ని చేరుకుంటారు. అందువల్ల మార్గాన్ని ఎంతవరకూ వినియోగించాలో అంతవరకూ వినియోగించాలి; ఎప్పుడు వదిలివేయాలో అప్పుడు వదిలివేయాలి. ఎలాగూ వదిలేస్తాను కదా అని అసలు వాడను అనకూడదు; దీని ద్వారా వచ్చాను కదా, దీన్నీ వదలను అనకూడదు. మీరు ఒక నదియొక్క ఆవలితీరం చేరాలంటే, ఒక పడవలో వెళతారు. పడవ, పాపం నన్ను ఇక్కడదాకా తీసుకువచ్చింది కదా, పడవలోనే ఉండిపోతాను అనరు కదా! పడవ ఎక్కి, ప్రయాణం చేసి, దాన్ని వదిలివేస్తారు. ఇవీ అంతే. ఆశ్రమధర్మాలు పాటించి, లక్ష్యాన్ని చేరుకోవాలి.

28. **స్త్రీపుంనపుంసకం లైంగాః** – వ్యాకరణవేత్తలు భాషే సత్యం అంటారు. అంటే వారు పదాలు, వాటి ధాతువులు, వాటి లింగాల గురించి లోతుగా మునిగిపోతారు. సంస్కృతభాషలో ప్రతి ఒక్క పదానికి కూడా లింగం ఉంటుంది. ఒక లింగాన్ని సూచించటానికి

ఒక పదం వాడతాము కాని ఆ పదానికి ఉండే లింగం మళ్ళీ వేరు ఉంటుంది. కొన్ని ఉదాహరణలు చూద్దాము.

స్నేహితుడు – మిత్రమ్ – నపుంసక లింగం

నది – నదీ –స్త్రీలింగం; నదః – పుంలింగం

అలా వారు ప్రతి పదానికీ ధాతువు, లింగం, సూత్రాలు, సంధులు – అన్నీ చూస్తారు.

ఈ వ్యాకరణంలో ఎంతగా కూరుకుపోతారంటే, వారు అదే అంతిమలక్ష్యం అనుకుంటారు. స్త్రీ–స్త్రీలింగం; పుం–పుంలింగం; నపుంసక–నపుంసక లింగం. అది కూడా మనుష్యుల లింగాల గురించి కాదు పదాలు ఏ లింగానికి చెందుతాయో చూస్తారు. మిత్రుడు ఆడ అవచ్చు, మగ అవచ్చు కాని మిత్రమ్ పదం మాత్రం నపుంసక లింగం. వీరిది స్ఫోటవాదం లేదా శబ్దబ్రహ్మవాదం అంటారు.

**న హి న హి రక్షతి 'డుకృఞ్కరణే'** – భజగోవిందమ్

వ్యాకరణం నేర్చుకుంటే చాలదు, దానిద్వారా బ్రహ్మను నేర్చుకోవాలని దాని అర్థం.

**పరాపరమథాపరే** – మరికొందరు పర, అపరం బ్రహ్మే సత్యం అంటారు. పరబ్రహ్మ అంటే కారణబ్రహ్మ, అపరం బ్రహ్మ అంటే కార్యబ్రహ్మ. కారణబ్రహ్మను ఈశ్వరుడనీ, కార్యబ్రహ్మను జీవ, జగత్తులనీ అంటాము. ఈ రెండూ ఈశ్వరుణ్ణుంచే వచ్చాయి అంటారు. అంటే వారు చతుష్పాద ఆత్మయొక్క మూడవపాదం వద్దే ఆగిపోతున్నారు. నాలుగవ పాదమే ఆత్యంతిక సత్యాన్ని చెబుతుంది. అది –**కార్యకారణ విలక్షణ తురీయమ్**

తురీయం ఎలా కార్యకారణ విలక్షణమో వివరంగా మూడవ అధ్యాయంలో చూస్తాము, కాని ఇప్పుడు ఆబ్జెక్టుగా చూసేది ఏదీ సత్యం కాదని నిరూపించటానికి గౌడపాదాచార్యులవారు ఇన్ని వాదనలను ప్రస్తావిస్తున్నారని అర్థం చేసుకోవాలి. ఆ ఆబ్జెక్టు ఎక్కడన్నా అవనీ – జాగ్రదావస్థ, స్వప్నావస్థ, దేవలోకాలు – ఏదైనా అది ఆబ్జెక్టే, ఆబ్జెక్టయినది ఏదీ సత్యం కాదు. దానికి కారణాలు ముందే చూశాము. ప్రమేయాన్ని ప్రమాత చూస్తేనే దానికి ఉనికి ఉంది. అంతేకాదు, వాడే ప్రమాణాన్నిబట్టి కూడా అది మారుతుంది. మనస్సు, బుద్ధి, వాసనలు, కర్మ – అన్నీ మీరు చూసే వస్తువును మీ కోణంలోంచి చూపిస్తాయి. ప్రమాణం లేకుండా ప్రమేయాన్ని చూడగలరా? లేదు. అందువల్ల ప్రమాత, ప్రమేయం, ప్రమాణాల్లో ప్రమాత మాత్రమే సత్యం. ప్రమాత అంటే చూసే నేను.

నాకు ప్రమాత హోదా ఎంతవరకూ ఉంటుంది? నేను చూసే ప్రమేయం ఉన్నంత వరకే ఉంటుంది. ప్రమేయం ఎదురుగా లేకపోతే, ప్రమాత హోదా ఉండదు. నేను ఉంటాను. అందువల్ల ప్రమాత కూడా ఆత్యంతిక సత్యం కాదు.

ఏది ఆత్యంతిక సత్యం? ప్రమాత హోదా లేని నేను సత్యం. అప్పుడు నేను తురీయ చైతన్యాన్ని. విశ్వ, తైజస, ప్రాజ్ఞలాగా నేను ప్రమాతను; కాని తురీయంగా నాకు ప్రమాత హోదా లేదు. ప్రమాత కాని నేను అంతిమసత్యం అనే సత్యాన్ని జీర్ణించుకోకపోతే, నేను అజ్ఞానంలో ఉంటాను. అజ్ఞానంలో మాయ నన్ను కప్పేస్తుంది. అందువల్ల ఏదో ఒక ప్రమేయాన్ని సత్యంగా భావిస్తాను.

సత్యం తెలియకపోవటంవల్ల మిథ్యను సత్యంగా పొరపాటు పడతాను. వ్యావహారిక సత్యాన్నే పారమార్థిక సత్యంగా భావిస్తాను. సత్యం ఒక్కటే కాని పొరపాట్లు అనేకం. అందువల్లనే అనేక దర్శనాల్లో అనేక అపోహలు కలుగుతున్నాయి.

వేదాంతంలో కూడా అలాంటి అపోహలు ఉన్నాయా? అసలు వేదాంతం ఒక దర్శనం కాదు. అది కూడా ఒక దర్శనం అయితే, అందులోనూ తెలివిగా అపోహలు ఉంటాయి. కాని వేదాంతం ఈ అపోహలన్నీ తొలగించి నా స్వస్వరూపంలో నిలబడటానికి తోడ్పడుతుంది.

తక్కిన దర్శనాలు ఏదో ఒక అనుభవం సత్యం అంటాయి. అనుభవం అంటే దానికి రాకపోకలు ఉంటాయి. రాకపోకలు ఉన్నదేదీ అంతిమసత్యం కాదు. కొంతమంది లౌకికంగానే ఆలోచిస్తారు. శాస్త్రం నేర్చుకోకండి, వారు మిమ్మల్ని అయోమయంలో పడేస్తారు అంటారు. వారిది నువ్వు ఆనందంగా జీవించు, పదిమందిని ఆనందంగా ఉంచు సిద్ధాంతం.

**కారిక 2.28**

**సృష్టిరితి సృష్టివిదో లయ ఇతి చ తద్విదః ।**
**స్థితిరితి స్థితివిదస్సర్వే చేహ తు సర్వదా ॥**

29 ఎ) **సృష్టిరితి సృష్టి విదః** – కొంతమంది సృష్టి ప్రకరణమే సత్యం అంటారు. పాలపుంత, సౌరమండలం, విశ్వం గురించే చెబుతూ ఉంటారు.

29 బి) **లయ ఇతి చ తద్విదః** – కొంతమంది ప్రళయమే సత్యం అంటారు. అంటే ఖగోళ శాస్త్రంమీద శ్రద్ధ ఉంటుంది వారికి.

29 సి) **స్థితిరితి స్థితి విదః** – కొంతమంది స్థితే సత్యం అంటారు. సృష్టిలేదు, లయలేదు అంటారు వారు. దానికి వారు చెప్పే సూత్రం పదార్థాన్ని సృష్టించలేము, నాశనం చేయలేము. జగత్తు అనాది అంటారు.

అయితే సత్యం ఏమిటి? సృష్టి, స్థితి, లయ మూడూ లేవు అనేది సత్యం. ఇక్కడ ఈ వాదనలో కూరుకుపోతే, మనం కూడా వారిలాగా మార్గంలోనే ఆగిపోతాము. మనం ఆత్మజ్ఞానానికి రాలేము. కారిక 32లో జవాబు వస్తుంది, అప్పుడు చూద్దాము. సృష్టి, స్థితి, లయ లేకపోతే ఏంవుంది? అయోమయమే ఉంది.

**సర్వే చేహ తు సర్వదా (వదంతి)** – ఈ విధంగా ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిప్రాయం ఉంది. ఎవరికి వారే, వారిదే సరియైనది అనే గట్టి నమ్మకంలో ఉంటారు. ఇది సత్యం, పునఃసత్యం అంటారు ఎవరికివారే. ఏ సిద్ధాంతానికి ఆ సిద్ధాంతం సత్యం అనుకోవటంవల్ల తక్కినవాటిని త్రోసిపుచ్చుతారు వారు. ఒక సిద్ధాంతాన్ని సమర్థిస్తూ ఇంకోదాన్ని త్రోసిపుచ్చుతున్నారు అంటేనే ఈ సిద్ధాంతం కూడా సత్యం అవటానికి వీలులేదు. ఎందుకంటే సత్యం వేరే సిద్ధాంతాలకు భిన్నంగా ఉండదు. అన్ని సిద్ధాంతాలనూ అందులో కలుపుకుంటుంది. సత్యాన్ని వేరే దేనితోనూ త్రోసిపుచ్చలేము. ఈ విషయం తెలియక, ఈ దార్శనికులు ఒకటి గట్టిగా పట్టుకుని, తక్కినవాటిన త్రోసిపుచ్చుతున్నారు.

(వీటిలో ముఖ్యమైన వాటిని **కల్పనా ప్రకారాః – కారికలు: 19–29లో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు).

**కారిక 2.29**

**యం భావం దర్శయేద్యస్య తం భావం స తు పశ్యతి ।**
**తం చావతి స భూత్వాఽసౌ తద్గ్రహస్సముపైతి తమ్ ॥**

ఈ శ్లోకంలో గౌడపాదాచార్యులవారు ఈ అయోమయాల పట్టికకు ముక్తాయింపు పలుకుతున్నారు. వచ్చిన చిక్కేమిటంటే, ప్రతి ఒక్కరూ ఏదో ఒక సిద్ధాంతం వలలో పడిపోయి, ఇక ఆ సిద్ధాంతమే బ్రహ్మాండం అనే నమ్మకానికి బద్ధులైవుంటారు. ఇలా అవటానికి అనేక కారణాలను సూచించవచ్చు. ఉదాహరణకు పిల్లల మతం విషయం తీసుకుంటే, తల్లిదండ్రులు ఏ మతానికి చెందినవారైతే, ఆ మతాన్ని నమ్ముతారు మొదట్లో. తర్వాత స్కూల్లో చేరాక, అక్కడ వాతావరణ ప్రభావం ఉంటుంది. ఆ విధంగా, ఏదో ఒకదాని వైపు ఆకర్షింపబడతారు.

**తం భావం స తు పశ్యతి** – ప్రతి ఒక్కరూ కూడా, ఆ పదార్థాన్ని సత్యంగా భావిస్తారు. ఏమిటది?

**యం భావం దర్శయేద్ యస్య** – ఏ సత్యాన్నైతే ఎవరైనా వారికి చూపిస్తారో ఆ సత్యాన్ని నమ్మటానికి ప్రతి ఒక్కరికీ తనకొక గురువు ఉండాలని ఉంటుంది కాని, దురదృష్టవశాత్తూ ఆ గురువు సరియైన గురువో కాదో తెలియదు. తనే అజ్ఞానంలో ఉన్న వ్యక్తికి, గురువు అజ్ఞానో, జ్ఞానో తెలియదు. ఒక గుడ్డివాడు, ఇంకొక గుడ్డివాని చేయి పట్టుకున్నట్టు అవుతుంది అతని పరిస్థితి. తనకే కంటిచూపు ఉంటే, ఇంకొక వ్యక్తి సహాయం అవసరం లేదు. కాని తను గుడ్డివాడైతే, దారి చూపించమని ఇంకొక వ్యక్తి చేయి పట్టుకోవాలి. కాని తను పట్టుకున్న వ్యక్తి అంధుడో కాదో ఇతనికి తెలియదు. ఒకవేళ అతను కూడా అంధుడైతే, ఇద్దరూ కలిసి పడే అవకాశాలు ఇంకా ఎక్కువ ఉంటాయి.

అందువల్ల గురువును ఎన్నుకున్నప్పుడు భగవంతునికి ప్రార్థన చేయాలి, 'నేను ఎన్నుకున్న గురువు సరియైన గురువు అయ్యేలా చూడు స్వామీ,' అనాలి. అలా ఎవరో ఒకరి ద్వారా, ఏదో ఒక సిద్ధాంతం వైపు ఆకర్షితులవుతారు ప్రతి ఒక్కరూ. హిందూమతాన్ని పాటించినా కొందరు శైవులుగా ఉంటే, మరికొందరు శ్రీవైష్ణవులుగా ఉంటారు. అలా ఒకదానివైపు ఆకర్షించబడి, అదే సత్యమనే తీవ్రమైన భావనలో కూరుకుపోతారు.

**తద్గ్రహః** – ఆ సిద్ధాంతమో లేక ఆ ఏకరూప ఈశ్వరుడో సత్యం అనే గట్టి పట్టుదలతో ఉంటారు. ఉదాహరణకు తను ముందు విష్ణువే దేవుడు అనే నమ్మకంలో ఉంటాడు. కొన్నాళ్ళయ్యాక, ఆ నమ్మకమే అతన్ని గట్టిగా పట్టుకుంటుంది. దానికి చిన్మయానంద స్వామీజీ ఒక ఉదాహరణ చెబుతుంటారు. ఒక్కోసారి, గంగానది ప్రవాహంలో ఎలుగుబంట్లు పైనుంచి వస్తూ ఉంటాయి. అవి నీటిలో అలా ప్రవహిస్తూ వెళుతుంటే, వాటి నల్లజుట్టు నల్ల కంబళిగా కనబడుతుంది. ఈ కంబళిని తీసుకుందామని ఎవరో నీళ్ళలోకి దిగి, వాటిలో ఒకదాన్ని పట్టుకుంటాడు. ఇంకేముంది? అదే ఈ వ్యక్తిని గట్టిగా పట్టుకుంటుంది. ఒడ్డునుంచి ఈ తమాషాను చూస్తున్న వ్యక్తి ఎవరో అరుస్తారు, 'అయ్యో అది ఎలుగుబంటి, దాన్ని వదిలివేయి.' ఈ వ్యక్తి జవాబుగా అరుస్తారు, 'నేనెప్పుడో దాన్ని వదిలేశాను, అదే నన్ను వదలటం లేదు, మీరైనా చెప్పండి దానికి.'

ఆ విధంగా ఒక సిద్ధాంతానికి లేదా ఒక మతానికి లేదా ఒక భగవంతునికి కట్టుబడి ఉంటే, అది ఎంతదూరం వెళుతుందంటే, ఆ వ్యక్తి మతోన్మాదిగా మారే ప్రమాదం ఉంది. తను దాన్ని గట్టిగా నమ్మటమే కాక, తన చుట్టూ ఉన్నవారిని కూడా అందులోకి లాగటానికి ప్రయత్నిస్తాడు. ఇదంతా మనసు చేసే గారడీ. ఎవరంటున్నారు ఈ మాట? సాక్షాత్తూ గౌడపాదాచార్యులవారే. తద్గ్రహః అంటే ఇదే పరమార్థం అనే గట్టి పట్టుదల ఏర్పడుతుంది అంటున్నారు.

**సముపైతి తమ్** – అది అతన్ని ఎంతగా బద్ధుణ్ణి చేస్తుందంటే, ఇంక ఆ విషయంలో అతన్ని తార్కికంగా ఆలోచించనివ్వదు. ఒకవేళ మీరు 'నీ బుద్ధిని ఉపయోగించి, విచారణ చేయి,' అని చెప్పినా, అతను తన బుద్ధికి పదును పెట్టటానికి సిద్ధపడడు. తన నమ్మకాన్ని వదులుకోలేడు. పైగా, అలా గురువును కాని తన సిద్ధాంతాన్ని కాని ప్రశ్నించటం పెద్ద ఘోరం అంటాడు.

తమాషా ఏమిటంటే, వారు ఒకపక్కనుంచి భగవంతుడు సర్వవ్యాపకుడు అంటూనే, కృష్ణభగవానుడు మాత్రమే అంతిమసత్యం అంటారు. ఇంకో రూపంలో భగవంతుణ్ణి ఊహించుకోలేరు వారు.

చిన్మయానంద స్వామీజీ గీతాజ్ఞానయజ్ఞాలు నడిపేవారు. దాని తర్వాత ఒక ఆశ్రమాన్ని నెలకొల్పి అందులో శివాలయం కట్టారు. ఎవరో అన్నారు, 'చిన్మయానంద స్వామీజీ, కృష్ణపరమాత్మ బోధించిన భగవద్గీత బోధిస్తున్నారు; కాని శివాలయం కట్టారు.' భగవద్గీతను సరిగా ఆకళింపు చేసుకోని వారి మాట అది. భగవంతుడు సర్వవ్యాపకమంటూ, ఏకరూప ఈశ్వరుడైన కృష్ణపరమాత్మ అంతిమసత్యం అని ఎలా అనగలరు? మనమీ ప్రశ్న అడిగితే, వారికి కోపం వస్తుంది. ఎందుకంటే వారి సిద్ధాంతం నమ్మకంమీద ఏర్పడింది, బోధను అర్థం చేసుకుని ఏర్పడింది కాదు.

ఒకవేళ వారితో ఇదుగో మీరు అద్వైతాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదు; ఏకరూప ఈశ్వరుణ్ణుంచి అనేకరూప ఈశ్వరునికి, ఆ తర్వాత అరూప ఈశ్వరునికి రావాలి అని మీరు చెపితే, వారి నమ్మకాన్ని వదులుకోరు సరికదా, మిమ్మల్నే వదులుకుంటారు. పైపెచ్చు తక్కినవారికి చెబుతారు, 'వారి అద్వైత వేదాంతబోధలకు వెళ్ళకండి, అవి మంచివి కావు,' అంటారు కాని అద్వైత వేదాంతాన్ని నమ్మే మీరు శివాలయానికీ వెళతారు, వైష్ణవ సాంప్రదాయాన్నీ వింటారు. మీది సత్యంమీద ఆధారపడింది, వారిది దృఢనమ్మకం మీద ఆధారపడింది.

ఇటువంటి వారిని ఏం చేయాలి? గౌడపాదాచార్యులవారు, 'వారి నమ్మకాన్ని ఖండించటానికి ప్రయత్నించకండి. వారి సిద్ధాంతంలో వారిని కొనసాగనివ్వండి,' అంటారు. మీకు అది మిథ్య అని అర్థమయితే చాలు. ఎందుకు? ఆబ్జెక్టుగా చూసేది ఏదీ, ఆఖరికి మీరు కొలిచే దేవత కూడా అంతిమసత్యం కాదు. వారికి ఇస్తే ఒక సలహా ఇవ్వండి, 'మీ దేవుడ్నే మీరు కొలవండి. కాని ఓ దేవా, నన్ను సత్యంనుంచి అంతిమసత్యం వైపుకు, అయోమయంనుంచి స్పష్టతకు, ఏకరూప ఈశ్వరునినుంచి అరూప ఈశ్వరునికి తీసుకుని వెళ్ళు,' అని ప్రార్థించమనండి. అంతేకాని వారిని విమర్శించకండి.

అలా వారు ప్రార్థిస్తే, వారు రక్షింపబడతారా? మిథ్యా సిద్ధాంతంనుంచి సత్యబ్రహ్మకు వెళతారు. ఎందుకంటే ప్రతి మిథ్య వెనుక సత్యం ఉంటుంది. మిథ్యకు అధిష్ఠానం ఉండి తీరాలి. తాడు-పాము అధ్యాస, తాడనే అధిష్ఠానం లేకుండా, కుదరదు. సత్య జాగ్రత్ పురుషుడు లేనిదే, మిథ్యా స్వప్నం కనలేరు. అందువల్ల మిథ్యా సిద్ధాంతాన్ని నమ్మినా కూడా, వారికి తెలియకుండానే సత్య అధిష్ఠానాన్ని నమ్ముతున్నారు.

**సః** – ఆ మిథ్యావస్తువు అంటే పది కారికల్లో చెప్పబడిన మిథ్యావస్తువుల్లో దేన్ని నమ్మితే అది.

**అసౌ భూత్వా** – అది అతనిని రక్షిస్తుంది. శాస్త్రం ఎక్కడో ఒకచోట మొదలుపెట్టమనే చెబుతుంది. తామసిక పూజతో మొదలుపెట్టినా కూడా, అదే నెమ్మదిగా రాజసిక పూజకు, అక్కడనుంచి సాత్త్వికపూజకు దారితీస్తుంది. అదే నెమ్మదిగా మాండూక్య బోధకు దారితీస్తుంది.

అప్పుడు మాండూక్యం మీరు ఆబ్జెక్టుగా చూసేదేదీ సత్యం కాదు; దాన్ని చూస్తున్న మీరే సత్యం అని నేర్పిస్తుంది.

**తం చావతి** – ఆ పదార్థమే అతన్ని రక్షిస్తుంది. ఎందుకంటే ప్రతివస్తువు వెనక, నిజానికి తురీయం బ్రహ్మ ఉంటుంది. అతను చేసే పూజ అతను కొనసాగించవచ్చు; ఇష్టదేవత ప్రార్థన మాననవసరం లేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**కారిక 2.30**

**ఏతైరేషోఽపృథగ్భావైః పృథగేవేతి లక్షితః ।**
**ఏవం యో వేద తత్త్వేన కల్పయేత్సోఽవిశంకితః ॥**

4. **ఉపసంహారః – కారికలు 30–34**

ఎలా ద్వైతంనుంచి అద్వైతానికి క్రమంగా రావాలో, ఈ కారికల్లో అద్భుతంగా వివరించబడింది. ముందుగా, ప్రతి ఒక్కరూ వారు నమ్మిన సిద్ధాంతాన్నే సత్యం అంటారు. ఒకరు అణువు సత్యం అంటే, ఇంకొకరు ప్రకృతి సత్యం అంటారు. ఎవరేది సత్యం అన్నా, వారు ఒక వస్తువును సత్యం అంటున్నారు అంటేనే, నేను సత్యం కాదు అని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. అంటే ప్రాథమిక పొరపాటు చేస్తున్నాడు. దృశ్యం సత్యం అనుకోవటంవల్ల దృక్ సత్యం కాదనుకుంటున్నాడు.

స్వప్నప్రపంచం ఎంత సత్యం అనిపిస్తుందీ అంటే, అది తననుంచే వచ్చినదనే సత్యాన్ని మరుగునపరచి, భయపెడుతుంది. అదే విధంగా తనకు భిన్నంగా ఉన్న వస్తువు అతన్ని భయపెడుతుంది. కాలతత్త్వం సత్యం అని ఒకరనుకుంటే, జ్యోతిష్యం సత్యం అని ఇంకొకరు అనుకుంటారు. వాటి కోరల్లో చిక్కుకుని, విధి బలీయం అంటారు. తన చేతిలో ఏమీ లేదని నిస్సహాయంగా చూస్తూ ఉంటారు. దానివల్ల కొన్ని వస్తువులమీద రాగాన్ని పెంచుకుంటే, కొన్ని వస్తువులమీద ద్వేషాన్ని పెంచుకుంటారు. ఇదంతా సత్యాన్ని ప్రమేయంగా (ఆబ్జెక్టుగా) చూడటంవల్ల వస్తుంది.

**ఏతైః ఏషః పృథగ్ ఏవ ఇతి లక్షితః** – ఏషః అంటే ఆత్మనైన నేను. ఈ ఆత్మ సత్యంగా భావించబడుతున్న ఈ పదార్థాలకంటే వేరుగా ఉందని భావిస్తున్నారు. ఈ ద్వైతభావనలో ఉన్నన్నాళ్ళూ సంసారం తప్పదు. అందువల్ల నెమ్మదిగా ద్వైతంనుంచి అద్వైతానికి రావాలి. నేను కొలిచే నామరూపాలు మిథ్య అని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే కొలిచే నేను వేరు, కొలిచే దైవం వేరు అంటేనే ద్వైతంలోకి వస్తుంది. మూడవ అధ్యాయంలో అలా ఉపాసన చేసేవారు కృపణులు అని మొదలుపెడతారు గౌడపాదాచార్యులవారు. అలా ఎందుకంటున్నారో సరిగ్గా అర్థం చేసుకోవాలి.

గౌడపాదాచార్యులవారు అనేక సిద్ధాంతుల అనేక అపోహలను చెప్పుకొచ్చారు. అన్నింటిలోని సారం ఒకటే. వారు సత్యాన్ని ప్రమేయంగా చూస్తున్నారు. ప్రమేయానికి స్వతంత్రంగా ఉనికి ఉందనీ, ప్రమాతనైన నేను దానికి భిన్నంగా ఉన్నాననీ అంటారు. మనం చాలాసార్లు చూస్తూ వస్తున్నాము. ప్రమేయానికి ఉనికి, దాన్ని ప్రమాత చూస్తేనే ఉంటుంది.

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

**(ఏతైః) అపృథగ్భావైః** – నిజానికి ఈ వస్తువులు ఆత్మనైన నాకు భిన్నంగా లేవు. స్వప్నప్రపంచం జాగ్రత్ పురుషునికి భిన్నంగా ఎలాగైతే లేదో, అలా ఈ వస్తువులు నాకు భిన్నంగా లేవు. అందువల్ల అవి వాటి ఉనికికి ఆత్మనైన నామీద ఆధారపడివున్నాయి. అందువల్ల అవి మిథ్య. కాని ఈ విషయం తెలుసుకోలేనివారు,

పృథగ్ ఏవ ఇతి లక్షితః – జాగ్రత్ ప్రపంచానికి విడిగా ఉనికి ఉంది అనుకుంటారు. ఒక స్వాప్నికుడు తను స్వప్నంలో ఉన్నంతసేపూ తన స్వప్నం, స్వప్నం అని ఎలా తెలుసుకోలేడో అలాగే జాగ్రత్ పురుషుడు ఈ జాగ్రత్ ప్రపంచం మిథ్య అని తెలుసుకోలేడు. లక్షితః అంటే నిశ్చయించబడిందని అర్థం. అంటే అజ్ఞానులు జాగ్రత్ ప్రపంచం చూసి అది స్వతంత్ర వస్తువు అని పొరపాటు పడతారు. ఎప్పుడైతే ప్రమేయం భిన్నంగా ఉందో, ప్రమాత కూడా భిన్నంగా ఉంటుంది. ఎప్పుడైతే ప్రమేయం–ప్రమాత విభజన వస్తుందో, అప్పుడే రెండింటికీ పరిమితి వస్తుంది; పరిమితి ఉన్నచోట స్వేచ్ఛ పొందే ఆస్కారం లేదు.

తక్కిన దర్శనాలన్నింటిలోనూ ఈ ప్రమాత–ప్రమేయం విభజన ఉంది. అందువల్ల వాటికి పరిమితి కూడా ఉంది. కొన్ని సిద్ధాంతాల్లో మోక్షం అంటే వైకుంఠలోకానికో లేదా కైలాసానికో వెళ్ళటం అనుకుంటారు కాని అక్కడ కూడా ద్వైతం ఉంటుంది. ద్వైతం ఉన్నచోట మోక్షం కుదరదు. ఎందుకంటే ద్వైతం ఉన్నచోట సంసారం తప్పదు. జ్ఞాని మాత్రమే ద్వైతదర్శనం చేస్తున్నా కూడా అది మిథ్య అని అర్థం చేసుకోగలడు. ఉదాహరణకు సూర్యోదయం నిజంగా అవటం లేదని మనకు తెలుసు. సూర్యోదయాన్ని అనుభవించటంవల్ల సంసారం ఏర్పడదు; సూర్యోదయాన్ని సత్యంగా తీసుకోవటంవల్ల సమస్య వస్తుంది. అదే విధంగా ద్వైతాన్ని అనుభవించటంవల్ల సంసారం ఏర్పడదు; ద్వైతాన్ని సత్యంగా తీసుకోవటంవల్ల సమస్య వస్తుంది.

**ఏవం యో వేద** – ఎవరైతే ద్వైత అనుభవం మిథ్య, అద్వైతం సత్యం అని తెలుసుకుంటారో,

**తత్త్వేన** – అది కూడా శ్రుతి, యుక్తుల ద్వారా తెలుసుకుంటాడో,

**సః కల్పయేత్** – అటువంటి వ్యక్తి మాత్రమే శాస్త్రాన్ని సరిగ్గా బోధించగలడు. అటువంటి వ్యక్తి మాత్రమే సరియైన గురువు కాగలడు. కల్పయేత్ అంటే బోధిస్తాడు అని అర్థం.

**అవిశంకితః** – అది కూడా ఎటువంటి శంక కూడా లేకుండా బోధించగలడు. అతను స్పష్టంగా, నిస్సంశయ జ్ఞానంతో బోధించగలడు. అతను ద్వైతాన్ని మార్గంగా తీసుకుని అద్వైతం అనే గమ్యం చేరుకుంటాడు. కాని తక్కిన దార్శనికులు అంధపరంపరలో ఉన్నారు. ఎందుకంటే, వారు ద్వైతంనుంచి ద్వైతానికి, పరిమితినుంచి పరిమితికి, మృత్యువు నుంచి మృత్యువుకు ప్రయాణం చేస్తున్నారు. అంటే వారు ఏమాత్రం ఎదగటం లేదు.

### కారిక 2.31

**స్వప్నమాయే యథా దృష్టే గంధర్వనగరం యథా ।**
**తథా విశ్వమిదం దృష్టం వేదాంతేషు విచక్షణైః ॥**

అద్వైతానికి రాకముందు ఒక సాధకుడు ద్వైతంలో ఉండవచ్చు, అందులో ఏమీ సమస్య లేదు. అతని బుద్ధి త్రిపుటి గురించి ఆలోచిస్తుంది – జీవ, జగత్, ఈశ్వరుడు. కాని అద్వైతానికి వచ్చాక ఈ మూడు రెండవాలి – ఆత్మ–అనాత్మ భేదం చూడాలి; తర్వాత రెండు ఒకటవాలి. ఉన్నదొకటే అద్వైతం అనే సత్యాన్ని జీర్ణించుకోవాలి. అద్వైతాన్ని జీర్ణించుకున్నంత మాత్రాన, ద్వైతం పోదు. సూర్యోదయం అవటం లేదని తెలిశాక కూడా సూర్యోదయ అనుభవం పోదు. కాని ఎలాగైతే సూర్యోదయం నిజం కాదని తెలుసుకుంటామో, అలా ద్వైతం నిజం కాదని అర్థం చేసుకుంటాడు జ్ఞాని. ద్వైతం మిథ్య అని నిరూపించటానికి మూడు ఉదాహరణలు ఇవ్వబడ్డాయి ఈ కారికలో. అవి స్వప్నం, ఇంద్రజాలం, గంధర్వనగరం.
**వేదాంతేషు విశ్వమిదం దృష్టమ్** – వేదాంతబోధ విన్నాక, ద్వైత అనుభవం పోదు కాని అది అద్వైతజ్ఞానాన్ని మార్చలేదు.

విజ్ఞానశాస్త్రంలో ఎన్నో సంవత్సరాలు భూమి స్థిరంగా ఉందనీ, సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నాడనీ అనుకునేవారు. తర్వాత ఎవరో శాస్త్రజ్ఞుడు వచ్చి భూమే, సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని నిరూపించటానికి ప్రయత్నించాడు. మొదట్లో ఎవరూ అతని సిద్ధాంతాన్ని స్వీకరించటానికి ఇష్టపడలేదు. అతన్ని చాలా హింసించారు కాని నెమ్మదిగా సత్యాన్ని స్వీకరించక తప్పలేదు. సత్యం మనుష్యుల అభిప్రాయంమీద ఆధారపడదు. ఎక్కువమంది ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా సత్యం సత్యమే. ఇప్పుడు మనం ఆ సత్యాన్ని స్వీకరించినా ఇంకా సూర్యోదయం, సూర్యాస్తమయం అంటూనే ఉంటాము. అందువల్ల అనుభవం జ్ఞానాన్ని మార్చలేదు. ద్వైత అనుభవం, అద్వైతజ్ఞానాన్ని పారద్రోలలేదు. ఎందుకంటే జ్ఞానం అనుభవంకన్నా చాలా శక్తివంతమైనది.

**విచక్షణైః** – జ్ఞానులచేత, ఈ విశ్వం మిథ్యగా అర్థం చేసుకోబడింది. వేదాంతబోధ విన్నాక, ముందే చూసినట్టుగా అద్వైతజ్ఞానం పొందాక కూడా, ద్వైత అనుభవం కొనసాగుతుంది కాని, దాన్ని వారు చూసే దృక్కోణం మారుతుంది.

**స్వప్నమాయే యథా దృష్టే** -స్వప్నః చ మాయా చ - ద్వైతాన్ని స్వప్నంలాగా చూస్తారు. స్వప్నప్రపంచం అనుభవంలోకి వస్తుంది కాని అది సత్యం కాదు. అలాగే జాగ్రత్‌ప్రపంచం కూడా అనుభవంలోకి వస్తుంది కానీ అదీ సత్యం కాదు. మాయే - మిథ్యకు ఇంకొక ఉదాహరణ మాయాజాలం. ఇక్కడ మాయ అంటే వేదాంతంలో నేర్చుకునే మాయ కాదు; మాయ అంటే ఇంద్రజాలం.

ఇంద్రజాలంలో ఇంద్రజాలికుడు ఒక అమ్మాయిని రెండు భాగాలుగా కోస్తాడు. రక్తం కూడా కారుతుంది. కాళ్ళు ఒకవైపు, మొండెం ఒకవైపు జరిపి, అతను వాటి రెండింటి మధ్యనుంచి నడుస్తాడు. కళ్ళు ఇదంతా చూస్తూనే ఉన్నా, మీ బుద్ధి ఇది నిజంగా జరగలేదు. ఇది ఒక మాయాజాలం అని హెచ్చరిస్తుంది. అందువల్ల మీరు ఖంగారు పడకుండా, నిశ్చింతగా వెనక్కి వాలి మరీ కూర్చుని చూస్తారు. అదే విధంగా మీ ఎదురుగా ద్వైత ప్రపంచమే కనిపిస్తున్నా కూడా మీరు చలించకుండా, ఇదంతా మాయయొక్క మిథ్య అని అర్థం చేసుకుంటారు.

**గంధర్వనగరమ్** - ఆకాశంలో కనిపించే నగరం. ఇంకో విధంగా చెప్పాలంటే, ఆకాశంలో ఉన్న మేఘాలను చూసేటప్పుడు, మీ మనస్సుకు మంచి కల్పనాశక్తి ఉంటే, ఆ మేఘాలను అనేక రూపాలుగా ఊహించుకోవచ్చు - మనుష్యులు, జంతువులు, బజారు అలా ఎన్నో! అలాంటి గంధర్వనగరమే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా. విజ్ఞానశాస్త్రం ప్రకారం, జగత్తు అంటే కదులుతున్న ప్రోటాన్లు, న్యూట్రాన్ల సముదాయమే. అంటే జగత్తు అంటే కదులుతున్న శక్తి. అద్వైత శాస్త్రం ప్రకారం జగత్తు అంటే కదులుతున్నట్టుగా ఉన్న చైతన్యం.

ఆ విధంగా జ్ఞానులు జగత్తును స్వప్నంలాగా, ఇంద్రజాలంలాగా, గంధర్వనగరంలాగా మిథ్య అని అర్థం చేసుకుంటారు.

### కారిక 2.32

**న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః ।**
**న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా ॥**

ఇది చాలా ముఖ్యమైన కారిక. శంకరాచార్యులవారు దీనిని తరచు ఉటంకిస్తుంటారు. ఒక్కముక్కలో చెప్పాలంటే, ఈ కారిక సారాంశం, **తురీయ దృష్ట్యా జగన్మిథ్యా.**

స్వప్నదృష్టాంతాన్ని మాండూక్యంలో ఉన్నంతవరకూ మర్చిపోకూడదు. స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ అతని స్వప్నం, స్వప్నం అని తెలియదు. స్వప్నంలో స్వప్నశరీరానికి ఆకలి వేస్తుంది, స్వప్నంలో ఆహారం తీసుకుంటాడు. అలాగే స్వప్నంలో దెబ్బ తగిలితే, అదికూడా నిజమే. స్వప్నంలోనే డాక్టరు దగ్గరికి వెళ్ళాలి. స్వప్నం డబ్బులు ఇవ్వాలి, స్వప్నం

మందులు వేసుకోవాలి, స్వప్నంలో తగ్గుతుంది. ఇదంతా నిజంగా జరుగుతున్నట్టు గట్టిగా అనిపిస్తుంది.

కాని అతను మాత్ర వేసుకోబోతుండగా నిద్ర లేచాడు అనుకోండి. అప్పుడేమవుతుంది? స్వప్నశరీరమే మిథ్యగా తేలిపోతుంది. స్వప్నశరీరమే మిథ్య అయితే, ఆ శరీరానికి తగిలిన దెబ్బ మాత్రం సత్యమవుతుందా? దెబ్బ లేకపోతే దాన్ని నయం చేసే అవసరం ఏముంది? కాని అది మిథ్య అని ఎప్పుడు తెలుస్తుంది? అతను స్వప్నంనుంచి నిద్ర లేచాకే.

ఇదే సూత్రం జాగ్రత్ ప్రపంచానికి కూడా వర్తిస్తుంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. జాగ్రత్ ప్రపంచంలో ఉన్నంతవరకూ జాగ్రత్ పురుషునికి జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. అతను తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నం–2గా, మిథ్యగా తేలిపోతుంది.

**ఇత్యేషా పరమార్థతా** – పారమార్థిక దృష్ట్యా అంటే తురీయం దృష్ట్యా ఇది నిశ్చయము.

**న ఉత్పత్తిః** – ఉత్పత్తి అంటే జగత్తుయొక్క సృష్టి. ఎలాగైతే స్వప్నంనుంచి లేస్తే స్వప్నప్రపంచం సృష్టి లేదో, అలాగే తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం సృష్టి కూడా లేదు.

**న నిరోధః** – అదే విధంగా తురీయ దృష్ట్యా ప్రళయమూ లేదు. నిరోధః అంటే ప్రళయం. తురీయ దృష్ట్యా సృష్టీ లేదు, ప్రళయమూ లేదు. గుర్తుంచుకోండి, మనశ్శరీరాల దృష్ట్యా సృష్టి ఉంది, లయ ఉంది కాని తురీయ దృష్ట్యా సృష్టి లేదు, లయ లేదు. సృష్టీ లేక, లయమూ లేకపోతే స్థితి ఎక్కడనుంచి వస్తుంది. **స్థితి అపి న**. స్థితి కూడా లేదు. స్థితి లేదు అంటే జీవులు ఉండీ లేనట్టే అర్థం.

**న బద్ధః** – జీవులే లేకపోతే, వారు బద్ధజీవులు ఎలా అవుతారు?

**న ముముక్షుః** – బద్ధజీవే లేకపోతే, జీవుడు మోక్షం కోరే ప్రసక్తి ఎక్కడ ఉంది? అందువల్ల ముముక్షుత్వం లేదు అంటే సాధన లేదు.

**న చ సాధకః** – సాధన లేకపోతే సాధకుడూ లేడు. సాధకుడే సాధన చేయాలి. ఒక సాధకుడే కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది; ఉపాసన యోగం చేసి చిత్త ఏకాగ్రత పొంది; జ్ఞానయోగానికి వచ్చి జ్ఞానం పొంది, తద్వారా మోక్షం పొందాలి. ఇవన్నీ సాధకుడు దశలవారీగా చేయాల్సిన ప్రయాణం. సాధనే అవసరం లేకపోతే సాధకుడు ఎందుకు?

**న వై ముక్తః** – బద్ధజీవే లేకపోతే, ముక్తపురుషుడు ఎలా అవుతాడు?

ఇలా అయితే మాండూక్యం నేర్చుకోవటం కొనసాగించాలా, లేదా? ఇవన్నీ ఎవరిపరంగా చెబుతున్నాము? శాస్త్రానికి వచ్చి, జ్ఞానం పొంది, తురీయదృష్ట్యా అర్థం చేసుకునే వ్యక్తి పరంగా. జాగ్రదావస్థలో ఉండగా సృష్టి, స్థితి, లయ ఉంది; సాధకుడు సంసారమనే బంధంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు; తీవ్రముముక్షుత్వం చూపి, కర్మ, ఉపాసన, జ్ఞానమార్గాల

ద్వారా మోక్షం పొందాలి. అలా జ్ఞానం పొందాక, ఉన్నదొకటే అద్వైతం; తను నిత్య, ముక్త, శుద్ధ తురీయ ఆత్మ అని తెలుసుకున్నాక చెప్పేమాట ఇది. అంటే **తురీయదృష్ట్యా సృష్టి లేదు, లయ లేదు, జీవుడు లేదు, బంధం లేదు, మోక్షం లేదు, సాధన అవసరం లేదు; సాధకుడే లేడు.** అహంకార దృష్ట్యా, దేహ అభిమాన దృష్ట్యా చూస్తే ఇవన్నీ ఉన్నాయి. తురీయదృష్ట్యా చూడటం నేర్చుకునేటంతవరకూ శాస్త్రం నేర్చుకోకతప్పదు.

### కారిక 2.33

**భావైరసద్భిరేవాయమద్వయేన చ కల్పితః ।**
**భావా అప్యద్వయేనైవ తస్మాదద్వయతా శివా ॥**

ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఇంకొక ప్రత్యేకమైన, అరుదైన ఆలోచనను మన మనస్సులోకి చొప్పిస్తున్నారు. ద్వైతప్రపంచం మిథ్య అనేది శాస్త్రానికి వచ్చిన అందరికీ తెలిసినదే. కాని గౌడపాదాచార్యులవారు అద్వైతం కూడా కొంతమేరకు మిథ్య అంటున్నారు. ద్వైతం పూర్తిగా మిథ్య అయి, అద్వైతం పాక్షికంగా మిథ్య అయితే, ఈ రెండింటిలో ఏది గొప్పది? నిస్సందేహంగా పాక్షికంగా మిథ్య అయిన అద్వైతమే గొప్పది. ఎందుకు? పాక్షికంగా మిథ్య అయితే, పాక్షికంగా సత్యం అని కదా అర్థం. సత్యం అయినదే ఎప్పటికన్నా గొప్పది.

ద్వైతం మిథ్య అని ఇంతవరకూ గౌడపాదాచార్యులవారే నిరూపించుకుంటూ వచ్చారు. ద్వైతప్రపంచం అంటే – విశ్వ–జాగ్రత్ ప్రపంచం; తైజస–స్వప్నప్రపంచం; ప్రాజ్ఞ–కారణ ప్రపంచం అని చూశాము. ఇప్పుడు అద్వైతం పాక్షికంగా మిథ్య అని ఎలా అంటున్నారు? దాంట్లో ఒక సూక్ష్మమైన, సాంకేతిక పదం ఉంది. అదేమిటో చూద్దాము.

మిథ్య నిర్వచనం – దేన్నైతే త్రోసిపుచ్చగలమో అది మిథ్య; దేన్నైతే త్రోసిపుచ్చలేమో అది సత్యం. ద్వైతాన్ని త్రోసిపుచ్చగలము కాబట్టి అది మిథ్య; అద్వైతాన్ని అంటే తురీయాన్ని త్రోసిపుచ్చలేము కాబట్టి అది సత్యం. ఇంతవరకూ బాగానే ఉంది.

ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఒక అడుగు ముందుకు వేస్తున్నారు. మాండూక్యానికి వచ్చారు అంటేనే, మిగతా ఉపనిషత్తులకన్నా ఒక మెట్టు పైనుంచే అర్థం చేసుకోవటానికి సంసిద్ధులై ఉండాలి. గౌడపాదాచార్యులవారు, ఎప్పుడైతే ద్వైతప్రపంచాన్ని మిథ్యగా కొట్టివేస్తున్నామో, అప్పుడే అద్వైతానికి, అద్వైతపు హోదా ఉండదు అంటున్నారు. ఇప్పుడు తాడు–పాము ఉదాహరణే తీసుకోండి. తాడుమీద పామును ఆరోపించాము. తాడు అధిష్ఠానం, పాము అధ్యాస. పాము అనే అధ్యాస పోతే, తాడుకు అధిష్ఠాన హోదా కూడా పోతుంది. అధిష్ఠాన హోదా, అధ్యాస ఉన్నంతవరకే ఉంటుంది. పాము మాయమయ్యాక, తాడు ఉంటుంది; తాడు కూడా ఉండదు అనకూడదు. కాని తాడుకు అధిష్ఠాన హోదా మాత్రం ఉండదు. ఆ పదమూ ఇంక వాడలేము.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని అద్వైతం–ద్వైతం పదాలకు అన్వయించి చూద్దాము. తురీయం అద్వైతం, జగత్తు ద్వైతం. ద్వైతాన్ని మిథ్యగా కొట్టివేస్తే, ఇంక అద్వైతం హోదా ఉండదు. జాగ్రత్తగా గమనించండి, అద్వైతం ఉంటుంది, తురీయం ఉంటుంది కాని తురీయానికి అద్వైతం హోదా ఉండదు. ఆ మాటకొస్తే అద్వైతానికి వచ్చాక ఏ పదాన్నీ వాడలేము. సత్యం పదం వాడాలంటే, దానికి భిన్నంగా మిథ్యా వస్తువు ఉండాలి; సబ్జెక్టు అనాలంటే దానికి భిన్నంగా ఆబ్జెక్టు ఉండాలి; తురీయం అనాలి అంటే దానికి భిన్నంగా ద్వైతప్రపంచం ఉండాలి; నిర్గుణబ్రహ్మ అనాలి అంటే సగుణ ఈశ్వరుడు ఉండాలి; చైతన్యం అనాలి అంటే దానికి భిన్నంగా జడం ఉండాలి; నిత్యం అనాలి అంటే దానికి భిన్నంగా అనిత్యవస్తువు ఉండాలి. జగత్తు మిథ్య, జడం, అనిత్యం, ద్వైతం అని నిరూపించటానికి తురీయం సత్యం, చైతన్యం, నిత్యం, అద్వైతం అని వివరిస్తాము. కాని జగత్తును ఈ పదాలతో కొట్టివేశాక, చివరికి తురీయం, అద్వైతం పదాలను కూడా వాడలేము. అంటే సత్యం, చైతన్యం హోదాలు కూడా ఉండవు.

అందువల్ల ద్వైతప్రపంచాన్ని ఖండించేటంతవరకే ఈ పదాలకు ఉనికి. ఒకసారి తురీయం స్థాయికి ఎదిగాక, ఈ పదాలేవీ వాడలేము. మరి ఏం వాడాలి? మౌనవ్యాఖ్యానమే! ఈ భావననే ఈ కారికలో చూస్తాము.

**అయం** – ఈ ఆత్మ,

**కల్పితః** – కల్పించబడింది. దేనిగా?

**అసద్భిః భావైః ఏవ**– భావః అంటే ద్వైతప్రపంచరూపంలో; అసద్భిః అంటే మిథ్య. ఆ విధంగా ఆత్మ మిథ్య అయిన ద్వైతప్రపంచంగా కల్పించబడింది.

**అద్వయేన చ (కల్పితః)** – ఆత్మకు ఉన్న ఈ అధిష్ఠాన హోదా కూడా మిథ్య. ఇక్కడ చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఆత్మను మిథ్య అనటం లేదు; సాక్షిగా చూసే ఆత్మ (తురీయం) సత్యం కాని సాక్షి హోదా మిథ్య. దృశ్యంగా చూడబడే జగత్తే లేకపోతే దేన్ని సాక్షిగా చూస్తుంది? సాక్షిచైతన్యం హోదా కూడా మిథ్యే. మిథ్యమీద ఆధారపడి ఏర్పడిన హోదా కూడా మిథ్యే. ఆ విధంగా పదాలన్నీ కొట్టివేస్తే మిగిలింది ఏమిటి? అమాత్ర అంటే పేరు లేనిది.

దానికి పేరు లేదు అనగానే, తర్కినవారు అదుగో మీరు పేరు వాడారు అంటారు. పేరు లేదు అని చెప్పేది కూడా తర్కినవారికోసమే. అన్నీ ఖండించాక, మిగిలేది మౌనవ్యాఖ్యానమే. అందువల్ల అద్వయేన చ కల్పితః అంటే ఆత్మను అద్వైత అధిష్ఠానంగా పొరపాటు పడుతున్నారు అని అర్థం. అంటే అద్వైతం కూడా మిథ్య.

**భావా అప్యద్వయేనైవ** – అపి అంటే అదికాక; భావా అంటే ద్వైతప్రపంచం; అద్వయేన ఏవ అంటే అద్వైతంమీద ఆధారపడివుంది. అంటే ఈ పదాల అర్థం ద్వైతప్రపంచం అద్వైతం మీద ఆధారపడి ఉంది కాబట్టి, ద్వైతప్రపంచం మిథ్య. అంటే ద్వైతప్రపంచం మిథ్య; అద్వైతం సత్యం.

ముందు పదాల్లో అద్వైతం మిథ్య అని వచ్చింది; ఈ పదాల్లో అద్వైతం సత్యం అని వచ్చింది; ఈ రెండు వాక్యాలను కలిపితే, అద్వైతం సగం మిథ్య, సగం సత్యం అని అర్థం వస్తుంది. ఈ అర్థాన్ని ముందే విస్తారంగా చూశాము. అద్వైతం హోదా మిథ్య లేదా అద్వైతం పదం మిథ్య, కాని అద్వైత తురీయం సత్యం.

**తస్మాత్** – అందువల్ల, అద్వైత హోదా మిథ్య. అద్వైత తురీయం సత్యం కాబట్టి,

**అద్వయతా శివా** – అద్వైతం మంగళం.

ఈ కారిక సారాంశం – ద్వైతం పూర్తిగా మిథ్య, అందువల్ల అమంగళం; అద్వైతం హోదాపరంగా మిథ్య కాని వస్తువరంగా సత్యం కాబట్టి, అది మంగళం.

### కారిక 2.34

**నాత్మభావేన నానేదం న స్వేనాపి కథంచన ।**
**న పృథఙ్ నాపృథక్కించిదితి తత్త్వవిదో విదుః ॥**

ద్వైతప్రపంచాన్ని మిథ్యగా ఎలా కొట్టివేయవచ్చో, పూర్తిగా కొత్త కోణంలోంచి చూపిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. ముందే చెప్పినట్టుగా ఆయన మార్గమే భిన్నం.

ద్వైతప్రపంచం లోతులు కొలిచినకొద్దీ, అది అంతుపట్టనిదిగా మిగులుతుంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ప్రపంచాన్ని ఏ తెగలోనూ పెట్టలేము. అందువల్లనే దాన్ని అనిర్వచనీయం అనీ, మాయ అనీ, మిథ్య అనీ అంటున్నారు. స్వప్నప్రపంచం నిజంగా ఉందా, లేదా? లేదని దాన్ని పూర్తిగా కొట్టివేయలేము. ఎందుకంటే స్వప్నంలో ఉన్నంతసేపూ అది భయపెడుతుంది, పరుగులు తీయిస్తుంది. కొంతమందైతే, అలాంటి పీడకలలు రాకుండా ఉండటంకోసం ఆంజనేయశ్లోకం చదువుకుని మరీ పడుకుంటారు.

అలాగని స్వప్నం నిజం అందామా అంటే అదీ కుదరదు. అదే నిజమయితే, స్వప్నంలో సంపాదించిన సొమ్ముతో ఇక్కడ హాయిగా ఇల్లు కట్టుకోవచ్చు. కాని స్వప్నంలో ఎన్ని కోట్లు సంపాదించినా ఇక్కడ వినియోగించుకోలేము. అంటే స్వప్నాన్ని ఉనికి ఉన్నదిగానూ చూడలేము, ఉనికి లేనిదిగానూ చూడలేము. అటువంటి దాన్నే అనిర్వచనీయం, మిథ్య అంటారు.

ఇప్పుడు ఇదే విధంగా జాగ్రత్ ప్రపంచాన్ని విశ్లేషిస్తే, జగత్తు అనే పదార్థం కూడా అనిర్వచనీయం, మిథ్య అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఎందుకు? పదార్థం, ఆత్మ ఒకటే అందామా అంటే పదార్థం జడం, ఆత్మ చైతన్యం. అందువల్ల అవి ఒకటే అవటానికి వీలులేదు. పోనీ జగత్తు, ఆత్మకు భిన్నంగా ఉంది అందామా అంటే, అదీ కుదరదు. ఒక వస్తువుకు ఉనికి ఉందని చెప్పాలంటే, ఆ వస్తువు గురించిన జ్ఞానం ఉండాలి. ఆ వస్తువు గురించిన జ్ఞానం ఉండాలంటే చైతన్యం ఉండాలి. అంటే చైతన్యం లేకుండా, ఉనికి గురించి మాట్లాడలేము. అందువల్ల జగత్తు ఆత్మకు భిన్నంగా లేదు.

సరే జగత్తు, చైతన్యమూ కాదు, దానికి భిన్నంగా లేదు కాని, దానిలో ఒక భాగం అందామా అంటే చైతన్యానికి భాగాలు లేవు. చైతన్యం నిర్గుణం, నిరాకారం. ఒక వస్తువుయొక్క ఉనికి గురించి మాట్లాడాలీ అంటే ఈ మూడు మార్గాలే ఉన్నాయి –

– పదార్థమూ, చైతన్యమూ ఒకటై ఉండాలి.

– పదార్థం, చైతన్యానికి భిన్నంగా ఉండాలి.

– పదార్థం, చైతన్యంలో ఒక భాగమై ఉండాలి.

కాని ఈ మూడు కారణాలూ చెల్లవని చూశాము.

జగత్తుకు తురీయానికి మధ్య –

| | | |
|---|---|---|
| పోలిక లేదు | – | జగత్తు జడం, తురీయం సత్యం |
| భాగం కాదు | – | తురీయం నిరవయం |
| భిన్నంగా లేదు | – | తురీయం అద్వైతం |

అంటే అసలు పదార్థం లేదని అందామా? అలాగూ అనలేము. ఎందుకంటే అది మన అనుభవంలోకి వస్తున్నది. మన అనుభవంలోకి వచ్చిన, మనం ఒక తెగకింద జమ కట్టలేనిది ఏదైనా మిథ్యే. బుద్ధి దీన్ని అంత తేలికగా స్వీకరించలేదు. ఎందుకంటే, మనం దేన్నైనా స్వీకరించేది ఒక తెగ కింద జమ కట్టడం ద్వారానే. ఏ సబ్జెక్టు తీసుకోండి, అందులో కొన్ని తెగలు ఉంటాయి. మాథ్స్ తీసుకుంటే ఆల్జీబ్రా, ట్రిగ్నామెట్రీ, జామెట్రీ అలా భాగాలు ఉంటాయి. కాని తురీయంలో జగత్తును భాగాలుగా చేయలేము.

కారిక 32లో పారమార్థిక దృష్ట్యా అసలు సృష్టే జరగలేదన్నారు గౌడపాదాచార్యులవారు. ఇప్పుడు ఈ కారికలో జగత్తును అసలు ఉనికి లేదు అనలేము, కాని అది మిథ్య అంటున్నారు. అంటే జగత్తు అనుభవంలోకి వస్తున్నది, కాని తార్కికంగా నిరూపించటానికి ప్రయత్నిస్తే మాత్రం కుదరటం లేదు. జగత్తు, బ్రహ్మ ఒకటే అందామా అంటే జగత్తు జడం–బ్రహ్మ చైతన్యం; జగత్తు సగుణం–బ్రహ్మ నిర్గుణం; జగత్తు సవికారం–బ్రహ్మ నిర్వికారం.

పోనీ జగత్తు, బ్రహ్మకు భిన్నంగా ఉంది అందామా అంటే, ద్వైతం వచ్చేస్తుంది. ఎక్కడ ద్వైతం ఉంటే అక్కడ దేశ, కాల, వస్తు పరిచ్ఛేదం వస్తుంది. ఒకటి ఇంకొకదానికి పరిమితులను విధిస్తుంది. బ్రహ్మ అనంతం. అనంతం బ్రహ్మను ఎలా పరిమితి చేస్తారు? అంతేకాదు, బ్రహ్మ అద్వైతం, ఉన్నదొకటే బ్రహ్మ. ఉన్నదొకటే బ్రహ్మ అయితే భిన్నంగా వేరే ఏదీ ఉండటానికి వీలులేదు.

అదీకాదు, ఇదీకాదు, జగత్తు బ్రహ్మలో ఒక భాగం అందామా అంటే బ్రహ్మకు భాగాలు లేవు. ఆకాశానికే భాగాలు లేకపోతే బ్రహ్మకు ఎలా భాగాలు ఉంటాయి? అందువల్ల జగత్తుయొక్క ఉనికిని తార్కికంగా నిరూపించలేము.

**నాత్మభావేన నానేదం న స్వేనాపి కథంచన** – ఈ నానాత్వం, ఆత్మ ఒకటి కాదు; అలాగని ఆత్మకు భిన్నంగానూ లేదు. అందువల్ల జగత్తుయొక్క స్వరూపం ఆత్మకు సమానంగానూ లేదు, భిన్నంగానూ లేదు. అందువల్ల అది అనిర్వచనీయం.

ముందే చెప్పినట్టుగా గౌడపాదాచార్యులవారి పద్ధతే వేరు. ఇంతవరకూ జగత్తునూ, బ్రహ్మను పోల్చిచూశాము. ఇప్పుడు గౌడపాదాచార్యులవారు ఇంకొక అడుగు ముందుకు వేయిస్తున్నారు మనచేత. జగత్తు, బ్రహ్మ విషయం మాట దేవుడెరుగు, జగత్తులోనే ఒక వస్తువుకూ, ఇంకొక వస్తువుకూ మధ్య సంబంధాన్ని కూడా తార్కికంగా నిరూపించలేము అంటున్నారు. మనకు తెలిసి జగత్తులో అనేక వస్తువులు ఉన్నాయి, ఒక వస్తువు ఇంకొక వస్తువుకు పూర్తిగా భిన్నంగా ఉంటుంది.

**పుస్తకం బల్ల**మీద ఉంది

ఈ వాక్యంలో పుస్తకం వేరు, బల్ల వేరు. అందువల్ల వాటికి పేర్లు కూడా భిన్నంగా ఉన్నాయి. అలా అనేక వస్తువులకు, అనేక పేర్లు పెట్టుకుని, వాటితో వ్యవహారం నడుపుకు వస్తున్నాము. అంతకన్నా వాటి విషయాల్లో లోతుగా వెళ్ళలేదు. గౌడపాదాచార్యులవారు, ఒక ఆశ్చర్యకరమైన సూత్రాన్ని చెబుతున్నారు. కొంచెం లోతుగా వెళితే, ఒక వస్తువుకూ, ఇంకొక వస్తువుకూ మధ్య భేదాన్ని అసలు నిరూపించలేము అంటున్నారు. మనం వాటి మధ్య భేదం ఉందనుకుంటున్నాము కాని నిజంగా లేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. గుర్తుంచుకోండి, మనం ఇప్పుడు బ్రహ్మ గురించి మాట్లాడటం లేదు. జగత్తులోని రెండు వస్తువుల గురించి మాట్లాడుతున్నాము.

**న పృథజ్ నాపృథక్కించిత్** – జగత్తులోని ఒక వస్తువు ఇంకొక వస్తువును పోలివుందా, భిన్నంగా ఉందా అని కొంచెం కూడా నిరూపించలేము అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అదెలా?

కొంచెం లోతుగా ఈ విషయాన్ని విశ్లేషిద్దాము. భేదాన్ని ఎలా నిరూపిస్తాము? ఒకవేళ మీరు పసుపురంగు, ఎరుపురంగుకు భిన్నంగా ఉంది అన్నారు అనుకోండి. మీ కళ్ళు మూడు విషయాలను చూడగలుగుతున్నాయి. మీ కళ్ళు పసుపురంగును చూపిస్తున్నాయి, ఎరుపురంగును చూపిస్తున్నాయి, ఈ రెండింటి మధ్య భేదాన్ని కూడా చూపిస్తున్నాయి.

ఇప్పుడు చెప్పండి – పసుపురంగుకు, ఎరుపురంగుకూ మధ్య ఉన్న భేదం ఏ రంగు? పసుపురంగా, ఎరుపురంగా? ఏదీ కాదు. ఆ భేదం ఈ రెండింటిలో ఏదీకాదు. భేదం ఏ రంగూ కాకపోతే, భేదాన్ని చూడలేరు మీరు. అంటే భేదానికి ప్రత్యక్ష ప్రమాణం లేదు.

సరే, ఇప్పుడు రూపం తీసుకుందాము. ఒక వృత్తాన్నీ, ఒక చతురస్రాన్నీ తీసుకుందాము. ఈ రెండు రూపాలూ మీకు బాగానే కనిపిస్తున్నాయి సరే! వీటి మధ్యనున్న భేదం ఏ రూపం? వృత్తమా, చతురస్రమా? ఏదీ కాదు! భేదం ఏ రూపమూ కాకపోతే, భేదాన్ని చూడలేరు మీరు. కళ్ళు రంగు, రూపాలను మాత్రమే చూడగలవు. కాని భేదం రంగూ కాదు, రూపమూ కాదు.

అయితే భేదం శబ్దస్పర్శరూపరసగంధాలలో దేనికీ అందదు. భేదం ఈ ఐదింటికీ అందకపోతే అది ప్రత్యక్షప్రమాణానికి అందదని అర్థం. పంచజ్ఞానేంద్రియాలు ప్రత్యక్ష ప్రమాణం. పంచజ్ఞానేంద్రియాలకు అందనిది ప్రత్యక్ష విషయంలోకి రాదు.

ప్రత్యక్షప్రమాణానికి అందకపోతే, అనుమానప్రమాణంలోకి వస్తుందా? అనుమాన ప్రమాణం వాడాలంటే దానికి ప్రత్యక్షప్రమాణం తోడవ్వాలి. కొండమీద పొగను చూసి అక్కడ అగ్ని ఉందని ఊహించాలంటే ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుందనే జ్ఞానం ఉండాలి. అది ప్రత్యక్ష ప్రమాణంవల్లనే సాధ్యం. పూర్వకాలపు వంటింట్లో పొగనూ, అగ్నినీ కలిపి చూడటంవల్ల కలిగిన జ్ఞానం అది. అసలు పొగనే ఎప్పుడూ చూడకపోయివుంటే, పొగ ఉన్నచోట అగ్ని ఉంటుందని చెప్పలేరు. అంటే అనుమాన ప్రమాణాన్ని, ప్రత్యక్ష ప్రమాణానికి జత చేయకుండా వాడలేరు. అంటే అనుమాన ప్రమాణమే కాదు, తర్కంమీద ఆధారపడిన తక్కిన ప్రమాణాలు కూడా వాడలేరు. అవి అర్థాపత్తి ప్రమాణం, అనుపలబ్ధి ప్రమాణం, ఉపమాన ప్రమాణం. అంటే లౌకిక విద్యకు వాడే ఐదు ప్రమాణాల్లో దేన్నీ వాడలేరు.

ఈ ప్రమాణాలు పనిచేయని చోట శాస్త్రప్రమాణం పనిచేస్తుంది, శాస్త్రం ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తుందని చూశాము. అయితే శాస్త్రం ఈ భేదం గురించి చెబుతుందా?

**నేహ నానాస్తి కించన** – కఠ

ఇక్కడ కొంచెం కూడా భేదం లేదు అంటున్నది శాస్త్రం. ఆ విధంగా భేదాన్ని నిరూపించటానికి ఏ ప్రమాణమూ లేదు. మరయితే, ద్వైతం ఏమిటి? అది కేవలం అపోహ మాత్రమే. ఏ ప్రమాణానికీ అందనిది అపోహ తప్ప ఏమీకాదు. ఏ ప్రమాణానికీ అందనిదాన్ని మిథ్య అంటారు. అందువల్ల భేదం ఉందని మీరు అనుకుంటున్నా కూడా మీరు భేదం గురించి మాట్లాడలేరు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**ఇతి తత్త్వవిదో విదుః** – ఈ విధంగా ద్వైతం మిథ్య అని జ్ఞానులు అర్థం చేసుకుంటారు. మిథ్య అంటే ఉన్నట్టుగా కనిపిస్తుంది కాని, తర్కానికి అందదు.

**కారిక 2.35**

**వీతరాగభయక్రోధైర్మునిభిర్వేదపారగైః ।**
**నిర్వికల్పో హ్యయం దృష్టః ప్రపంచోపశమోఽద్వయః ॥**

5. **సాధనాని, ఫలమ్ – కారికలు 35-38**

ముందు కారికతో గౌడపాదాచార్యులవారు తన ముఖ్యమైన బోధను ముగించారు. అది జగత్ మిథ్యాత్వ నిశ్చయం. మాండూక్యోపనిషత్ పరిభాషలో జగత్ అంటే ఆత్మయొక్క మూడు పాదాల్లో వర్ణించిన మూడు జంటలు వస్తాయి. అవి –

| | | |
|---|---|---|
| జాగ్రత్ పురుషుడు | + | జాగ్రత్ ప్రపంచం |
| స్వప్నపురుషుడు | + | స్వప్నప్రపంచం |
| సుప్తపురుషుడు | + | కారణప్రపంచం |

ఈ మూడు జంటలూ మిథ్యే. మరయితే ఏమిటి సత్యం? నాలుగవ పాదం అయిన తురీయం మాత్రమే సత్యం.

ఈ సూక్ష్మజ్ఞానం పొందటానికి అవసరమైన సాధనలను పేర్కొనటంలో ఈ విశ్లేషణను ముగించదలుచుకున్నారు గౌదపాదాచార్యులవారు. ఆ సాధనలు – సాధన చతుష్టయ సంపత్తి, శ్రవణమననాలు, నిదిధ్యాసనం, సన్న్యాసం. ఈ కారికలో మొదటి రెండూ చూస్తాము.

**వీతరాగభయక్రోధః** – అధికారి ఎవరు అంటే రాగంనుంచి విడివడిన వ్యక్తి. రాగం అంటే బంధం. బంధం తొలగితే వైరాగ్యం ఏర్పడుతుంది. రాగం పోతే, రాగం వెన్నంటి ఉండే భయం, క్రోధం కూడా పోతాయి. భయం అంటే రాగం ఉన్న వస్తువు దూరమవుతుందేమోననే భయం, క్రోధం అంటే అది పోతే కలిగే కోపం. ఈ పదాల ద్వారా శమాది షట్కసంపత్తిని సూచిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**మునిభిః** – మునిభిః అంటే ముని కాదు, వివేకం కల వ్యక్తి. ఆలోచనలో స్పష్టత ఉండాలి. అజ్ఞానానికీ, సంసారానికీ మధ్య ఉన్న సంబంధం ఏమిటో స్పష్టంగా తెలియాలి. మనం

సంసారంలో పడి కొట్టుమిట్టాడటానికి కారణం ఆత్మ అజ్ఞానం. సమస్యకు మూలకారణం ఏమిటో తెలిస్తే కాని, దానికి పరిష్కారం చూడలేము. అజ్ఞానం మూలకారణం అని తెలిస్తే, జ్ఞానంమీద శ్రద్ధ కలుగుతుంది. కర్మవల్ల మోక్షం రాదు, కర్మ జ్ఞానానికి సంసిద్ధులను చేస్తుంది అని అర్థం చేసుకోవాలి. ఆ విధంగా జ్ఞానంయొక్క విలువ తెలియాలి. జ్ఞానంయొక్క విలువ తెలిస్తేనే, వేదాంతబోధ విలువ తెలుస్తుంది. ఆ విధంగా సమస్యకు కారణం అజ్ఞానం అనీ, దాన్ని జ్ఞానంతో మాత్రమే తొలగించగలమనీ, జ్ఞానం వేదాంత శ్రవణంవల్లనే సాధ్యమనీ స్పష్టంగా తెలియాలి. అప్పుడే వేదాంత శ్రవణం శ్రద్ధగా, అంకితభావంతో సాగుతుంది. ఈ జ్ఞానం సంసారబంధంనుంచి ముక్తిని కలుగజేస్తుంది అనే విషయం తెలిసిన వ్యక్తిని ముని అంటారు. మననాత్ మునిః. ఇది వివేకాన్ని సూచిస్తుంది. తక్కిన రెండూ మనం కలుపుకోవాలి. అవి వైరాగ్యం, ముముక్షుత్వం. ఈ వాక్యాలు సాధన చతుష్టయ సంపత్తిని సూచిస్తాయి.

**వేదపారగైః** – వేదంలో నిష్ణాతులైనవారు. అంటే వేదాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నవారు వేదసారం జ్ఞానం మాత్రమే; కర్మ, ఉపాసన కాదని అర్థం చేసుకుంటారు వారు. కొంతమంది ఉపాసనవల్ల మోక్షం వస్తుంది అని పొరపాటు పడతారు. వారు ధ్యానానికి ఎంత ఎక్కువ విలువనిస్తారు అంటే, శాస్త్రాన్ని అధ్యయనం చేయటం కూడా ఒక ఆటంకం కింద భావిస్తారు. శాస్త్ర అధ్యయనం బహిర్ముఖంగా చేసేది, ధ్యానం అంతర్ముఖంగా చేసేది కాబట్టి ఆత్మజ్ఞానం పొందటానికి ధ్యానం చేయాలనే అపోహలో ఉంటారు కొంతమంది. జ్ఞానం వేదాంత శ్రవణంవల్లనే వస్తుందని అర్థం చేసుకోవాలి. అది కూడా ఒక క్రమపద్ధతిలో చేయాలి. అందువల్ల వేదపారగైః అంటే వేదాంత శ్రవణం చేసినవారు అని అర్థం. ఇందులో మననం కూడా కలుపుకోవాలి.

**అయం దృష్టః** – అటువంటివారు తురీయ ఆత్మను సరిగ్గా అర్థం చేసుకోగలరు. అయం అంటే తురీయ ఆత్మ. తురీయ ఆత్మ నిర్వచనం మంత్రం 7లో చూశాము.

**ప్రపంచోపశమం శాంతం శివమద్వైతమ్ – మంత్రం 7**

అందులో రెండు పదాలను గుర్తు చేస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**ప్రపంచోపశమోఽ ద్వయః** – ప్రపంచోపశమం, అద్వయం.

**నిర్వికల్పః** – అటువంటి తురీయ ఆత్మ వికల్పాలు లేనిది.

ప్రమాతృ ప్రమాణ ప్రమేయ వికల్పరహితః

ఈ విధంగా ఇందులో రెండు సాధనలను చూస్తాము.

సాధన 1 – సాధన చతుష్టయ సంపత్తి – **వీతరాగభయక్రోధః, మునిభిః**

సాధన 2 – వేదాంత శ్రవణమననాలు – **వేదపారగైః**

### కారిక 2.36

**తస్మాదేవం విదిత్త్వైనమద్వైతే యోజయేత్ స్మృతిమ్ ।**
**అద్వైతం సమనుప్రాప్య జడవల్లోకమాచరేత్ ॥**

సాధన చతుష్టయ సంపత్తి ఉంటే, ఆ సాధకునికి శ్రవణంవల్లనే జ్ఞానమూ, జ్ఞానఫలమూ కూడా కలుగుతుంది. అంటే ఉత్తమ అధికారికి జ్ఞానం=ఫలం. కాని మధ్యమ అధికారికి అంటే సాధన చతుష్టయ సంపత్తిలేని వ్యక్తికి జ్ఞానం కలుగుతుంది కాని, జ్ఞానఫలం పొందలేడు. అటువంటి వ్యక్తి నాకు అర్థం అయింది కానీ అంటాడు. కానీ అంటేనే ఏదో లోపం ఉందన్నమాట. అందువల్ల జ్ఞానానికీ, జ్ఞానఫలానికీ మధ్య దూరం ఉంది. ఆ దూరం తొలగాలంటే అర్హత సంపాదించుకోవాలి. అంటే సాధన చతుష్టయ సంపత్తిని పెంచుకోవాలి.

అదెలా పెంచుకోవాలి? నిదిధ్యాసనం ద్వారా పెంచుకోవాలి. ఈ నిదిధ్యాసనం మధ్యమ అధికారికి అవసరం. ఉత్తమ అధికారి జ్ఞానంతో పాటు, జ్ఞానఫలాన్నీ పొందుతాడు. మంద అధికారి జ్ఞానాన్నే పొందలేడు, అందువల్ల జ్ఞానఫలాన్నీ అనుభవించలేడు. మధ్యమ అధికారి జ్ఞానాన్ని బాగానే పొందుతాడు కాని, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడలేకపోతున్నాడు. అందువల్ల ఫలాన్ని అనుభవించలేకపోతున్నాడు. అటువంటి వ్యక్తి నిదిధ్యాసనం చేయాలి.

నిదిధ్యాసనం అంటే ఏమిటి? తను నేర్చుకున్న వేదాంతజ్ఞానంలో నిలబడటం. అది ఎలా చేయాలి? అనేక మార్గాల్లో చేయవచ్చు. మళ్ళీ మళ్ళీ శ్రవణం చేయవచ్చు, మననం చేయవచ్చు, తోటివారితో చర్చించవచ్చు, నోట్స్ రాయవచ్చు, తిరిగి బోధ చేయవచ్చు. ఇవి కాక శాస్త్రం విధించే పద్ధతి ధ్యానం చేయటం. ఇక్కడ తక్కిన ధ్యానాలకు ఉన్న నియమ నిబంధనలు వర్తించవు. అంటే ఆసనం, దేశం, కాలంవంటి నియమాలు ముఖ్యం కాదు. ఎక్కడైనా ఏకాంతంగా కూర్చునో, తిరుగుతూనో తను నేర్చుకున్న వేదాంతబోధనుంచి, తురీయం నిర్వచనాన్ని నెమరువేసుకోవాలి.

**తస్మాదేవం విదిత్త్వైనమ్** – శ్రవణ, మననాల ద్వారా అద్వైతజ్ఞానం పొంది, ఇంకా జ్ఞానఫలమైన జీవన్ముక్తిని అనుభవించలేకపోతున్నాను అని ఎవరికైనా అనిపిస్తే,

**అద్వైతే యోజయేత్ స్మృతిమ్** – అద్వైతంమీద అంటే తురీయంమీద ఆలోచనలను వీలున్నంతసేపు నిలపాలి. అంటే దానిమీద ధ్యానం చేయాలి.

**అద్వైతం సమనుప్రాప్య** – అలా అద్వైతంమీద ధ్యానం చేసినకొద్దీ, మనస్సు అంతకంతకూ సంసిద్ధమవుతుంది. అప్పుడు ఆ జ్ఞానం మనస్సుకు శాంతి. అభయం, సమత్వం చేకూరుస్తుంది. అంటే నెమ్మదిగా జ్ఞానఫలం అనుభవించటం మొదలుపెడతాడు.

**జడవల్లోకమాచరేత్** – ఇక్కడ జడవత్ అంటే అజ్ఞానిలాగా. జ్ఞానం పొందగానే, నేను జ్ఞానిని, నేను జీవన్ముక్తుణ్ణి అని ఊరంతా చాటింపు వేయించనవసరం లేదు. ఎవరైనా తనకు బోధించమంటే బోధించవచ్చు కాని, నలుగురితో నారాయణా అంటారు అలా ఉండండి. అంటే అజ్ఞానుల మధ్య అజ్ఞానిగానే తిరగండి. అలా అజ్ఞానిగా తిరిగితే, 'నన్ను ఎవరూ జ్ఞానిగా గౌరవించరు,' అని ఒకవేళ మీరంటే, మీలో జ్ఞానం ఇంకా బాగా జీర్ణించుకోలేదని అర్థం. ఎందుకంటే జ్ఞానికి గర్వం ఉండదు, నలుగురు గౌరవించాలనే తపన ఉండదు. అది సంసారంలో ఉండే అహంకారానికి చెందినది. జ్ఞాని నేను మనస్సు కాదు అని అర్థం చేసుకుంటాడు. ఇందులో మూడవ సాధనను చూశాము.

సాధన 3 – నిదిధ్యాసనం – **అద్వైతే యోజయేత్ స్మృతిమ్**

**కారిక 2.37**

**నిస్స్తుతిర్నిర్నమస్కారో నిస్స్వధాకార ఏవ చ ।**
**చలాచలనికేతశ్చ యతిర్యాదృచ్ఛికో భవేత్ ॥**

ఇందులో ఇంకొక సాధనను చూస్తాము. కాకపోతే ఇది చేసితీరాల్సిన సాధన కాదు. అది సన్న్యాసం. సన్న్యాసం వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు అనుకూలమైన ఆశ్రమధర్మం, కాని సన్న్యాసం స్వీకరించి తీరాల్సిన నియమం లేదు.

**యతిః భవేత్** – ఒక సాధకుడు కావాలంటే సన్న్యాసి అవవచ్చు. సన్న్యాసం స్వీకరించటంవల్ల అతనికి సంసారబాధ్యతలు, సామాజిక బాధ్యతలు, మతపరమైన బాధ్యతలు ఉండవు. మొత్తం సమయాన్ని వేదాంతానికే కేటాయించవచ్చు. ఇక్కడ కొన్ని లక్షణాలను వివరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**నిః స్తుతిః** – స్తోత్రము లేని వ్యక్తి. గృహస్థు నిత్యపారాయణం చేయాలి. దాన్ని బ్రహ్మయజ్ఞం అంటారు. సన్న్యాసి దాన్ని చేయనవసరం లేదు.

**నిర్నమస్కారః** – నమస్కారము లేని వ్యక్తి. గృహస్థు పూజలు చేయాలి. దాన్ని దైవయజ్ఞం అంటారు. సన్న్యాసికి అదీ అవసరం లేదు.

**నిస్స్వధాకారః** – శ్రాద్ధకర్మలులేని వ్యక్తి. గృహస్థు పితృయజ్ఞం చేయాలి. పితృదేవతలకు ఇచ్చే ఆహుతిని స్వధా అంటారు. సన్న్యాసికి పితృయజ్ఞం లేదు.

పంచమహాయజ్ఞాల్లో మూడింటిని చూశాము. తక్కిన రెండూ మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. సన్న్యాసికి ఇల్లు, వాకిలి ఉండదు. ఆస్తిపాస్తులు ఉండవు. సమాజసేవ చేయటానికి అవసరమైన వనరులు ఉండవు. నిజానికి అతనే తన ఆహారానికి సమాజంమీద ఆధారపడతాడు. కాబట్టి

అతను తక్కిన యజ్ఞాలు కూడా చేయలేదు. సన్న్యాసి ఈ పంచమహాయజ్ఞాలు చేసే సమయాన్ని వేదాంతశ్రవణ, మనన, నిదిధ్యాసనలకు వినియోగించుకోవచ్చు.

**చలాచలనికేతశ్చ** – సన్న్యాసికి ఇల్లు, వాకిలి ఉండదని చూశాము. కాని ఇక్కడ గౌడపాదాచార్యులవారు అతనికి రెండు ఇళ్ళు ఉన్నాయంటున్నారు. అవి చలనికేతం, అచలనికేతం – కదిలే ఇల్లు, కదలని ఇల్లు. అంటే శరీరంతో వ్యవహారం నడిపేటప్పుడు శరీరం అనే కదిలే ఇంట్లో ఉంటాడు. ప్రపంచంతో వ్యవహారం నడపనప్పుడు బ్రహ్మనిష్ఠలో ఉంటాడు. అంటే బ్రహ్మ అనే కదలని ఇంట్లో ఉంటాడు. మరి అతని ఆహారం మాటేమిటి?

**యాదృచ్ఛికః** – యాదృచ్ఛికంగా దొరికినదానితో తృప్తిపడతాడు. యాదృచ్ఛికం అంటే అనుకోకుండా దొరికినది అని అర్థం. ఇక్కడ అతని ప్రారబ్ధకర్మకు తగ్గట్టుగా దొరికిన ఆహారం. అతను భిక్షాటన చేసి జీవించాలి కాబట్టి, అతని ప్రారబ్ధకర్మకు తగ్గట్టుగా అతనికి ఆహారం దొరుకుతుంది.

యతిః – అటువంటి వ్యక్తిని సన్న్యాసి అంటారు. ప్రాపంచిక బాధ్యతలను తగ్గించుకోవాలంటే సన్న్యాసం స్వీకరించవచ్చు; లేదా గృహస్థుగా ఉంటూనే ఆంతరసన్న్యాసం స్వీకరించవచ్చు. గృహస్థుగా ఉంటూనే ప్రాపంచిక సంబంధాలను తగ్గించుకుని వేదాంతానికి ఎక్కువ సమయాన్ని కేటాయించుకోవచ్చు. ఇందులో నాలుగవ సాధనను చూశాము.

సాధన 4 – సన్న్యాసం (కావాలనుకుంటే) – **యతిః భవేత్.**

**కారిక 2.38**

**తత్త్వమాధ్యాత్మికం దృష్ట్వా తత్త్వం దృష్ట్వా తు బాహ్యతః ।**
**తత్త్వీభూతస్తదారామస్తత్త్వాదప్రచ్యుతో భవేత్ ॥**

**జ్ఞానఫలం** – ఈ కారికలో జ్ఞానఫలాన్ని చూస్తాము. జ్ఞానం పొంది, నిదిధ్యాసనం చేస్తే జ్ఞాననిష్ఠలో నిలబడతాడు జ్ఞాని. అంటే అతనికి తురీయదర్శనం కలుగుతుంది. తురీయదర్శనం కలుగుతుంది అంటే అక్షరాలా తురీయం అనే దాని దర్శనం కలగటం కాదు; తురీయజ్ఞానం కలుగుతుంది. తురీయాన్ని ఎక్కడ చూస్తాడు? లోపల, బయట కూడా.

**తత్త్వమాధ్యాత్మికం దృష్ట్వా తు** – జ్ఞాని తురీయాన్ని తనలోనే చూస్తాడు. ఆధ్యాత్మికం అంటే తనలోనే చూస్తాడు. మనస్సును సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యమే తురీయం అని అర్థం చేసుకుంటాడు. చైతన్యం మనస్సుతో కలిస్తే అది విశ్వ, తైజస లేదా ప్రాజ్ఞ అవుతుంది. మనస్సుకు భిన్నంగా ఉంటే తురీయం అవుతుంది.

**తత్త్వం దృష్ట్వా బాహ్యతః** – అదే తురీయాన్ని బాహ్యంగా కూడా చూస్తాడు. ఈ వాక్యం చాలా ముఖ్యం. ఎందుకంటే తురీయం లేదా బ్రహ్మ ఆంతరంగా ఉంది కాబట్టి తురీయాన్ని

ఎప్పుడూ చూడాలంటే, ఎప్పుడూ ధ్యానంలో కూర్చోవాలి అనే అపోహ ఉంది చాలామందిలో. గౌడపాదాచార్యులవారు బ్రహ్మ ఆంతరంగా ఉందని చెప్పి, ఆంతరంగా మాత్రమే కాదు, బాహ్యంగా కూడా ఉంది అంటున్నారు. బ్రహ్మ లోపలే ఉంది అంటే సర్వవ్యాపకమైన బ్రహ్మకు పరిమితిని విధించినట్టు అవుతుంది. జ్ఞాని బ్రహ్మను బాహ్యంగా ఎలా చూస్తాడు? జ్ఞాని బ్రహ్మను బాహ్యంగా సత్ రూపంలో చూస్తాడు.

**చిత్ రూపేణ అంతః సత్ రూపేణ బహిః సర్వదా పశ్యతి**

చిత్ (చైతన్యం) రూపంలో అంతరంగంలోనూ, సత్ (ఉనికి) రూపంలో బాహ్యంగానూ ఎప్పుడూ చూస్తాడు. ఉనికి ఎక్కడ ఉంది? ఎక్కడ లేదు అనగలగాలి. బల్ల ఉంది, కుర్చీ ఉంది, స్త్రీ ఉంది అనే ఈ వాక్యాలన్నింటిలోనూ ఉనికి రూపంలో బ్రహ్మ ఉంది.

ఇక్కడ ప్రతిపదాన్నీ జాగ్రత్తగా వాడాలి. జ్ఞాని తత్త్వాన్ని లోపలా, బయటా చూస్తాడు అంటే **చూస్తాడు** పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. తత్త్వం ఆబ్జెక్టు అంటే ప్రమేయం కాదు. అందువల్ల ఆ అయోమయం కలుగకుండా, గౌడపాదాచార్యులవారు జాగ్రత్తగా ఇంకొక పదం వేశారు.

**తత్త్వీభూతః** – ఈ సత్ చిత్ ఆత్మ బాహ్యవస్తువు కాదు, చూసే అతనే (జ్ఞాని) తానే తురీయం అవుతాడు. మళ్ళీ **అవుతాడు** పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. అవుతాడు అంటే తను ఎవరో కాదు, తురీయ ఆత్మే అని అర్థం చేసుకుంటాడు.

నేను శరీరాన్ని, నాకు ఆత్మ ఉంది – జ్ఞానం పొందకముందు వాక్యం
నేను ఆత్మను, నాకు శరీరం ఉంది – జ్ఞానం పొందాక వాడే వాక్యం

పై వాక్యంనుంచి కింద వాక్యానికి రావటమే తత్త్వీభూతః. తానే తత్త్వం అని అర్థం చేసుకున్న వ్యక్తి.

**తదారామః** – తనలోనే రమిస్తాడు. ఈ ఆత్మజ్ఞానం పొందితేనే, గొప్ప ఆనందాన్ని పొందుతాడు. తన స్వస్వరూపం ఆనందస్వరూపం అని తెలుసుకోవటమే అతనికి గొప్ప ఆనందాన్నిస్తుంది. అతనికి వేరే ఏ ఆనందమూ అవసరం లేదు. నేను వేదాంతం అధ్యయనం చేసీ చేసీ విసుగుపుడుతున్నది, నాకు ఏదైనా ఆనందం కావాలి అని అన్నాడంటే, అతనికి వేదాంతం సరిగ్గా అర్థం కానట్టు అర్థం.

తదారామః అంటే బ్రహ్మే అతనికి ఆనందహేతువు. అంతమాత్రాన అతను బాహ్య ఆనందాన్ని పట్టించుకోడని కాదు అర్థం. బాహ్యంగా కలిగే ఆనందం అతనికి బోనస్. జ్ఞానిని యు.పి.యస్‌తో పోల్చవచ్చు. యు.పి.యస్. అంటే అన్‌ఇంటరప్టెడ్ పవర్ సప్లై. బాహ్యంగా కరెంట్ ఉన్నా లేకపోయినా కూడా, యు.పి.యస్. ఉంటే మీరు నిశ్చింతగా

ఉన్నట్టుగా జ్ఞాని బాహ్యంగా ఆనందం దొరికినా, దొరకకపోయినా ఆనందంగా ఉంటాడు. అతనిది అన్‌ఇంటరప్టెడ్ ప్లెజర్ సప్లై. అతనే ఆనంద స్వరూపుడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** – గీత

**తత్త్వాదప్రచ్యుతో భవేత్** – ఇంక అప్పటినుంచి, తత్త్వంనుంచి జారిపోని వ్యక్తిగా ఉంటాడు.

జ్ఞాని నిదిధ్యాసనం తర్వాత జ్ఞాననిష్ఠలో నెలకొనివుంటాడు. తన ప్రజ్ఞను స్థితప్రజ్ఞగా మలుచుకుంటాడు. అప్రచ్యుతః. వ్యవహారం నడుపుతున్నా కూడా జ్ఞానంనుంచి జారిపోడు. సైకిల్ తొక్కటంలో ఆరితేరినవ్యక్తి, ఎంత రద్దీ ఉన్న వీధిలో నడుపుతున్నా, ఎలా బ్యాలెన్స్ తప్పకుండా నడుపుతాడో, అలాగే జ్ఞాని ఎంత వ్యవహారం నడుపుతున్నా కూడా జ్ఞాననిష్ఠలో నిలబడతాడు.

**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥**

అటువంటి వ్యక్తిని జీవన్ముక్తుడు అంటారు. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జ్ఞానం పొందిన వ్యక్తికి కలిగే ఫలం జీవన్ముక్తి. ఈ కారికలో ఫలం చూశాము.

**ఫలమ్ – చిత్ రూపేణ అంతః సత్ రూపేణ బహిః సర్వదా పశ్యతి**

**తత్త్వాదప్రచ్యుతో భవేత్** – జ్ఞాని జ్ఞాననిష్ఠలో నెలకొని ఉంటాడు.

ఇక్కడితో జగత్‌యొక్క మిథ్యాత్వాన్ని నిరూపించే వైతథ్య ప్రకరణం ముగిసింది.

# అధ్యాయం 2 – వైతథ్య ప్రకరణం – సారాంశం

మాండూక్య కారికలు, మాండూక్యోపనిషత్తుయొక్క విశ్లేషణను చేస్తాయి. గౌడపాదాచార్యులవారు తన స్వంత ఆలోచనలను కాని, సిద్ధాంతాలను కాని కొత్తగా ప్రవేశపెట్టలేదు వీటిలో. ఉపనిషత్తులో సూచించిన భావాలనే, ఆయన స్పష్టంగా వ్యక్తీకరించారు అంతే.

ఈ పద్ధతిని శ్రుతి అర్థాపత్తి ప్రమాణం అంటారు. శ్రుతి పరోక్షంగా సూచించిన భావాన్ని ప్రత్యక్షంగా వివరించటం.

మాండూక్యోపనిషత్తులో ఏడవ మంత్రం చాలా కీలకమైన మంత్రం. అది ఆత్మయొక్క నాలుగవ పాదమైన తురీయాన్ని నిర్వచిస్తుంది. గౌడపాదాచార్యులవారు తన కారికల్లో ఈ మంత్రాన్ని చాలా విపులంగా చర్చించారు. అందులో ఈ మంత్రంలోంచి రెండు పదాలను ప్రత్యేకంగా తీసుకున్నారు. ప్రపంచోపశమమ్ ఒకటి, అద్వైతమ్ ఒకటి. ప్రపంచోపశమమ్ పదాన్ని వైతథ్య ప్రకరణం పేరిట రెండవ అధ్యాయంలోను, అద్వైతమ్ పదాన్ని అద్వైత ప్రకరణం పేరిట మూడవ అధ్యాయంలోనూ వివరించారు.

ప్రపంచోపశమమ్ అంటే ఏమిటి? ప్రపంచంనుంచి విడివడటం.

**ప్రపంచస్య ఉపశమః అభావః యస్మిన్ సః ప్రపంచోపశమః**

ప్రపంచంనుంచి విడివడింది అంటే ఏది విడివడింది? తురీయం. తురీయం ప్రపంచ రహితం. అంటే తురీయ దృష్ట్యా, ఉపనిషత్తు ప్రపంచాన్ని మిథ్యగా కొట్టివేస్తున్నది.

జగత్తును కొట్టివేయటంలోని అంతరార్థం ఏమిటి? ఉపనిషత్తు జగత్తుయొక్క అనుభవాన్ని కొట్టివేయలేదు. ఎందుకంటే మనం దాన్ని అనుభవిస్తున్నాము. జగత్తు అనుభవంలోకి వస్తున్నది అనే విషయాన్ని ఉపనిషత్తు కాని, గౌడపాదాచార్యులవారు ఖండించలేదు. నిజానికి మనం గౌడపాదాచార్యులవారి కారికలు నేర్చుకోగలుగుతున్నామంటేనే, జగత్తును అనుభవించటంవల్ల. అంతగా అనుభవంలోకి వస్తున్న జగత్తును ఉపనిషత్తు ఎందుకు కొట్టివేస్తున్నది? ఎందుకంటే జగత్తు అనుభవంలోకి వస్తున్నది కాని నిజానికి అది ఉన్నా లేనట్టే. అంటే జగత్తు వ్యవహారం నడపటానికి మాత్రమే ఉంది కాని నిజంగా లేదు. ఇంకొక భాషలో చెప్పాలంటే జగత్ మిథ్య.

ప్రపంచోపశమం పదం ప్రపంచంయొక్క ఈ మిథ్యాత్వ నిశ్చయం చేస్తుంది. అందువల్ల ఆ విషయాన్ని లోతుగా విశ్లేషించారు గౌడపాదాచార్యులవారు రెండవ అధ్యాయంలో. మిథ్యాత్వానికి అనేక పర్యాయపదాలు ఉన్నాయి. అవి అసత్యం, మిథ్య, అనృతం, మృషా, వైతథ్యం. అందువల్ల ఈ అధ్యాయానికి వైతథ్య ప్రకరణం అనే పేరు వచ్చింది. జగత్తు

గురించి చెబుతుంది కాబట్టి జగత్ వైతథ్య ప్రకరణం అనికూడా అనవచ్చు. ఈ ప్రకరణంలో జగత్తు అంటే ఆత్మయొక్క మూడు పాదాల్లో వర్ణించిన మూడు జంటలు వస్తాయి. అవి-

| | | |
|---|---|---|
| జాగ్రత్ పురుషుడు | + | జాగ్రత్ ప్రపంచం |
| స్వప్నపురుషుడు | + | స్వప్నప్రపంచం |
| సుప్తపురుషుడు | + | కారణప్రపంచం |

ఈ మూడూ మిథ్యే. ఆత్మయొక్క పాదత్రయాన్ని మిథ్య అని నిరూపిస్తున్నది కాబట్టి ఈ అధ్యాయాన్ని పాదత్రయ వైతథ్య ప్రకరణం అనికూడా అనవచ్చు. ఈ అధ్యాయంయొక్క పేరు వివరణ ఇది. ఈ అధ్యాయంలో 38 కారికలు ఉన్నాయి.

వైతథ్య ప్రకరణంలో ముఖ్యంగా ఐదు అంశాలు ఉన్నాయి.

1. స్వప్నప్రపంచ మిథ్యాత్వమ్ - కారికలు 1-3
2. జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ - కారికలు 4-18
3. కల్పనా ప్రకారాః - కారికలు 19-29
4. ఉపసంహారః - కారికలు 30-34
5. సాధనాని, ఫలమ్ - కారికలు 35-38

### 1. స్వప్నప్రపంచ మిథ్యాత్వమ్ - కారికలు 1-3

జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ నిరూపించే ముందు గౌడపాదాచార్యులవారు స్వప్నప్రపంచ మిథ్యాత్వాన్ని నిరూపించదలుచుకున్నారు. ముందు స్వప్నప్రపంచం మిథ్య అనే అంశాన్నే స్వీకరించలేకపోతే, జాగ్రత్ ప్రపంచం మిథ్య అని ఎలా ఒప్పుకుంటారు? పైగా స్వప్నప్రపంచ ఉదాహరణ, జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వాన్ని నిరూపించటానికి అక్షరాలా సరిపోతుంది. స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ అతని స్వప్నం, స్వప్నం అని తెలియదు. అది సత్యం అనుకుంటాడు. కాకపోతే దాన్నుంచి లేవగానే ఎవరూ చెప్పకుండానే అది మిథ్య అని తెలుస్తుంది. ఇది అర్థమయితే, జాగ్రత్ ప్రపంచం స్వప్నం-2 అని తేలికగానే అర్థం చేసుకోవచ్చు.

స్వప్నప్రపంచం కూడా జాగ్రత్ ప్రపంచంలాగా సత్యం అనే దార్శనికులు ఉన్నారు. అందువల్ల స్వప్నప్రపంచం మిథ్య అని శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాల ద్వారా గౌడపాదాచార్యులవారు నిరూపించారు.

ఎ) **శ్రుతి ప్రమాణం** - బృహదారణ్యకోపనిషత్తులోని నాలుగవ అధ్యాయంలో మూడవ బ్రాహ్మణం అయిన స్వయంజ్యోతి బ్రాహ్మణంలో అవస్థాత్రయ విశ్లేషణ అద్భుతంగా సాగుతుంది.

**న తత్ర రథా న రథయోగా న పంథానో భవంతి అథ రథాన్ రథయోగాన్ పథః సృజతే**

స్వప్నప్రపంచంలో నిజంగా రథాలు లేవు, రథగుర్రాలు లేవు, మార్గాలు లేవు, కాని వాటన్నిటినీ మనస్సు ద్వారా సృష్టిస్తున్నాడు. రూపంలేని ఆలోచనలు, రూపం ఉన్న వస్తువులుగా కనబడుతున్నాయి.

బి) **యుక్తి ప్రమాణం** – తార్కికంగా స్వప్నం మిథ్య అని నిరూపించారు.

**యత్ర యత్ర ఉచితదేశ కాల అభావః తత్ర తత్ర మిథ్యాత్వమ్**

ఎక్కడ ఉచితదేశం కాని, కాలం కానీ లేదో, అది మిథ్య. స్వప్నప్రపంచంలోని వస్తువులకు ఉచితదేశం కాని, కాలం కాని లేదు. ఉదాహరణకు స్వప్నంలో అనేక ఏనుగులను చూస్తారు. కాని అందులో ఒక్క ఏనుగు కూడా మీ మనస్సులో పట్టదు. అలాగే మీరు అమెరికా వెళ్ళి, ఎమ్మెస్ చదివి, పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కన్నట్టుగా కలలు కంటారు. ఇవన్నీ జరగాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుంది. కాని స్వప్నం సమయం 90 క్షణాలు మాత్రమే.

**స్వప్న ప్రపంచః మిథ్యా ఉచితదేశ కాల అభావాత్ దర్పణస్థ హస్తివత్**

అద్దంలో ఉన్న ఏనుగులాగా, స్వప్నప్రపంచం కూడా మిథ్య.

సి) **అనుభవ ప్రమాణం** – మీ అనుభవం కూడా మీరు నిద్ర లేచేసరికి, స్వప్నంలో చూసినవన్నీ మటుమాయమైపోతాయని చూపిస్తుంది. కలలో సంపాదించిన డబ్బు, ఇల్లు, ఇలలో ఉండవు. కాశీలో మీరు రోడ్డుమీద ఆవు గుద్ది కిందపడితే, మీరు నిద్ర లేచినప్పుడు మీ ఏ.సి. గదిలో ఉన్నారు. అందువల్ల అనుభవ ప్రమాణం కూడా మీరు నిజంగా కాశీకి వెళ్ళలేదని చూపిస్తున్నది.

**2. జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 4-18**

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు మనం నమ్మలేని సత్యాన్ని వెల్లడి చేశారు. అది నమ్మలేకపోయినా సత్యం సత్యమే. స్వప్నంలో ఉండగా స్వాప్నికుడు అది సత్యం కాదని ఎలాగైతే ఒప్పుకోడో, అలాగే జాగ్రత్ ప్రపంచం అనుభవిస్తుండగా, జాగ్రత్ పురుషుడు కూడా అది సత్యం కాదని ఒప్పుకోడు. అతను ఒప్పుకోనంత మాత్రాన జాగ్రత్ ప్రపంచం సత్యం అవదు. అది నిరూపించటానికి యుక్తి ప్రమాణాన్ని తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు. దానికి రెండు కారణాలు చెప్పారు. ఒకటి పరోక్ష కారణం, ఇంకొకటి ప్రత్యక్ష కారణం.

ఎ) **పరోక్ష కారణం** – దీన్ని **ప్రసిద్ధేనైవ హేతునా** అన్నారు గౌడపాదాచార్యులవారు. ప్రసిద్ధమైన కారణంవల్ల జాగ్రత్, స్వప్నప్రపంచాలు రెండూ మిథ్య. ఏమిటది?

**యత్ దృశ్యం తత్ మిథ్యా**

ఏదైతే చూస్తామో, అనుభవిస్తామో అది మిథ్య.

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

ఒక వస్తువును ప్రమేయం అనాలి అంటే దాన్ని ఒక ప్రమాత చూడాలి. అంటే ప్రమాత చూస్తేనే ప్రమేయానికి ఉనికి ఉంది. జాగ్రత్ ప్రపంచాన్ని జాగ్రత్ పురుషుడు చూస్తేనే దానికి ఉనికి ఉంది. అతను పడుకుంటే, ఆ ప్రపంచం కూడా పడుకుంటుంది. వేదాంత సూత్రం – దేనికైతే స్వతంత్ర సత్తా లేదో అది మిథ్య. జాగ్రత్ ప్రపంచం దృశ్యం కాబట్టి అది కూడా మిథ్యే.

జాగ్రత్ ప్రపంచమే కాదు, ఏ స్వర్గలోక అనుభవమో తీసుకున్నా, అది కూడా మిథ్యే. ఆ అనుభవం ఆ స్వర్గలోకవాసి చూస్తేనే కలుగుతుంది. అంటే సాధారణ ప్రపంచం సాధారణ ప్రమాతమీద ఆధారపడివుంటే, అసాధారణ ప్రపంచం అసాధారణ ప్రమాతమీద ఆధారపడి ఉంటుంది. ఏదేమైనా అది దృశ్యం అయితే అది మిథ్య. ఎందుకంటే దాన్ని చూసే దృక్ ఉండాలి.

**దృక్ సత్యం దృశ్యం మిథ్యా**

బి) **ప్రత్యక్ష కారణం** – ఏదైతే అనిత్యమో అది మిథ్య.

**యత్ ఆద్యంతవత్ యత్ జన్మమరణవత్ యత్ అనిత్యం తత్ మిథ్యా**

ఏ వస్తువుకైనా ఉనికి కాసేపే ఉంటుంది. ఎప్పుడైతే దాని ఉనికి మూడునాళ్ళ ముచ్చటే అవుతుందో, అప్పుడే దాని స్వరూపం ఆగంతుక స్వరూపం అవుతుంది. అరువు తెచ్చుకున్న ఉనికి ఉన్నా లేనట్టే కాబట్టి అది మిథ్య అవుతుంది. ఇదే సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే జగత్తు సృష్టికి ముందు లేదు, ప్రళయంలో లేదు, మధ్యలో వచ్చి, మధ్యలో పోతుంది. అరువు తెచ్చుకున్న అనిత్యమైన ఉనికితో ఉన్న జగత్తు ఉన్నా లేనట్టే.

**యత్ అనిత్యమ్ తత్ మిథ్యా** ఏది అనిత్యమో అది మిథ్య.

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

ఇక్కడ ఉచితదేశ కాల అభావాత్ అనే తర్కం ఉపయోగించటం లేదు. అది స్వప్న ప్రపంచానికే వర్తిస్తుంది. జాగ్రత్ ప్రపంచం మిథ్య అని చూపటానికి కారణాలు – దృశ్యత్వాత్, అనిత్యత్వాత్.

ఈ సందర్భంలో జాగ్రత్ ప్రపంచం సత్యం అనే వారి వాదనలను నాలుగు కారణాల ద్వారా ఖండించారు గౌడపాదాచార్యులవారు. అవి – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది

**నాలుగు నిర్వచనాల ఖండన**

నాలుగు నిర్వచనాలు – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది.

| నిర్వచనం | | ఖండన |
|---|---|---|
| ఎ) **ప్రయోజనం ఉంది** | – | స్వప్నవస్తువులను జాగ్రత్‌లో వాడలేము నిజమే, కాని జాగ్రత్ వస్తువులను కూడా స్వప్నంలో వాడలేము. |
| బి) **బాహ్యంగా ఉంది** | – | స్వప్నప్రపంచం నా మనస్సునుంచి వచ్చింది నిజమే, కాని తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నానుంచే వచ్చింది. |
| సి) **నాకు భిన్నంగా ఉంది** | – | స్వప్నప్రపంచం నేను చూస్తేనే ఉంది నిజమే, కాని స్వప్నంలో కూడా కొన్ని వస్తువులు నేను చూడకపోయినా ఉంటాయి. నేను తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నాకు భిన్నంగా ఉండదు. |
| డి) **స్పష్టంగా ఉంది** | – | స్వప్నప్రపంచంనుంచి లేస్తే స్పష్టంగా లేనట్టు అనిపిస్తుంది నిజమే, కాని అందులో ఉండగా స్పష్టంగా ఉన్నట్టే ఉంటుంది. తురీయానికి లేస్తే రెండూ మిథ్యే. |

ఇక్కడ నాలుగు దశల్లో చూడాలి.

1. స్వప్నం, స్వప్నావస్థలో ఉండగా సత్యం
2. స్వప్నంనుంచి జాగ్రదావస్థకు లేస్తే స్వప్నం మిథ్య
3. జాగ్రత్ ప్రపంచం జాగ్రదావస్థలో సత్యం
4. జాగ్రదావస్థనుంచి తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం మిథ్య

జాగ్రదావస్థనుంచి తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం మిథ్య. చూసేవారు ముగ్గురు– స్వప్నపురుషుడు, జాగ్రత్ పురుషుడు, జ్ఞాని.

అయితే రెండూ సత్యం అవాలి; లేదా రెండూ మిథ్య అవాలి.అలా అవాలంటే పోలిక రెండూ ఆ అవస్థల్లో ఉండగా చూడాలి లేదా ఆ అవస్థలనుంచి లేచాక చూడాలి. అసలు పోలికలే తప్పు. స్వప్నప్రపంచంనుంచి లేచాక పొందే అనుభవాన్ని, జాగ్రద్ ప్రపంచంలో ఉండగా పోలుస్తున్నారు.

అందువల్ల ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది అనే కారణాలు చెల్లవు.

స్వప్నప్రపంచం, జాగ్రత్ ప్రపంచం రెండూ మిథ్య అయితే, మరి ఏమిటి సత్యం? మిథ్యా వస్తువుకు సత్య అధిష్ఠానం లేకుండా ఉనికి లేదు. చూడబడుతున్నవన్నీ మిథ్య అయితే, ఆత్యంతిక సత్యం దానికి భిన్నంగా ఉండాలి కదా? ఆత్యంతిక సత్యం ప్రమేయం కాదు, ప్రమేయం సత్యం కాదు కాబట్టి, అప్రమేయం సత్యం అవాలి. ఉనికి ఉండి, ప్రమేయం కానిది ఏమిటి? అదే తురీయ ఆత్మ. దీనికి గౌడపాదాచార్యులవారు రజ్జు-సర్ప భ్రాంతి ఉదాహరణను పేర్కొన్నారు. అక్కడ తాడును చూసి పాముగా పొరపాటు పడుతున్నాము. అంటే అజ్ఞానంనుంచి పొరపాటు వచ్చింది. అజ్ఞానం లేకపోతే పొరపాటుకు ఆస్కారం లేదు. తాడు లేకపోతేనూ, అజ్ఞానం కలుగదు. అందువల్ల తాడు అధిష్ఠానం; పాము అధ్యాస. అలాగే అధిష్ఠానం తురీయంమీద జగత్తు అధ్యాస. పాముమీద టార్చ్‌లైటు వేస్తే అధిష్ఠాన జ్ఞానం కలుగుతుంది. అలాగే శాస్త్రజ్ఞానం అనే టార్చ్‌లైటు వేస్తే, అధిష్ఠాన జ్ఞానం కలుగుతుంది.

**తురీయం సత్యం పాదత్రయం మిథ్యా**

3. **కల్పనా ప్రకారాః - కారికలు 19-29**

కల్పనా ప్రకారాః అంటే అనేక పొరపాట్లు.

**దృక్ ఆత్మ అజ్ఞానేన దృశ్య అజ్ఞాన ఉత్పత్తిః**

సత్యం కోసం బాహ్యవస్తువుల్లో వెతికితే అది ఎన్నటికీ దొరకదు. ఎందుకంటే వెతికే నేనే సత్యం. వెతకబడుతున్న వస్తువు కాదు సత్యం. ఈ విషయం మామూలు మనుష్యులే కాదు, దార్శనికులు కూడా మర్చిపోతున్నారు. సత్యాన్వేషణలో విజయం సాధించలేక పోతున్నారు. వారి అన్వేషణే సత్యదూరంగా సాగుతున్నది. సత్యంగా భావించబడే కొన్ని వస్తువులను ఉదాహరణగా చూస్తే - ప్రాణం, పంచభూతాలు, లోకాలు, దేవతలు, వేదాలు, కాలం, దిక్కులు మొదలైనవి. దార్శనికులు సత్యంగా పొరపాటు పడేవి విషయవస్తువులు, స్థూలశరీరం, యజ్ఞాలు, పుణ్యపాపాలు, గుణత్రయం, బుద్ధి, తత్త్వాలు మొదలైనవి.

వారు చేసే పెద్ద పొరపాటు వారు సత్యానికి అంతకంతకూ దూరమవుతున్నారు. కాని అది తెలియక వారు, వారు నమ్మినదే సత్యం అని గట్టిగా నమ్ముతారు. గౌడపాదాచార్యులవారు ఒక్కపక్క వారిమీద జాలి పడుతూనే, ఆశ కూడా వ్యక్తం చేస్తున్నారు. వారు మిథ్యా వస్తువునే సత్యంగా భావిస్తున్నా కూడా, ఎప్పుడో ఒకప్పుడు వారు మిథ్యా సిద్ధాంతంనుంచి సత్యబ్రహ్మకు వెళతారు అంటున్నారు. ఎందుకంటే ప్రతి మిథ్యావస్తువు వెనుక, ఒక సత్య అధిష్ఠానం ఉంటుంది.

సత్య జాగ్రత్ పురుషుడు లేనిదే, మిథ్యాస్వప్నం కనలేరు. అందువల్ల వారు మిథ్యా సిద్ధాంతాన్ని నమ్మినా కూడా, వారికి తెలియకుండానే సత్య అధిష్ఠానాన్ని నమ్ముతున్నారు.

శాస్త్రం ఎక్కడో ఒకచోట మొదలుపెట్టమనే చెబుతుంది. ఇష్టదేవత పూజతో మొదలుపెట్టినా, నెమ్మదిగా తురీయజ్ఞానానికి వస్తారు.

### 4. ఉపసంహారః - కారికలు 30-34

ఎలా ద్వైతంనుంచి అద్వైతానికి క్రమంగా రావాలో, ఈ కారికల్లో అద్భుతంగా వివరించ బడింది. తురీయమైన నేను సత్యం, జగత్తు మిథ్య - ఇదీ అద్వైతం సారాంశం. ద్వైతం ఉన్నచోట సంసారం తప్పదు. జ్ఞాని మాత్రమే ద్వైతదర్శనం చేస్తున్నా కూడా అది మిథ్య అని అర్థం చేసుకోగలడు. శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాల ద్వారా తురీయజ్ఞానాన్ని పొందిన వ్యక్తి మాత్రమే శాస్త్రాన్ని సరిగ్గా బోధించగలడు.

ద్వైతం మిథ్య అని నిరూపించటానికి మూడు ఉదాహరణలు ఇవ్వబడ్డాయి. అవి - స్వప్నం, ఇంద్రజాలం, గంధర్వనగరం. గౌడపాదాచార్యులవారు అద్వైతంలో ఒక్కొక్క మెట్టు ఎక్కిస్తున్నారు. స్వప్నంనుంచి జాగ్రత్ ప్రపంచానికి లేస్తే, స్వప్నం మిథ్య; అలాగే జాగ్రత్ ప్రపంచంనుంచి తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్యే. ఇంతవరకూ తెలుసు.

ఇక్కడ గౌడపాదాచార్యులవారు తురీయానికి లేస్తే, ఇంక మిగిలేది మౌనవ్యాఖ్యానమే అన్నారు. ద్వైతప్రపంచాన్ని మిథ్యగా కొట్టివేస్తే, అద్వైతానికి అద్వైతపు హోదా ఉండదు. అద్వైతం, సత్యం, చైతన్యం, నిర్గుణం, నిత్యం పదాలేవీ వాడలేము. ఎందుకంటే ఆ పదాలు వాడాలి అంటే వాటికి భిన్నంగా ద్వైతం, మిథ్య, జడం, సగుణం, అనిత్యం అయిన ప్రపంచాలు ఉండాలి. అద్వైతంలో ఉన్నదొకటే - అది తురీయం. జాగ్రత్తగా గమనించండి, తురీయం ఉంటుంది కాని తురీయం పదాన్ని కూడా వాడలేము. ఈ పదాలు వాడలేము కాబట్టి అద్వైతం పదం కూడా సాక్షికంగా మిథ్య అన్నారు గౌడపాదాచార్యులవారు. ద్వైతప్రపంచాన్ని ఖండించేటంతవరకూ ఈ పదాలకు ఉనికి; తర్వాత మౌనవ్యాఖ్యానమే!

తర్వాత ద్వైతప్రపంచాన్ని మిథ్యగా ఎలా కొట్టివేయవచ్చో, పూర్తిగా కొత్తకోణంలోంచి చూపించారు. ద్వైతప్రపంచం చైతన్యంతో కలిసిలేదు, దానికి భిన్నంగా లేదు. దానిలో ఒక భాగమూ కాదు అని నిరూపించారు. అలా ప్రపంచం మిథ్య అని చెప్పాలంటే, రెండు వాక్యాల్లో చెప్పవచ్చు.

- మిథ్యా జగత్తు ఉంది.
- సత్య జగత్తు లేదు.

ఈ రెండు వాక్యాల్లో ఏది సరియైనది? నువ్వు తెలివైనవాడిలా ఉన్నావు, నీకు తెలివి లేదు. ఈ రెండు వాక్యాల్లో ఏది సరియైనది? రెండింటి అర్థం ఒకటే. వేదాంతంలో జగత్తు ఉంది, జగత్తు లేదు అనే ఈ రెండు వాక్యాలూ చూస్తూ ఉంటాము. జగత్తు ఉంది అని వస్తే, మిథ్యా పదం విశేషణంగా కలుపుకోవాలి. అప్పుడు అది మిథ్యాజగత్తు ఉంది అవుతుంది.

జగత్తు లేదు అంటే సత్య పదం విశేషణంగా కలుపుకోవాలి. అప్పుడు అది సత్యజగత్తు లేదు అవుతుంది. జగత్తును మిథ్య అంటే తురీయ దృష్ట్యా అనే విషయాన్ని మర్చిపోకూడదు. విశ్వ, తైజస, ప్రాజ్ఞల దృష్ట్యా జగత్తు మహాసత్యం.

ఈ కారికల సారం – **తురీయం సత్యం పాదత్రయం మిథ్యా**

5. **సాధనాని, ఫలమ్ – కారికలు 35–38**

నాలుగు సాధనలు, జ్ఞానఫలం చెప్పబడ్డాయి వీటిలో.

ఎ) **సాధన చతుష్టయ సంపత్తి** – అధికారి రాగం, భయం, క్రోధం నుంచి విడివడాలి. దీన్ని **వీతరాగభయక్రోధః** పదాలు సూచిస్తాయి. ఇది శమాదిషట్కసంపత్తిని సూచిస్తుంది. **మునిభిః** అంటే వివేకం కలిగి ఉండాలి. ఈ పదాలు సాధన చతుష్టయ సంపత్తిని సూచిస్తాయి.

బి) **వేదాంతశ్రవణమననాలు** – వేదాంతాన్ని ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలి. వేదసారం జ్ఞానం మాత్రమే, కర్మ, ఉపాసన కాదు అని తెలుసుకోవాలి. ఇందులో మననం కూడా కలుపుకోవాలి. వీటిని **వేదపారగైః** పదం సూచిస్తుంది.

సి) **నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం మధ్యమ అధికారికి అవసరం. అతను తను పొందిన జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవటానికి అది తోడ్పడుతుంది. తను నేర్చుకున్న వేదాంత బోధనుంచి, తురీయం నిర్వచనాన్ని నెమరువేసుకోవాలి. దీన్ని **అద్వైతే యోజయేత్ స్మృతమ్** పదం సూచిస్తుంది.

డి) **సన్న్యాస ఆశ్రమం (కావాలనుకుంటే)** – ఒక సాధకుడు కావాలంటే సన్న్యాసం స్వీకరించవచ్చు లేదా గృహస్థాశ్రమంలోనే ఉంటూ, ఆంతర సన్న్యాసం స్వీకరించవచ్చు. దీన్ని **యతిః భవేత్** పదాలు సూచిస్తాయి.

**జ్ఞానఫలం** – జ్ఞానం పొంది, నిదిధ్యాసనం చేస్తే జ్ఞాననిష్ఠలో నిలబడతాడు జ్ఞాని. అంటే అతనికి తురీయ దర్శనం కలుగుతుంది.

**చిత్ రూపేణ అంతః సత్ రూపేణ బహిః సర్వదా పశ్యతి**

చిత్ (చైతన్యం) రూపంలో అంతరంగంలోనూ, సత్ (ఉనికి) రూపంలో బాహ్యంగానూ ఎప్పుడూ చూస్తాడు. ఈ సత్ చిత్ ఆత్మ తానే అనే అర్థం చేసుకుంటాడు. ఆత్మలోనే రమిస్తాడు. అప్పటినుంచి, తత్త్వంనుంచి జారిపోడు. అటువంటి వ్యక్తిని జీవన్ముక్తుడు అంటారు. దీన్ని **తత్త్వాదప్రచ్యుతో భవేత్** పదాలు సూచిస్తాయి.

ఇక్కడితో జగత్‌యొక్క మిథ్యాత్వాన్ని నిరూపించే వైతథ్య ప్రకరణం ముగిసింది.

# అధ్యాయం 2 వైతథ్య ప్రకరణం - ముఖ్యాంశాలు

ఉపనిషత్తులోని ఏడవ మంత్రంలోని ప్రపంచోపశమమ్ పదానికి గౌడపాదాచార్యులవారి వ్యాఖ్యానము.

ప్రపంచోపశమమ్ = ప్రపంచమిథ్యాత్వం = ప్రపంచ వైతథ్యం.

ప్రపంచం అంటే మాండూక్యంలో మూడు పాదాలు - పాదత్రయ వైతథ్య ప్రకరణము.

**ఈ ప్రకరణములో ఐదు అంశాలు ఉన్నాయి**

1. స్వప్న ప్రపంచ మిథ్యాత్వమ్ - కారికలు 1-3
2. జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ - కారికలు 4-18
3. కల్పనా ప్రకారాః - కారికలు 19-29
4. ఉపసంహారః - కారికలు 30-34
5. సాధనాని, ఫలమ్ - కారికలు 35-38

1. **స్వప్న ప్రపంచ మిథ్యాత్వమ్ - కారికలు: 1-3**

యుక్తి, అనుభవ శ్రుతి ప్రమాణాల ద్వారా స్వప్నం మిథ్య అని నిరూపించారు.

ఎ) **యుక్తి ప్రమాణం** - ఉచిత దేశకాల అభావం

స్వప్న ప్రపంచః మిథ్యా ఉచితదేశకాల అభావాత్ దర్పణస్థ హస్తివత్

బి) **అనుభవ ప్రమాణం** - కలలో ఉన్న ఊరిలో నిద్రలేవము. మన గదిలో లేస్తాము.

సి) **శ్రుతి ప్రమాణం** -

**న తత్ర రథా న రథయోగాః న పంథానో భవంతి అథ రథాన్**

**రథయోగాన్ పథః చ సృజతే** - బృహదారణ్యకమ్ 4.3

అక్కడ (స్వప్నప్రపంచంలో) నిజంగా రథాలు లేవు. రథాన్నిలాగే గుర్రాలు లేవు, మార్గాలు లేవు కాని వీటన్నింటినీ స్వాప్నికుడు సృష్టిస్తున్నాడు.

2. **జాగ్రద్ ప్రపంచ మిథ్యాత్వమ్ - కారికలు: 4-18**

రెండు కారణాలు - పరోక్ష కారణం, ప్రత్యక్ష కారణం.

ఎ) **పరోక్ష కారణం - ప్రసిద్ధేనైవ హేతునా** 2.5

మనం చూస్తున్నాము కాబట్టి జాగ్రత్ ప్రపంచం మిథ్య

అనుమానవాక్యం - జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్న ప్రపంచవత్

వ్యాప్తివాక్యం - యత్ యత్ దృశ్యం తత్ తత్ మిథ్యా

ప్రమాత, ప్రమాణం చూస్తేనే ప్రమేయానికి ఉనికి ఉంది.

బి) **ప్రత్యక్ష కారణం – వితథైస్సదృశాస్సంతోఽ వితథా ఇవ లక్షితాః ॥ 2.6**

జాగ్రద్ ప్రపంచం అనిత్యం కాబట్టి మిథ్య

అనుమానవాక్యం – జాగ్రద్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్న ప్రపంచవత్

వ్యాప్తివాక్యం – **యత్ అనిత్యమ్ తత్ మిథ్యా । యత్ నిత్యం తత్ సత్యమ్**

అనిత్య వస్తువుకు స్వతంత్ర సత్తా ఉండదు; అది ఆగంతుకం అవుతుంది. అందువల్ల అది మిథ్య. ఏదైతే స్వస్వరూపమో అది నిత్యం.

**నాలుగు నిర్వచనాల ఖండన**

నాలుగు నిర్వచనాలు – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది.

ఎ) **ప్రయోజనం ఉంది** – స్వప్నవస్తువులను జాగ్రత్‌లో వాడలేము నిజమే, కాని జాగ్రత్ వస్తువులను కూడా స్వప్నంలో వాడలేము.

బి) **బాహ్యంగా ఉంది** – స్వప్నప్రపంచం నా మనస్సునుంచి వచ్చింది నిజమే, కాని తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నానుంచే వచ్చింది.

సి) **నాకు భిన్నంగా ఉంది** – స్వప్నప్రపంచం నేను చూస్తేనే ఉంది నిజమే, కాని స్వప్నంలో కూడా కొన్ని వస్తువులు నేను చూడకపోయినా ఉంటాయి. నేను తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నాకు భిన్నంగా ఉండదు.

డి) **స్పష్టంగా ఉంది** – స్వప్నప్రపంచంనుంచి లేస్తే స్పష్టంగా లేనట్టు అనిపిస్తుంది నిజమే, కాని అందులో ఉండగా స్పష్టంగా ఉన్నట్టే ఉంటుంది. తురీయానికి లేస్తే రెండూ మిథ్యే.

ఇక్కడ నాలుగు దశల్లో చూడాలి.

1. స్వప్నం, స్వప్నావస్థలో ఉండగా సత్యం
2. స్వప్నంనుంచి జాగ్రదావస్థకు లేస్తే స్వప్నం మిథ్య
3. జాగ్రత్ ప్రపంచం జాగ్రదావస్థలో ఉండగా సత్యం
4. జాగ్రదావస్థనుంచి తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం మిథ్య.

జాగ్రదావస్థనుంచి తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం మిథ్య. చూసేవారు ముగ్గురు– స్వప్నపురుషుడు, జాగ్రత్ పురుషుడు, జ్ఞాని.

అయితే రెండూ సత్యం అవాలి; లేదా రెండూ మిథ్య అవాలి.అలా అవాలంటే పోలిక రెండూ ఆ అవస్థల్లో ఉండగా చూడాలి లేదా ఆ అవస్థలనుంచి లేచాక చూడాలి. అసలు

పోలికలే తప్పు. స్వప్నప్రపంచంనుంచి లేచాక పొందే అనుభవాన్ని, జాగ్రద్ ప్రపంచంలో ఉండగా పోలుస్తున్నారు.

రెండూ మిథ్య అయితే ఏది సత్యం?

తురీయం లేదా బ్రహ్మ సత్యం, జగత్ మిథ్యా.

ప్రపంచాన్ని నాలుగు విధాలుగా వర్ణిస్తుంది మాండూక్యం

ఎ) విశ్వ–విరాట్ జంట + తైజస–హిరణ్యగర్భ జంట + ప్రాజ్ఞ–ఈశ్వర జంట = 6

బి) స్థూలశరీరం–స్థూలప్రపంచం + సూక్ష్మశరీరం–సూక్ష్మప్రపంచం + కారణ శరీరం–కారణ ప్రపంచం = 6

సి) ఆత్మయొక్క ప్రథమ పాదము + ద్వితీయ పాదము + తృతీయ పాదము – పాదత్రయము = 3

డి) మొదటి రెండు పాదాలు కార్యం + మూడవ పాదం కారణం = 3

కార్యకారణాత్మక ప్రపంచ మిథ్యాత్వ నిశ్చయమ్

3. **కల్పనా ప్రకారాః – కారికలు: 19–29**

కల్పనా ప్రకారాః అంటే అనేక పొరపాట్లు.

**దృక్ ఆత్మా అజ్ఞానేన దృశ్య అజ్ఞాన ఉత్పత్తిః**

చూస్తున్న నేనే ఆత్మను (తురీయాన్ని) అని తెలియక బాహ్యవస్తువు సత్యం అనుకుని పొరపాటు పడుతున్నారు.

మామూలు మనుష్యులే కాదు, దార్శనికులు కూడా పొరపాటు పడుతున్నారు.

| | | |
|---|---|---|
| చార్వాక | 1 – విషయా ఇతి తద్విదః | – విషయవస్తువులే పరమం |
| | 2 – స్థూల ఇతి చ తద్విదః | – శరీరమే సత్యం |
| పూర్వమీమాంస | 1 – యజ్ఞా ఇతి చ తద్విదః | – వేదపూర్వభాగం అర్థం తెలుసుకోవాలి |
| | 2 – ధర్మాధర్మేచ తద్విదః | – పుణ్యపాపాలు సత్యం<br>కృతి మహోదధౌ పతనకారణం<br>ఫలమశాశ్వతం గతి నిరోధకం |
| సాంఖ్య | 1 – భోక్తా ఇతి చ భోక్తృవిదః | – ఆత్మ కర్త కాదు కాని భోక్త |
| | 2 – పంచవింశక ఇత్యేకే | – 25 తత్త్వాలే సత్యం |
| జైనులు | – సూక్ష్మ ఇతి సూక్ష్మవిదః | – ఆత్మ సూక్ష్మం, అనేక ఆత్మలు ఉన్నాయి |
| బౌద్ధులు | 1 – అమూర్త ఇతి చ తద్విదః | – శూన్యం సత్యం |
| | 2 – బుద్ధిరితి తద్విదః | – క్షణిక విజ్ఞానవాదం సత్యం |
| యోగదర్శనం | 1 – షడ్వింశ ఇతి చాపరే | – 26 తత్త్వాలు |

4. **ఉపసంహారః - కారికలు: 30-34**

అద్వైతానికి ఎదిగితే ద్వైతం మిథ్య

ఉదా. స్వప్నం, మాయ, గంధర్వనగరం.

**తురీయదృష్ట్యా సృష్టి లేదు, లయ లేదు, జీవుడు లేదు, బంధం లేదు, మోక్షం లేదు, సాధన అవసరం లేదు; సాధకుడే లేదు.**

అద్వైతం స్థాయికి ఎదిగితే అద్వైతం పదం కూడా లేదు - మౌనవ్యాఖ్యానం.

జగత్తుకు తురీయానికి మధ్య -

పోలిక లేదు - జగత్తు జడం, తురీయం సత్యం

భాగం కాదు - తురీయం నిరవయం

భిన్నంగా లేదు - తురీయం అద్వైతం

ప్రపంచోపశమోఽద్వాయః

5. **సాధనాని - కారికలు: 35-38**

ఎ) సాధన చతుష్టయ సంపత్తి - వీతరాగభయక్రోధః, మునిభిః

బి) వేదాంత శ్రవణమననాలు - వేదపారగైః

సి) నిదిధ్యాసనం - అద్వైతే యోజయేత్ స్మృతిమ్

డి) సన్న్యాసం (కావాలనుకుంటే) - యతిః

ఫలం - చిత్‌రూపేణ అంతః సత్‌రూపేణ బహిః సర్వదా పశ్యతి

తత్త్వాద అప్రచ్యుతో భవేత్ - జ్ఞాని జ్ఞాననిష్ఠలో నెలకొని ఉంటాడు.